بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly **BADAR**
Qadian

సంపుటి: 11 www.akhbarbadr.in సంచిక: 28-29

సంపాదకులు: హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్,
ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్.

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

یٰۤاَیُّہَا الَّذِیۡنَ اٰمَنُوۡا لَا تَخُوۡنُوا اللّٰہَ وَ الرَّسُوۡلَ وَ تَخُوۡنُوۡۤا اَمٰنٰتِکُمۡ وَ اَنۡتُمۡ تَعۡلَمُوۡنَ

అనువాదం: ఓ విశ్వాసులారా! మీరు అల్లాహ్‌ను, (అతని) ప్రవక్తను మోసము చేయకుడు. అలా చేసినచో, దాని ఫలితముగా మీరు తమను తాము మోసగించుకున్నవారగుదురు. నిజానికి (అట్టి మోసంను గూర్చి) మీకు తెలుసు. (అన్‌ఫాల్ : 28)

وَلَا تُجَادِلۡ عَنِ الَّذِیۡنَ یَخۡتَانُوۡنَ اَنۡفُسَہُمۡ ؕ اِنَّ اللّٰہَ لَا یُحِبُّ مَنۡ کَانَ خَوَّانًا اَثِیۡمًا

అనువాదం: తమను తాము వచించుకొను వారి పక్షము వహించి వాదించకుము. నిశ్చయముగా అల్లాహ్ ద్రోహ బుద్దులు గల మహా పాపత్ములను ప్రేమించడు. (అన్నిసా: 108)

తేది: 09-16 జులై 2026 క్రీ, శ. 09-16 వఫా 1405 హి, శ. 23-30 ముహర్రం 1448 హి,ఖ.

ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు:

## మోసం చేయడం కపటుడి అలవాట్లలో ఒక అలవాటు.

عَنْ عَبْدِ اللَّهِ بْنِ عَمْرٍو، قَالَ: قَالَ رَسُولُ اللَّهِ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ: "أَرْبَعٌ مَنْ كُنَّ فِيهِ كَانَ مُنَافِقًا خَالِصًا، وَمَنْ كَانَتْ فِيهِ خَلَّةٌ مِنْهُنَّ، كَانَتْ فِيهِ خَلَّةٌ مِنْ نِفَاقٍ حَتَّى يَدَعَهَا، إِذَا حَدَّثَ كَذَبَ، وَإِذَا عَاهَدَ غَدَرَ، وَإِذَا وَعَدَ أَخْلَفَ، وَإِذَا خَاصَمَ فَجَرَ". غَيْرَ أَنَّ فِي حَدِيثِ سُفْيَانَ: وَإِنْ كَانَتْ فِيهِ خَصْلَةٌ مِنْهُنَّ، كَانَتْ فِيهِ خَصْلَةٌ مِنَ النِّفَاقِ.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమర్ రజియల్లాహు అన్‌హు ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారు ఇలా తెలిపారు: ఈ నాలుగు అలవాట్లు ఏ వ్యక్తిలోనైన ఉన్నట్లయితే అతడు ఖచ్చితముగా కపటుడే. ఎవరిలోనైన వాటిలోని ఏ ఒక్కటి ఉన్నా కూడ అతనిలో కపటత్వపు భీజం ఉన్నట్లే. ఒకవేళ దూరం చేసుకున్నచో (లేనట్లు). ఆ నాలుగు అలవాట్లు ఇలా గలవు: అతనిని నమ్మినప్పుడు మోసం చేస్తాడు. మాట్లాడునప్పుడు అబద్ధం పలుకుతాడు. ఒప్పందం చేసుకున్నప్పుడు ఉల్లంఘించుతాడు. ఎవరితోనైన గొడవపడినప్పుడు దుషణలకు పాల్పడుతాడు. (ముస్లిం కితాబుల్ ఈమాన్, బాబ్ బయాను ఖిసాలుల్ మునాఫిఖ్)

## న్యాసము చెల్లింపులోనే మానవుని విశిష్టత కలదు.

(ఉపదేశములు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం)

**హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ ( మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని గారు) అలైహిస్సలాతు వస్సలాం ఇలా పేర్కొన్నారు:**

ప్రతి నిజమైన విశ్వాసి యొక్క స్థితి ఇలాగే ఉంటుంది. ఒకవేళ మానవుడు చిత్తశుద్ధితో, విశ్వాసపూర్వకంగా పూర్తిగా దేవునికి అంకితమైపోతే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ కూడ అతని పర్యవేక్షకుడు (వలీ) అవుతాడు. కాని ఒకవేళ విశ్వాసపు పునాది బలహీనంగా, శిథిలమయముగా ఉన్నచో, అది నిజంగా భయపడవలసిన పరిస్థితియై ఉంటుంది. మాకు ఎవరి హృదయ స్థితి తెలియదు. హృదయ స్థితి తెలిసిన వాడు అల్లాహ్ ఇక్కడే. అయితే మానవుడు తన స్వీయ ద్రోహం వల్లనే పట్టుబడతాడు. ఒకవేళ దేవుని వ్యవహారములో సరిగా లేనిచో బైఅత్ ప్రయోజనం చేకూర్చదు, మరేదియు లాభాన్ని కల్పించదు. కానీ, పూర్తిగా దేవునికే అంకితమైపోతే, దేవుడు అతనిని తన ప్రత్యేక రక్షణతో కాపాడుతాడు. నిజానికి దేవుడు అందరివాడే అయినప్పటికీ, ఎవరైతే ప్రత్యేకించుకుంటారో వారిపై తన ప్రత్యేక అనుగ్రహాన్ని కురిపిస్తాడు. దేవునికి పూర్తిగా అంకితమవడం అనగా, మనోవాంచలన్నింటిని ఏ చిన్న అవశేషం మిగలకుండా పూర్తిగా నశింపజేసుకోవడం. అందువల్లనే నేను నా జమాత్‌కు పదేపదే తెలియజేయునదేమనగా, మీ మనస్సు పవిత్రంగా లేనిచో, కేవలం బైఅత్ చేశామని గర్వించవద్దు. మనస్సు పరంగా దూరంగా ఉన్నప్పుడు, నా బైఅత్ చేయడం వలన ఏమి ప్రయోజనం?. మనస్సుకు, మాటకు పోలికే లేనప్పుడు నా చేతిలో చేయి వేసి కపటత్వపు ప్రకటన చేయువారగుదురు. గుర్తుంచుకోండి!, అలాంటి వ్యక్తికి రెట్టింపు శిక్ష ఉంటుంది. కానీ, నిజాయితీతో తన అంగీకారాన్ని, ప్రతిజ్ఞను వ్యక్తపర్చు వ్యక్తికి అతని పెద్ద పెద్ద పాపాలు కూడా క్షమించబడతాయి. అతనికి ఒక కొత్త జీవితం ప్రసాదించబడుతుంది.”

**(మల్ఫూజాత్, సంపుటి 2, పుట 65, అల్‌హకమ్, 14 ఫిబ్రవరి 1903)**

మరొక సందర్భంలో హుజూర్ (అ) ఇలా పేర్కొన్నారు:

“మానవుని సృష్టిలో రెండు రకాల సౌందర్యాలు ఉన్నాయి. వాటిలో ఒకటి ప్రవర్తన యొక్క సౌందర్యం (హుస్నే ముఆమలహ్). అనగా, దేవుడు తనకు అప్పగించిన ప్రతి న్యాసమును, ప్రతి ఒడంబడికను అవి కనుమరుగు కాకుండా ఉండేలా మానవుడు తన శక్తిమేరకు నెరవేర్చుటకు జాగ్రత్త వహించాలి. దేవుని వాక్యంలో వచ్చిన ‘రాఊన్’ (పర్యవేక్షణ) అనే పదం కూడా ఇదే భావాన్ని సూచిస్తుంది. అదేవిధంగా, దేవుని దాసులకు సంబంధించిన న్యాసముల, ఒడంబడికల విషయంలో కూడా అదే శ్రద్ధ చూపాలి. అనగా, దేవుని హక్కులు మరియు అతని దాసుల హక్కులు రెండింటినీ నెరవేర్చడంలో ధర్మనిష్టాపరతతో వ్యవహరించాలి. ఇదే ప్రవర్తన యొక్క సౌందర్యం; మరో మాటలో చెప్పాలంటే, ఇదే ఆధ్యాత్మిక సౌందర్యం.”

**(బరాహీనే అహ్మదీయ్యా, భాగం 5, అనుబంధం, పుట 218)**

## న్యాసము వ్యవహారపు విషయంలో దైవభీతిని కల్గియుండాలి.

హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహ్ తాలా అన్‌హు సూరహ్ బఖరా, సూక్తి 283ను విశ్లేషిస్తూ తెలిపారు: ఫ ఇన్ ఆమిన బఅజుకుం బఅజన్ ఫల్ యుఅద్దిల్లజీ ఇతుమినా అమానతహు వల్ యత్తఖిల్లాహ రబ్బహు అనగా “మీలో ఎవరైనా తన సహోదరునిపై విశ్వాసం ఉంచి, ఎలాంటి తాకట్టు తీసుకోకుండా అతనికి డబ్బు అప్పుగా ఇస్తే, ఆ డబ్బును స్వీకరించిన వ్యక్తి, అంటే విశ్వసనీయుడిగా భావించబడిన వ్యక్తి, అప్పు ఇచ్చినవాడు అడిగిన వెంటనే ఎలాంటి సాకులు లేదా వాదనలు చెప్పకుండా ఆ డబ్బును తిరిగి ఇవ్వడం అతని విధి. అలాగే, తన ప్రభువైన అల్లాహ్‌కు భయపడాలి. ఇక్కడ అప్పును ఒక న్యాసంగా పేర్కొనబడింది. దీనిలోని ఆంతర్యమేమనగా, సాధారణంగా ప్రజలు తమ వద్ద భద్రపరచడానికి ఇచ్చిన న్యాసమును తిరిగి ఇవ్వడం తప్పనిసరి అని భావిస్తారు. కాని, అప్పును తిరిగి చెల్లించే విషయంలో చాలామంది అనవసరమైన నిర్లక్ష్యం మరియు అలసత్వాన్ని ప్రదర్శిస్తారు. అందుకే సర్వోన్నతుడైన అల్లాహ్ తన దృష్టిలో అప్పు కూడా ఒక న్యాసంతో సమానమని ప్రకటించాడు. ఈ సూక్తి ద్వారా అన్ని రకాల న్యాసములను భద్రంగా కాపాడడం మరియు వాటిని సమయానికి తిరిగి ఇవ్వడం గురించిన ఒక సాధారణ బోధన మనకు లభిస్తుంది. ఈ విషయాన్ని గూర్చియే పవిత్ర ఖుర్ఆన్‌లోని మరో సూక్తి ఈ విధముగా తెల్పుచున్నది. వల్లజీన హుం లి అమానాతిహిం వ అహదిహిం రావూన్. (అల్ మోమినూన్:9) ఈ విధంగా ఖుర్ఆన్ సామాజిక మరియు పౌర సంబంధాలలో ఒక ముఖ్యమైన అంశం “ఇతరుల న్యాసములను భద్రపరచడం” అని బోధిస్తుంది. కాబట్టి, అప్పుల విషయంలోనే కాకుండా, ప్రతి న్యాసపు విషయంలో కూడా మీరు దైవభీతిని కల్గియుండాలి. న్యాసపు యజమాని తన వస్తువును తిరిగి తీసుకోవడానికి వచ్చినప్పుడు, దానిని తిరిగి ఇవ్వడంలో ఆలస్యం చేయడం, సందేహించడం లేదా సాకులు చెప్పడం జరగకూడదు.”

**(తఫ్సీర్-ఎ-కబీర్, సంపుటి 2, పుటలు 648--649)**

**(అహ్మదియ్యా వార్తలు)** సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ దయతో క్షేమంగా ఉన్నారు. జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్య వంతమైన, చురుకైన, దీర్ఘాయుష్షును ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను సమకూర్చు గాకా!, అనుక్షణం హుజూర్‌ను రక్షించుగాకా!, దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).*

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

సంపాదకీయం: لَا اِلٰهَ اِلَّا اللّٰهُ مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰهِ

# ప్రాథమిక ప్రశ్నలకు సమాధానాలు:

**జమ్‌జమ్ బావి గురించి:-**

ప్రశ్న: భారతదేశంలోని కేరళకు చెందిన ఒక స్నేహితుడు హుజూర్ అన్వర్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) వారికి లేఖ రాస్తూ, హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ (రజి) తన సీరత్ ఖాతమున్నబియ్యీన్ గ్రంథంలో జమ్‌జమ్ నీటి ఊట ఒక దైవదూత తన మడమతో నేలను తాకినప్పుడు ఉద్భవించిందని పేర్కొన్నారని తెలిపారు. అయితే తాను చిన్నప్పటి నుండి హజ్రత్ ఇస్మాయీల్ (అలైహిస్సలాం) తన పాదాలతో నేలను కొట్టినప్పుడు జమ్‌జమ్ ఊట ఉద్భవించిందని నేర్చుకున్నానని, ఈ విషయంపై మార్గదర్శకత్వం ఇవ్వగలరని కోరారు.

2023 డిసెంబర్ 17 తేదీన రాసిన తన లేఖలో హుజూర్ అన్వర్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) ఈ విధంగా మార్గదర్శనం చేశారు.

సమాధానం: ఈ విషయంలో ఆందోళన చెందవలసిన అవసరం లేదు. హదీస్, చరిత్ర, సీరత్ మరియు తఫ్సీర్ గ్రంథాలలో ఈ సంఘటనకు సంబంధించిన రెండు విధాలైన వర్ణనలు లభిస్తాయి. ఒక వర్ణన ప్రకారం, దైవదూత తన మడమతో లేదా రెక్కతో నేలను గీసిన లేదా తాకిన చోట నీటిఊట ఉద్భవించింది అని గలదు. (సహీబుఖారీ, కితాబుల్ అంబియా, "అల్లాహ్ ఇబ్రాహీమ్‌ను తన సన్నిహిత మిత్రునిగా చేసుకున్నాడు" అనే సూక్తి ఆధారం)

మరో వర్ణన ప్రకారం, తీవ్రమైన దాహంతో ఏడుస్తూ ఉన్న హజ్రత్ ఇస్మాయీల్ (అలైహిస్సలాం) తన మడమలతో నేలను కొడుతున్న చోట నుంచే నీటి ఊట ఉద్భవించింది. (తఫ్సీరుల్-తబరీ, సంపుటి 13, పుట 272; అల్-కామిల్ ఫిత్తారీఖ్, ఇబ్న్ అల్-అథీర్, సంపుటి 1, పుట 80.)

ప్రాచీన ఇస్లామీయ మూలగ్రంథాలలో ఈ రెండు రకాల వర్ణనలు ఉన్నందున, అహ్మదీయ ముస్లిం జమాఅత్ గ్రంథాలలో కూడా ఈ రెండు అభిప్రాయాలు ప్రస్తావించబడ్డాయి.

ఉదాహరణకు, హజ్రత్ ముస్లేహ్-ఎ-మౌవూద్ (రజి) తఫ్సీర్-ఎ-కబీర్ లో ఇలా పేర్కొన్నారు: "దైవదూత హాజరాతో ఇలా అన్నాడు: 'హాజరా! వెళ్లి చూడు. అల్లాహ్ ఇస్మాయీల్ పాదాల క్రింద ఒక నీటి ఊటను ఉద్భవింపజేశాడు.'"

(తఫ్సీర్-ఎ-కబీర్, సంపుటి 3, పుట 73)

మరో చోట వారు (రజి) ఇలా వ్రాశారు: "'ఇస్మాయీల్' అనే పేరు 'సమిఅ' (వినుట) అనే అరబీ పదం నుండి వచ్చింది. దీని అర్థం, అల్లాహ్ అతని ప్రార్థనను ఆలకిస్తాడని సూచించడం. అందువల్ల హజ్రత్ ఇస్మాయీల్ (అలైహిస్సలాం) తన పాదాలతో నేలను కొట్టగా, అక్కడ నీటి ఊట ఉద్భవించింది."

(తఫ్సీర్-ఎ-కబీర్, సంపుటి 7, పుట 324)

మీరు మీ లేఖలో పేర్కొన్నట్లుగా, హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ (రజి) సీరత్ ఖాతమున్నబియ్యీన్ లో ఈ సంఘటనను వివరిస్తూ ఇలా వ్రాశారు: హాజరా (అలైహస్సలాం) సఫా మరియు మర్వా కొండల మధ్య ఏడవసారి తిరిగి వచ్చిన తరువాత, ఆమె దుఃఖం తీవ్రస్థాయికి చేరుకున్న సమయంలో ఒక అదృశ్య స్వరం వినిపించింది: "ఓ హాజరా! అల్లాహ్ నీ ప్రార్థనను మరియు నీ బిడ్డ యొక్క మొరను ఆలకించాడు." ఆమె తిరిగి వచ్చి చూడగా, తీవ్రమైన దాహంతో బాధపడుతూ తల్లడిల్లుతున్న తన బిడ్డ ఉన్న ప్రదేశంలో ఒక దైవదూత నిలబడి ఉన్నాడు. అతడు తన మడమతో నేలను ఏదో తవ్వుతున్నట్లుగా కొడుతున్నాడు. హాజరా దగ్గరకు వెళ్లి చూడగా, దైవదూత తన మడమతో తాకిన అదే ప్రదేశం నుండి నీటి ఊట ఉబికి ప్రవహించడం ప్రారంభమైంది. (సీరత్ ఖాతమున్నబియ్యీన్, పుట 75)

కాబట్టి, ఈ సంఘటన గురించి రెండు రకాల వర్ణనలు అందుబాటులో ఉన్నాయి. ఈ రెండు వర్ణనలను సమన్వయం చేస్తే, తీవ్రమైన దాహంతో హజ్రత్ ఇస్మాయీల్ (అలైహిస్సలాం) తన మడమలతో నేలను కొడుతున్న అదే ప్రదేశంలో దైవదూత కూడా తన మడమతో నేలను తాకి ఉండవచ్చని అర్థం చేసుకోవచ్చు. అందువల్ల, వారిద్దరూ తమ తమ మడమలతో తాకిన అదే స్థలం నుండి జమ్‌జమ్ నీటి ఊట ఉద్భవించిందని భావించవచ్చు.

**సుబ్‌హానల్లాహి వబిహమ్‌దిహి:-**

ప్రశ్న: కెనడాకు చెందిన ఒక స్నేహితుడు హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ (అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్) వారికి ఈ ప్రశ్నను వ్రాశారు: "'సుబ్‌హానల్లాహి వ బిహమ్దిహీ' అనే దుఆ మరియు దరూద్ షరీఫ్ యొక్క సరైన అర్థం మరియు ప్రాముఖ్యత ఏమిటి?"

2023 డిసెంబర్ 28 తేదీన రాసిన తన లేఖలో హుజూర్ (అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్) ఈ విధంగా సమాధానం ఇచ్చారు.

సమాధానం: "సుబ్‌హానల్లాహి వ బిహమ్దిహీ" అనే దుఆలో అల్లాహ్ యొక్క పవిత్రత మరియు మహిమను ప్రకటించడం జరుగుతుంది. దీని అర్థం:

"అల్లాహ్ అన్ని రకాల లోపాలు, దోషాలు మరియు అసంపూర్ణతల నుండి సంపూర్ణంగా పవిత్రుడు. సమస్త స్తుతి, మహిమ, ప్రశంసలు ఆయనకే చెందుతాయి మరియు వాటికి అర్హుడు కూడా ఆయనే." ఈ దుఆ యొక్క గొప్పతనాన్ని పవిత్ర ప్రవక్త ముహమ్మద్ (స) ఎంతో బలంగా తెలియజేశారు.

హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించిన హదీస్ ప్రకారం, దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "అల్లాహ్‌కు అత్యంత ప్రియమైన రెండు పదబంధాలు ఉన్నాయి. అవి నాలుకతో పలకడానికి చాలా సులభమైనవి, కానీ తీర్పుదినాన సత్కార్యాల త్రాసులో చాలా బరువైనవిగా ఉంటాయి. అవి:

'సుబ్‌హానల్లాహి వ బిహమ్దిహీ, సుబ్‌హానల్లాహిల్ అజీమ్.'

(సహీ బుఖారీ, కితాబుద్దాఅవాత్, తస్బీహ్ యొక్క మహిమపై అధ్యాయం)

అంతేకాకుండా, అల్లాహ్ ఈ దుఆను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారికి కూడా దివ్య ప్రకటన ద్వారా నేర్పించాడు. ఇందులో దరూద్ షరీఫ్‌లోని ఒక భాగం కూడా ఉంది.

ఈ క్రమంలోనే హుజూర్ (అ) ఇలా వ్రాశారు:"సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన ప్రవక్తలలో కొందరికి కష్టాల నుండి విముక్తి పొందుటకు ప్రత్యేక ప్రార్థనలను నేర్పినట్లే, నాకు కూడా దివ్య ప్రకటన ద్వారా ఈ ప్రార్థనను నేర్పించాడు: 'సుబ్‌హానల్లాహి వ బిహమ్దిహీ, సుబ్‌హానల్లాహిల్ అజీమ్. అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ వ ఆలి ముహమ్మద్.'"

(తర్యాకుల్-ఖులూబ్, రూహానీ ఖజాయిన్, సంపుటి 15, పుట 208, ఫుట్‌నోట్)

దరూద్ షరీఫ్ విషయానికి వస్తే, అది దైవ ప్రవక్త ముహమ్మద్ (స) పై అల్లాహ్ తన కరుణ మరియు దీవెనలను ప్రసాదించాలని చేసే ప్రార్థన. దీనిని చేయమని స్వయంగా అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్‌లో ఇలా ఆజ్ఞాపించాడు:

**ఇన్నల్లాహ వ మలాఇకతహు యుసల్లూన అలన్నబియ్యి యా అయ్యుహల్లజీన ఆమను సల్లూ అలైహి వసల్లిమూ తస్లీమా (అహ్‌జాబ్ :57)**

అనగా "నిశ్చయంగా అల్లాహ్ మరియు ఆయన దేవదూతలు ప్రవక్తపై దీవెనలు పంపుతారు. ఓ విశ్వాసులారా! మీరు కూడా ఆయనపై దరూద్ పంపండి మరియు సంపూర్ణంగా శాంతి (సలాం) పంపండి."

ఈ మస్నూన్ దరూద్ యొక్క అర్థం ఏమనగా: "ఓ అల్లాహ్! నీవు ఇబ్రాహీం (అ) మరియు వారి కుటుంబంపై కరుణను కురిపించినట్లే, ముహమ్మద్ (స) మరియు వారి కుటుంబంపై కూడా నీ కరుణను కురిపించుము. నిశ్చయంగా నీవు అత్యంత స్తుతింపబడిన వాడవు, అత్యంత మహిమాన్వితుడవు.

ఓ అల్లాహ్! నీవు ఇబ్రాహీం (అ) మరియు వారి కుటుంబంపై దీవెనలు ప్రసాదించినట్లే, ముహమ్మద్ (స) మరియు వారి కుటుంబంపై కూడా దీవెనలను ప్రసాదించు. నిశ్చయంగా నీవు అత్యంత స్తుతింపబడినవాడవు, అత్యంత మహిమాన్వితుడవు."

ఈ దరూద్ షరీఫ్‌లో "అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మద్" మరియు "అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మద్" అనే పదబంధాల అర్థాన్ని నేను వివిధ ఖుత్బాలు మరియు ప్రసంగాలలో వివరించాను. ఇక్కడ సంక్షిప్తంగా తెలియజేస్తున్నాను. "అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మద్" అనే ప్రార్థన యొక్క అర్థం:

"ఓ అల్లాహ్! ఈ ప్రపంచంలో ముహమ్మద్ (స) వారి పేరును ఉన్నతపరచి, వారి సందేశానికి విజయం మరియు ఆధిపత్యాన్ని ప్రసాదించి, వారి ధర్మశాస్త్రం (షరీఅత్) శాశ్వతంగా నిలిచేలా చేయి. పరలోకంలో వారి సమాజం (ఉమ్మత్) కొరకు వారు చేసే సిఫారసును అంగీకరించి, వారి ప్రతిఫలాన్ని అనేక రెట్లు పెంచి వారికి మహోన్నత స్థానం ప్రసాదించు."

"అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మద్" అనే ప్రార్థన యొక్క అర్థం:

"ఓ అల్లాహ్! దైవ ప్రవక్త (స) కొరకు నీవు నిర్ణయించిన గౌరవం, మహిమ, ఉన్నత స్థానం మరియు గొప్పతనాన్ని శాశ్వతంగా స్థిరపరచి, ఎల్లప్పుడూ కొనసాగేటట్లు చేయుము."

మొత్తానికి సారాంశం ఏమనగా, "అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మద్" అనేది ప్రవక్త (స) గారి ధర్మశాస్త్రం విజయం సాధించి శాశ్వతంగా కొనసాగాలని, అలాగే విశ్వాసులు ప్రవక్త (స) వారి సిఫారసు ద్వారా లాభం పొందాలని చేసే ప్రార్థన."అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మద్" అనేది దైవ ప్రవక్త (స) గారి గౌరవం, మహిమ, ప్రతిష్ఠ మరియు ఉన్నత స్థానం ఎల్లప్పుడూ శాశ్వతంగా నిలిచి ఉండాలని చేసే ప్రార్థన.

హదీస్‌లలో దరూద్ షరీఫ్ పఠనం యొక్క గొప్ప మహిమ కూడా విస్తృతంగా వివరించబడింది. హజ్రత్ ఉబయ్యి బిన్ కఅబ్ (రజి) ఇలా ఉల్లేఖించారు. నేను దైవ ప్రవక్త (స)ను ఇలా అడిగాను: **(13 వ పేజీలో చదవగలరు)**

# జుమా ప్రసంగము

**"త్రిత్వ సిద్ధాంతంలో ఏర్పడిన భ్రష్టత్వాలను సరిదిద్దడానికి నన్ను పంపించారు. (అంటే, క్రైస్తవ మతంలో ఏర్పడిన వక్రీకరణలను సరిచేయడానికి.) ప్రపంచంలో నలభై కోట్లకు పైగా ప్రజలు ఈసా (అలైహిస్సలాం)ను దేవుడిగా భావిస్తున్నారనే హృదయవిదారక దృశ్యం నా హృదయాన్ని ఎంతగానో కలచివేసింది. నా జీవితమంతటిలో దీనికంటే గొప్ప దుఃఖాన్ని నేను ఊహించలేను.**

**అల్లాహ్ మనకు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) రాక యొక్క ఉద్దేశ్యాన్ని నెరవేర్చడంలో సహకరించే భాగ్యాన్ని ప్రసాదించుగాకా!. అలాగే దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రకటించిన నిజమైన తౌహీద్ సిద్ధాంతాన్ని మనం స్వయంగా ఆచరించడమే కాకా, ప్రపంచమంతటా వ్యాప్తి చేయగల శక్తిని కూడా ప్రసాదించుగాకా!. మానవజాతి విముక్తికి ఇదే ఏకైక మార్గం. దీనికి ప్రత్యామ్నాయం మరొకటి లేదు.**

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 03 ఏప్రిల్ 2026 ( 03 షహాదత్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيمِ -

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِينَ ○ الرَّحْمٰنِ الرَّحِيمِ ○ مٰلِكِ يَوْمِ الدِّينِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِينُ ○

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيمَ ○ صِرَاطَ الَّذِينَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوبِ عَلَيْهِمْ وَلَا الضَّالِّينَ ○

గత ప్రసంగాలలో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రపంచంలో తౌహీద్ (దేవుని ఏకత్వం) స్థాపన కోసం కలిగిన హృదయపూర్వక ఆకాంక్ష, ఆయన చేసిన కృషి, ధైర్యం, అలాగే షిర్క్ యొక్క ప్రతి రూపానికి వ్యతిరేకంగా అచంచలమైన శిలవలె ఎలా నిలబడ్డారో, మరియు ప్రతి జాతి యొక్క షిర్క్ భావనలను, వారి బోధనలను ఎలా నిర్భయంగా ఖండించారో గురించి అధ్యయనం చేస్తున్నాము. ఈ సందర్భంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా పేర్కొన్నారు:

"ఒక్కసారి ఆలోచించండి. తన చివరి శ్వాస వరకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అనేక ప్రమాదాలు, అసంఖ్యాక శత్రువులు, వ్యతిరేకులు, బెదిరింపుల మధ్య కూడా తన ప్రవక్తత్వ వాదనను ఎంత దృఢంగా, ఏమాత్రం తడబాటు లేకుండా నిలబెట్టారో. ఆయన ఎన్నో సంవత్సరాలు అనుభవించిన హింసలు, కష్టాలు విజయానికి ఏ మాత్రం అవకాశం లేదని కనిపించేంత తీవ్రంగా ఉండేవి; అంతేకాక అవి రోజు రోజుకూ పెరుగుతూనే ఉండేవి. అయినప్పటికీ, ఆయన సహనంతో వాటిని ఎదుర్కొనడం ఆయనకు ప్రాపంచిక లాభాలపై ఎలాంటి ఆశ లేదని స్పష్టంగా తెలియజేస్తుంది. వాస్తవానికి, ఆయన ప్రవక్తత్వాన్ని ప్రకటించిన క్షణం నుంచే, అప్పటివరకు తనకు ఉన్న కొద్దిపాటి మద్దతును కూడా కోల్పోయారు." అంటే, ఆయనకు అత్యంత సన్నిహితులైన వారు కూడా ఆయనను విడిచి పెట్టారు. "ఒకే ఒక్క ప్రకటనతో ఆయన అసంఖ్యాక శత్రువులను సంపాదించుకున్నారు; అనేక కష్టాలను తనపై తెచ్చుకున్నారు. ఆయన స్వదేశాన్ని విడిచి వెళ్లవలసి వచ్చింది; రక్తపిపాసి శత్రువులు ఆయనను వెంబడించారు; ఆయన ఇల్లు, ఆస్తులు నాశనం చేయబడ్డాయి; ఆయనకు పలుమార్లు విషప్రయోగం చేయడానికి ప్రయత్నించారు. ఒకప్పుడు ఆయన శ్రేయోభిలాషులుగా ఉన్నవారు ఆయనకు వ్యతిరేకులయ్యారు; స్నేహితులు శత్రువులయ్యారు. ఇంతటి తీవ్రమైన కష్టాలను ఇంతకాలం పాటు, ఇంతటి స్థైర్యంతో భరించడం ఒక మోసగాడు లేదా వంచకుడు ఎప్పటికీ చేయలేడు." మరల ఇలా పేర్కొన్నారు: "ఆయన సత్యనిష్ఠ, నిష్కపటత ఎంత గొప్పవో చూడండి. ప్రజలందరూ, తెగలన్నీ, అంతేకాదు మొత్తం విగ్రహారాధక ప్రపంచమే తనకు శత్రువులవుతారని తెలిసినా, తౌహీద్ (దేవుని ఏకత్వం)ను ప్రకటించడంలో ఆయన ఏమాత్రం వెనుకాడలేదు. విగ్రహారాధనను విడిచిపెట్టమని చెప్పినప్పుడు, ఆయనకు మొదటగా వ్యతిరేకించిన వారు ఆయన సొంత బంధువులే. యూదులు సృష్టి వస్తువుల ఆరాధన, సాధువుల గుడ్డి అనుసరణ, వివిధ దుష్టాచారాలు మరియు ఈసా అలైహిస్సలాం గురించి దూషణలను విడనాడమని ఆయన పిలుపునిచ్చినప్పుడు, వారు ఆయనకు అత్యంత కఠినమైన శత్రువులయ్యారు; ఆయనను హత్య చేయడానికి నిరంతరం కుట్రలు పన్నారు." దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యూదులు ఈసా (అలైహిస్సలాం) గురించి దూషణలు చేయడాన్ని నిషేధించారు. "అలాగే, క్రైస్తవులు కూడా ఆయనపై ఆగ్రహించారు. ఎందుకంటే, వారి నమ్మకానికి విరుద్ధంగా, ఈసా (అలైహిస్సలాం) దేవుడు కాదని, దేవుని కుమారుడు కాదని, సిలువపై మరణించడం ద్వారా మానవుల పాపాలకు ప్రాయశ్చిత్తం చేయలేదని ఆయన ప్రకటించారు. అగ్నిపూజకులు, నక్షత్రారాధకులు కూడా తమ దేవతలను ఆరాధించవద్దని, వారి రక్షణ కోసం ఒకే ఒక్క దేవుని వైపు రావాలని ఆయన బోధించినప్పుడు కోపోద్రిక్తులయ్యారు." మరల ఇలా తెలిపారు: "నిజాయితీగా చెప్పండి, ఈ విధంగా ప్రవర్తించడం ద్వారా ఈ లోకంలో విజయం సాధించగలమని ఎవరైనా ఆశిస్తారా?" ఆ కాలంలోని ప్రజలు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రాపంచిక విజయాన్ని పొందాలనే ఉద్దేశంతో ఇలా చేశారని ఆరోపించారు. "ఆయనకు నిజంగానే లోకసంబంధమైన ఆశలు ఉంటే, అన్ని మతాల విశ్వాసాలను ఒకేసారి ఖండించి, వారందరినీ బాధపెట్టి, వారిని తనకు శత్రువులుగా మార్చుకోవడం తెలివైన పనిగా భావించవచ్చా? వారు అంతగా ఆగ్రహించి ఆయన రక్తానికే దాహపడే స్థితికి చేరుకున్నారు. నిజానికి ఆ సమయంలో ఆయనను రక్షించడానికి పెద్ద సంఖ్యలో అనుచరులు కూడా లేరు." ఈ రోజుల్లో కూడా ఇస్లాం వ్యతిరేకులు, ప్రాచ్యవేత్తలు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)పై ఇదే విధమైన ఆరోపణలు చేస్తుంటారు. అయితే, ఏదైనా లాభం కోసం ఒక వ్యక్తి స్వచ్ఛందంగా ఇలాంటి కఠిన పరిస్థితులను ఎందుకు ఎదుర్కొంటాడో వారు ఆలోచించరు. మరల ఇలా తెలిపారు: "ఈ లోకపు సాధారణ పద్ధతులను అనుసరించి ఉండాలనుకుంటే, కొందరిని విమర్శించి, మరికొందరిని ప్రశంసించడం మరింత సముచితంగా ఉండేది కాదా? అలా చేసి ఉంటే, శత్రువులతో పాటు కొంతమంది మిత్రులను కూడా సంపాదించుకునే వారు. ఉదాహరణకు, ఆయన అరబ్బుల దేవతలైన లాత్ మరియు ఉజ్జా నిజమైన దేవతలేనని అంగీకరించి ఉంటే, వారు ఎలాంటి సందేహం లేకుండా ఆయనకు విధేయులై, ఆయనను అనుసరించేవారు. ఎందుకంటే వారు కుటుంబ బంధాలు, తెగల ఐక్యత, జాతీయ గౌరవాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చే ప్రజలు. వారు ఆయన బోధించిన దాదాపు అన్నింటితో ఏకీభవించారు. వారి హృదయపూర్వక విధేయతను పొందడానికి ఆయన చేయాల్సిందల్లా విగ్రహారాధనకు అనుమతి ఇవ్వడమే." ఒకవేళ ఆయన కేవలం, "వారు విగ్రహాలను ఆరాధించడం సమంజసమే" అని మాత్రమే చెప్పి ఉంటే, వారు పూర్తిగా సంతృప్తి చెంది, ఆయనకు సంపూర్ణ విధేయత చూపేవారు. వారు ఆయన ముందు ఉంచిన అభ్యర్థన ఇదే. కాబట్టి, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ లోతుగా ఆలోచించాలి. ఆ కాలంలో అత్యంత అప్రియమైన సిద్ధాంతమైన తౌహీద్ (ఏకదైవవాదం)ను గట్టిగా పట్టుకుని నిలబడటం వల్ల, సమస్త ప్రజలను తనకు విరోధులుగా చేసుకోవడంలో దైవ ప్రవక్త (స)కు ఏ లోక సంబంధమైన ప్రయోజనం ఉండేది? ఆ విశ్వాసాన్ని ప్రకటించడం వల్ల ఎన్నో కష్టాలు, హింసలు, మరణ ముప్పు కూడా ఎదురయ్యే పరిస్థితి ఉండేది. అంతేకాక, ఆ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడం వల్ల ఆయన తన సర్వస్వాన్ని కోల్పోయారు. అయినప్పటికీ, అదే బోధనను ఎందుకు నిరంతరం నొక్కి చెప్పేవారు? ఇస్లాంను స్వీకరించిన కొత్తవారు కూడా ఆ సిద్ధాంతాన్ని అంగీకరించిన కారణంగా చెరసాలలో బంధించబడి, ఘోర చిత్రహింసలు అనుభవించాల్సి వచ్చేది. (అల్లాహ్ యొక్క ఏకత్వాన్ని ప్రకటించినందుకు ఆయన మాత్రమే కాదు, ఆయన అనుచరులు కూడా తీవ్రమైన బాధలు అనుభవించారు.) "ప్రజల స్వభావానికి, వారి ఆచారాలకు, వారి నమ్మకాలకు విరుద్ధంగా మాట్లాడి, వారందరినీ తన ప్రాణ శత్రువులుగా మార్చుకొని, ఎవరితోనూ రాజీ పడకుండా ఉంటే, అటువంటి వ్యక్తి ప్రాపంచిక విజయాన్ని ఎలా ఆశించగలడు? మోసగాళ్లు, అబద్ధకులు (అంటే లోభంతో నడుచుకునేవారు, ఏదో లాభం కోరేవారు లేదా తమ తెలివి తేటలను ప్రదర్శించాలనుకునేవారు) ఇలాంటి పద్ధతిలో వ్యవహరిస్తారా? కుట్రలు పన్నేవారు తమ మిత్రులను శత్రువులుగా మార్చుకుంటారా? తమ చాతుర్యంతో ప్రాపంచిక లాభాలు పొందాలనుకునేవారు, ఒకేసారి ప్రపంచమంతటినీ సవాలు చేసి, ఎల్లప్పుడూ ప్రాణభయంతో జీవిస్తారా? అసలు కాదు. అటువంటి వారు ప్రతి ఒక్కరినీ సంతోషపరచాలని చూస్తారు. ప్రతి మతాన్నీ సత్యమని ప్రకటించడానికి సిద్ధంగా ఉంటారు. దేవుని కోసం స్థిరంగా నిలబడటం, ఆయన ఏకత్వాన్ని మరియు మహిమను కాపాడేందుకు కష్టాలు భరించడం వారి స్వభావం కాదు. నిజానికి, వారు అలా ఎందుకు చేస్తారు? వారి లక్ష్యం ఏమిటంటే, వేటగాడు వేటను సులభంగా పట్టుకునే చోట వల వేయినట్లుగా (మోసం ద్వారా ఎవరినైనా తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలనుకుంటే, సులభమైన ఉచ్చులు వేస్తాడు), తక్కువ శ్రమతో ఎక్కువ లాభం వచ్చే మార్గాలను అనుసరించడం. కపటత్వమే వారి వృత్తి; పొగడ్తలే వారి అలవాటు. మధురమైన మాటలు మాట్లాడడం, రెండు పక్షాల అనుగ్రహాన్ని సంపాదించుకోవడం వారి ప్రియమైన సూత్రం. ముస్లింలతో ఉన్నప్పుడు "అల్లాహ్, అల్లాహ్" అంటారు; హిందువులతో ఉన్నప్పుడు అంతే సులభంగా "రామ్, రామ్" అంటారు. ప్రతి ఒక్కరితోనూ వెంటనే ఏకీభవిస్తారు. (పరిస్థితులకు అనుగుణంగా తమను తాము మార్చుకుంటారు.)"వారికి దేవునితో నిజమైన సంబంధం ఉండదు;

ఆయన పట్ల విశ్వాసాన్ని చూపాలనే ఆసక్తి కూడా ఉండదు. తమ సుఖజీవితంలో బాధలు, కష్టాలు, పరీక్షలు తెచ్చుకోవడానికి వారు ఎప్పుడూ సిద్ధపడరు. వారి గురువు వారికి ఒకటే బోధిస్తాడు. 'ప్రతి ఒక్కరితో, వారి నమ్మకాలు, అభిప్రాయాలు, అవగాహనలతో మీరు ఏకీభవిస్తున్నారని చెప్పండి.' వారికి సత్యం, అసత్యం, ధర్మం, అధర్మం, మంచి-చెడు అనే భేదాల గురించి ఎలాంటి శ్రద్ధ ఉండదు. ఎవరు వారికి లంచం ఇస్తారో వారు మంచి వారు, నీతిమంతులు, గౌరవనీయులు. ఎవరు వారి అహంకారాన్ని పొగడ్తలతో తృప్తిపరుస్తారో వారికి రక్షణ, స్వర్గం, శాశ్వత జీవితం అనే శుభవార్తలను ప్రకటిస్తారు. (అటువంటి వారి కోసం వారు ఏదైనా చేయడానికి సిద్ధపడతారు.) కాని అందుకు భిన్నముగా , అల్లాహ్ యొక్క ప్రవక్తలలో అంతిముడైన హ‌జ్రత్ ఖాతముల్ అంబియా (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి జీవితాన్ని పరిశీలిస్తే, ఆయన అత్యున్నత స్థాయి నిజాయితీ, నిష్కళంకత మరియు ధర్మనిష్ఠ కలిగినవారని స్పష్టంగా తెలుస్తుంది. దేవుని కోసం తన ప్రాణాన్నే అర్పించడానికి ఆయన ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేవారు. ప్రజల నుండి ఆయనకు ఎలాంటి భయం లేదా ఆశ ఉండేది కాదు. ఆయన సంపూర్ణంగా తన ప్రభువుపైనే ఆధారపడ్డారు. దేవుని చిత్తానికి ఆయన చూపిన విధేయత, అంకితభావం ఎంత పరిపూర్ణంగా ఉండే దంటే, తనపై ఎన్ని విపత్తులు వచ్చినా, విగ్రహారాధకుల చేత ఎన్ని బాధలు అనుభవించాల్సి వచ్చినా, ఆయన నిర్భయంగా అల్లాహ్ యొక్క ఏకత్వాన్ని ప్రకటించారు. తన ప్రభువు ఆజ్ఞను నెరవేర్చే క్రమంలో ప్రతి పరీక్షను, ప్రతి కష్టాన్ని, ప్రతి బాధను ఆయన సంతోషంగా స్వీకరించారు. బెదిరింపులకు ఏమాత్రం వెనుకాడకుండా, ఆధ్యాత్మిక సాధన, ధర్మప్రచారం, ఉపదేశం వంటి ప్రతి బాధ్యతను సంపూర్ణంగా నిర్వర్తించారు. నేను మీతో నిజం చెబుతున్నాను. ఇతర ప్రవక్తల చరిత్ర మొత్తాన్ని పరిశీలించినా, దేవునిపై ఇంతటి సంపూర్ణ విశ్వాసం ఉంచి, ఇంతటి ప్రమాదాల మధ్య ఆయన ఏకత్వాన్ని ప్రకటించి, విగ్రహారాధనను ఇంత ధైర్యంగా ఖండించి, ఇంతమంది శత్రువుల ఎదుట కూడా ఎప్పుడూ స్థిరంగా, అచంచలంగా నిలిచిన మరొక ప్రవక్తను మీరు కనుగొనలేరు. (ప్రవక్తల చరిత్రను పరిశీలించండి; ఆయనంత స్థిరత్వం చూపిన మరొకరిని మీరు చూడలేరు.) ఈ సంఘటనలను నిజాయితీతో ఆలోచించే ఏ వ్యక్తికైనా, ఇవన్నీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి అంతరంగ సత్యానికి స్పష్టమైన సాక్ష్యాలుగా కనిపిస్తాయి.

లోతుగా ఆలోచించినప్పుడు, ఒక వివేకవంతుడు కూడా దైవ ప్రవక్త హ‌జ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రత్యక్షమైన కాలానికి ఒక మహత్తర దివ్య సంస్కర్త, ఆధ్యాత్మిక మార్గదర్శి అత్యవసరంగా అవసరమైందని గ్రహిస్తాడు. అలాగే, ఆయన తీసుకొచ్చిన బోధనలు నిస్సందేహంగా సత్యమైనవని, ఆ కాలంలోని అన్ని అవసరాలను తీర్చేవని, యుగానికి సంబంధించిన ప్రతి అవసరాన్నీ సంపూర్ణంగా ఆవరించాయని కూడా అర్థం చేసుకుంటాడు. (ఆ కాలం అంతగా నైతికంగా పతనమైపోయింది కాబట్టి, ఒక మార్గదర్శి, సంస్కర్త, నాయకుడు అవసరమయ్యాడు. అటువంటి సమయంలోనే ఆయన ఆ యుగంలో ప్రత్యక్షమయ్యారు. ఆయన బోధనలు ఆ కాలంలోని ప్రతి అవసరాన్నీ తీర్చాయి.) ఆయన బోధనలు అంత ప్రభావవంతమైనవి, అంత శక్తివంతమైనవి కావడంతో వేలాది మంది సత్యం వైపు ఆకర్షితులయ్యారు. "లా ఇలాహ ఇల్లల్లాహ్" (అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడైన మరెవ్వరూ లేరు) అనే మాటలు వారి హృదయాలలో చెక్కబడ్డాయి. ప్రవక్తత్వం యొక్క పరమ లక్ష్యం అంటే మానవులను మోక్షానికి, రక్షణకు నడిపించే బోధనలను అందించడం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా సంపూర్ణంగా నెరవేరింది. ఇది ఇతర ప్రవక్త సాధించిన దానికంటే ఎంతో గొప్పది. "ఈ విషయాన్ని లోతుగా పరిశీలించే ప్రతి వ్యక్తి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నిజంగా దేవునిచే పంపబడిన సత్యమైన మార్గదర్శి అని సహజంగానే సాక్ష్యమిస్తాడు. పక్షపాతం, మొండితనం వల్ల సత్యాన్ని తిరస్కరించే వారికి చికిత్స లేదు. అలాంటి వారు దేవుని ఉనికినే నిరాకరిస్తారు. అయితే, మరే ఇతర ప్రవక్త జీవితంలోనూ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవితంలో సమృద్ధిగా కనిపించే సత్యానికి సంబంధించిన సూచనలలో ఒక్కటినైనా చూపించడం అసాధ్యం. ఎవరైనా భిన్నంగా భావిస్తే, వారు ముందుకు వచ్చి నిరూపించవచ్చు."

హుజూర్ (అలైహిస్సలాం) మరల ఇలా పేర్కొన్నారు:

"హిందువులు వేదాలను సమస్త మార్గదర్శకత్వానికి మూలమని ప్రశంసిస్తూ, ఇతర గ్రంథాలు మరియు ప్రవక్తల సత్యత్వాన్ని నిరాకరిస్తారు. అలాగే, క్రైస్తవులు సువార్తలను దేవుని చివరి వాక్యంగా భావిస్తారు. కానీ ఒక దివ్యగ్రంథం యొక్క గొప్పతనాన్ని కొలిచే నిజమైన ప్రమాణం ఏమిటంటే, అది దేవుని ఏకత్వాన్ని (తౌహీద్‌ను) ఎంత బలంగా స్థాపిస్తుందన్నదే. దేవుని ఏకత్వాన్ని అత్యుత్తమంగా స్థాపించే గ్రంథమే అత్యున్నత స్థానం పొందడానికి అర్హమైనది. (దివ్యగ్రంథం యొక్క అసలు ఉద్దేశ్యం తౌహీద్‌ను స్థాపించడమే.) అందువల్ల, తౌహీద్‌ను నిరాకరించే వ్యక్తి, అతడు ఎంతటి సద్గుణవంతుడైనా, రక్షణను పొందలేడు. (ఒక వ్యక్తిలో అన్ని సద్గుణాలు ఉన్నప్పటికీ, దేవుని ఏకత్వాన్ని నిరాకరిస్తే, అల్లాహ్ దృష్టిలో అతనికి మోక్షం లభించదు.) అందుకే, ఈ ప్రజలు ముందుగా తమను తాము ప్రశ్నించుకోవాలి. రక్షణకు ఆధారమైన దేవుని ఏకత్వ భావనను అత్యంతగా ప్రచారం చేసిన గ్రంథం ఏది? వేదాలు కనీసం ఒక దేశంలోనైనా దేవుని ఏకత్వాన్ని స్థాపించాయని చెప్పగలవా? సువార్తలు కూడా తౌహీద్‌ను వ్యాప్తి చేయడానికి సాధనంగా మారిన దేశం ఒక్కటైనా లేదు. దీనికి విరుద్ధంగా, వాటి అనుచరులు ఏకదైవారాధకులను రక్షణకు అనర్హులుగా భావిస్తారు. వారి పూజారులు ఏకదైవారాధకులకు భయంకరమైన నరకాగ్ని గురించి హెచ్చరిస్తారు (అంటే, తౌహీద్‌ను అనుసరించి, ఒకే దేవుణ్ణి విశ్వసించి, త్రిత్వ సిద్ధాంతాన్ని తిరస్కరించే వారు నరకాగ్నిలో పడతారని వారు బోధిస్తారు), అక్కడ ఏడుపు, పళ్లుకొరుక్కోవడం తప్ప మరేమీ ఉండదని చెబుతారు. వారి ప్రకారం, దేవుడు మరణించాడని, బాధను, ఆకలిని, దాహాన్ని, వేదనను అనుభవించాడని, మానవ శరీరాన్ని ధరించి మాంసరూపం దాల్చాడని నమ్మిన వారికే రక్షణ ఉంటుంది. లేకపోతే మోక్షానికి ఎలాంటి ఆశ లేదని వారు విశ్వసిస్తారు. (ఇది ఈసా (అలైహిస్సలాం) గురించి వారి విశ్వాసాన్ని సూచిస్తోంది.) మరో మాటలో చెప్పాలంటే, వారు ఊహించుకున్న స్వర్గం ప్రధానంగా యూరప్‌లోని రెండు గొప్ప జాతులైన బ్రిటిష్ మరియు రష్యన్ల మధ్యే విభజించబడుతుందని నమ్ముతారు.''నేడు ఇతర పెద్ద దేశాలు కూడా తమను ఈ వాదనలో చేర్చుకుంటున్నాయి. అమెరికా సంయుక్త రాష్ట్రాలు కూడా ఇలాంటి వాదనలు చేస్తున్నాయి. వాస్తవానికి, అమెరికా అధ్యక్షుని కొందరు మద్దతుదారులు డొనాల్డ్ ట్రంప్ యేసు క్రీస్తు రెండవ రాకడ అని కూడా అంటున్నారు. నవూజు బిల్లాహ్!. మరల ఇలా తెలిపారు. "అది రెండు భాగాలుగా విభజించ బడుతుంది. కాగా, దేవుడు ప్రతి లోపం మరియు అపూర్ణత నుండి సంపూర్ణంగా పరిశుద్ధుడని విశ్వసించిన 'నేరం' కారణంగా ఏకదైవవాదులందరూ నరకంలోకి నెట్టి వేయబడతారు. నేను ఇవన్నీ వ్రాస్తున్న ఉద్దేశ్యం ఏమిటంటే, భూమిపై నివసిస్తున్న ఏ ప్రజలలోనూ పరిశుద్ధమైన తౌహీద్ (దేవుని ఏకత్వం) సిద్ధాంతం, అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచరులలో ఉన్నంత నిర్మలంగా మరెక్కడా కనిపించదు. అలాగే, పవిత్ర ఖుర్‌ఆన్ తప్ప, ఈ పవిత్ర సిద్ధాంతానికి లక్షలాది మందిని దృఢంగా కట్టిపడేసిన మరో గ్రంథం భూమిపై లేదు. మానవాళిని ఏకైక సత్యదేవుని వైపు ఇంతటి భక్తి, గౌరవంతో నడిపించిన మరే గ్రంథమూ లేదు. ప్రతి మతస్థులు తమకుతామే కల్పిత దేవుళ్లను సృష్టించుకున్నారు. కానీ ముస్లింల దేవుడు ఒకడే; ఆయన నిత్యుడు, శాశ్వతుడు, మార్పులేనివాడు. ఆయన గుణాలు ఈ రోజూ ఎలా ఉన్నాయో, ఆది నుంచీ అలాగే ఉన్నాయి. ఈ సమస్తం ఇస్లాం స్థాపకుడైన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క ప్రవక్తత్వ సత్యాన్ని సూర్యునిలా స్పష్టంగా నిరూపిస్తుంది.

ఎందుకంటే, ప్రవక్తత్వం యొక్క అసలు ఉద్దేశ్యం, సారాంశం ఆయన పవిత్ర వ్యక్తిత్వంలోనే సంపూర్ణంగా నెరవేరింది. ఒక సృష్టికర్త తన సృష్టి ద్వారా గుర్తించబడినట్లే, జ్ఞానులు మరియు వివేకులు కూడా ఈ దైవిక సంస్కర్తను ఆయన తీసుకువచ్చిన సంస్కరణ ద్వారా గుర్తిస్తారు. (ఒక ఆవిష్కర్త తన ఆవిష్కరణ నాణ్యత ద్వారా అంచనా వేయబడినట్లే, దైవిక సంస్కర్త కూడా ఆయన బోధించిన తౌహీద్ బోధనల ద్వారా గుర్తించబడతాడు.)

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దైవ సహాయాన్ని పొందారని నిరూపించే మరెన్నో సంకేతాలు ఉన్నాయి. ఉదాహరణకు, ఒక పేద, నిస్సహాయుడు, చదువు లేని అనాథ, ఆర్థిక, సైనిక, మేధోశక్తులపై గర్వించే శక్తివంతమైన జాతుల కాలంలో అంతటి ప్రకాశవంతమైన బోధనతో వచ్చి, తన నిర్దోషమైన తర్కం, బలమైన వాదనలతో వారిని మాటరానివారిగా చేయడం ఒక అద్భుతం కాదా? అంతేకాదు, వారి పండితులు, తత్వవేత్తలుగా చెప్పబడిన వారి తప్పులను కూడా ఆయన బహిర్గతం చేయలేదా?.అలాగే, తాను బలహీన స్థితిలో ఉన్నప్పటికీ, ఆయన శక్తివంతమైన రాజులను పడగొట్టి, వారి స్థానంలో సాధారణ ప్రజలను నిలబెట్టలేదా? ఇది దైవ సహాయానికి నిదర్శనం కాకపోతే, మరి ఏమిటి? దైవ సహాయం లేకుండా ఎవరైనా తర్కంలో, జ్ఞానంలో, శక్తిలో, సామర్థ్యంలో ప్రపంచమంతటినీ జయించగలరా?"

**(బరాహీన్-ఎ-అహ్మదీయ్యా, భాగం 2, రూహానీ ఖజాయిన్, సంపుటి 1, పుటలు 108--119)**

హ‌జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మరొక సందర్భంలో ఇలా పేర్కొన్నారు: "చరిత్ర స్పష్టంగా సాక్ష్యమిస్తోంది; అలాగే పవిత్ర ఖుర్‌ఆన్‌లోని అనేక సూక్తులు కూడా దీనిని ధృవీకరిస్తున్నాయి. అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రపంచంలో విగ్రహారాధన, సృష్టింపబడిన వాటి ఆరాధన మరియు అనేక రకాల తప్పుదారి పట్టించే విశ్వాసాలు విస్తృతంగా వ్యాపించిన కాలంలో ప్రత్యక్షమయ్యారు. ప్రజలందరూ నిజమైన సూత్రాలను విడిచిపెట్టి సరైన మార్గం నుండి తప్పిపోయారు. ప్రతి మతానికి చెందినవారు తామే కల్పించుకున్న మార్గాలను అనుసరిస్తున్నారు. అరబ్బులు విగ్రహారాధనలో మునిగిపోయి ఉన్నారు; పర్షియన్లు అగ్నిని ఆరాధిస్తూ దానికి నమస్కరిస్తున్నారు (ఆ కాలంలోని ఇరానీయులు అగ్నిపూజకులు); భారతదేశ ప్రజలు విగ్రహారాధనతో పాటు వందలాది రకాల సృష్టింపబడిన వాటి ఆరాధనలో చిక్కుకు పోయారు. అదే సమయంలో, అనేక ప్రాచీన గ్రంథాలు, రచనలు వెలువడ్డాయి. వాటిలో దేవుని భక్తులైన అనేక మందిని దైవ స్థాయికి చేర్చి పురాణ కథలను ప్రచారం చేశారు. అలాగే 'అవతార' ఆరాధనకు పునాది వేయబడింది. అంతేకాక, రెవరెండ్ డావెన్‌పోర్ట్ స్వయంగా అంగీకరించినట్లుగా, అనేక గౌరవనీయ పండితుల అభిప్రాయం ప్రకారం క్రైస్తవ

మతం అన్నిటికంటే అత్యంత దయనీయ స్థితిలో ఉండేది. (హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) కాలంలో జాన్ డావెన్‌పోర్ట్ మరియు ఇతర క్రైస్తవ చరిత్రకారులు దీనిని ప్రస్తావించారు.) మత గురువుల అనైతిక ప్రవర్తన, విశ్వాసహీనత కారణంగా అది తీవ్రమైన కలుషితానికి గురైంది. అంతేకాక, వారి సిద్ధాంతాలు ఒకరిని లేదా ఇద్దరిని మాత్రమే కాదు, అనేక మందిని దేవుళ్ల స్థాయికి చేర్చాయి.” కావున దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆధ్యాత్మిక పతనం అత్యున్నత స్థాయికి చేరిన కాలంలో అవతరించారు అనే ఈ వాస్తవం స్పష్టమైన సాక్ష్యం. ఆ సమయంలో ఒక గొప్ప ఆధ్యాత్మిక వైద్యుడు, సంస్కర్త మరియు అసాధారణ దైవిక మార్గదర్శకుని అవసరం అత్యంత తీవ్రంగా ఉండేది. ఆయన రాకతో ప్రపంచాన్ని తౌహీద్ (ఏకదైవారాధన) మరియు సత్ప్రవర్తన అనే వెలుగుతో ప్రకాశింపజేసి, విగ్రహారాధన మరియు సృష్టి ఆరాధనను సమస్త దుర్మార్గాలకు మూలమైన వాటిని నిర్మూలించారు. ఇది ఆయన కేవలం నిజమైన దైవ ప్రవక్త మాత్రమే కాకుండా, ప్రవక్తలందరిలోకెల్లా గొప్పవారని నిరూపించే స్పష్టమైన ఆధారం.

“ఆయన సత్యత్వం స్పష్టంగా వెల్లడవుతుంది. ఎందుకంటే ఆ అంధకార కాలంలో దైవ నియమం ప్రకారం ఒక వెలుగు ప్రసరింపజేసే మార్గదర్శకుడు రావలసిన అవసరం ఏర్పడింది. సర్వశక్తిమంతుడైన దేవుని శాశ్వత ఆచారం ప్రకారం, ప్రజలు మార్గభ్రష్టులైనప్పుడు ఆయన తన ప్రవక్తలను పంపుతాడు. ఇది దేవుని శాశ్వత ధర్మం. ప్రజల కష్టాలు, బాధలు తీవ్రతకు చేరినప్పుడు, ఆయన కరుణ ఉప్పొంగి ప్రపంచ బాధలను తొలగించే మార్గాలను సృష్టిస్తుంది. ఉదాహరణకు, కరువు తీవ్రమై ప్రజలు ఆకలితో మరణించే పరిస్థితి వచ్చినప్పుడు, దయామయుడైన దేవుడు వర్షాన్ని కురిపిస్తాడు. అంటువ్యాధులు వ్యాపించి వేలాది మంది మరణిస్తున్నప్పుడు, గాలిని శుద్ధి చేసే మార్గాన్ని లేదా చికిత్సను ప్రసాదిస్తాడు. ఒక జాతి క్రూర పాలకుని అణచివేతలో ఉన్నప్పుడు, చివరకు అతని స్థానంలో న్యాయపరుడు, దయామయుడైన పాలకుడిని తీసుకువస్తాడు.

అదే విధంగా, ప్రజలు దేవుని మార్గాన్ని విడిచిపెట్టి, తౌహీద్ మరియు దేవుని ఆరాధనను విడనాడినప్పుడు, దేవుడు పరిపూర్ణ దూరదృష్టిని ప్రసాదించిన ఒక వ్యక్తిని లేపి, తన వాక్యము మరియు దివ్య ప్రత్యక్షతతో గౌరవించి, మానవాళిని సరైన మార్గంలో నడిపించి, సంభవించిన చెడును సంస్కరించేందుకు పంపుతాడు. నిజానికి దేవుడే సర్వలోక పోషకుడు. విశ్వం యొక్క ఉనికి, స్థిరత్వం అన్నీ ఆయనపైనే ఆధారపడి ఉన్నాయి. ఆయన తన సృష్టిని తన కరుణామయ గుణాల నుండి ఎప్పటికీ వంచించడు. వాటిని నిలిపివేయడు. అవసరం ఏర్పడిన వెంటనే అవి కార్యరూపంలోకి వస్తాయి. ప్రపంచాన్ని ఏదైనా విపత్తు ఆవరించినప్పుడు, దానిని తొలగించడానికి దానికి వ్యతిరేకమైన దైవ గుణం తప్పనిసరిగా కార్యరూపంలోకి వస్తుందని మనం తార్కికంగా గ్రహించిన తరువాత; అలాగే చరిత్ర ద్వారా, ఇస్లాం వ్యతిరేకుల ఒప్పుకోలు ద్వారా, పవిత్ర ఖుర్‌ఆన్ సాక్ష్యాల ద్వారా తెలుసుకున్నది ఏమిటంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలంలో ప్రపంచం తీవ్రమైన ఆధ్యాత్మిక సంక్షోభంలో ఉండేది. ప్రజలందరూ తౌహీద్, నిజాయితీ మరియు దైవభక్తి మార్గాన్ని విడిచిపెట్టారు. విగ్రహారాధన మరియు బహుదైవారాధన అనే అంధకారం నుండి ప్రపంచాన్ని బయటకు తీసుకువచ్చి, తౌహీద్‌ను స్థాపించిన మహానుభావుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తప్ప మరెవ్వరూ కాదని తెలిసినప్పుడు, ఆయన నిజంగా దేవుని నుండి పంపబడిన సత్య మార్గదర్శకుడని తేల్చకుండా ఉండలేము.”

**(బరాహీన్-ఎ-అహ్మదియ్యా, భాగం 1, రూహానీ ఖజాయిన్, సంపుటి 1, పుటలు 112--114, ఫుట్‌నోట్ 10)**

ఈ విధంగా, ప్రపంచంలో దైవ ఏకత్వాన్ని (తౌహీద్‌ను) దాని నిజమైన, పరిపూర్ణ రూపంలో స్థాపించినవారు దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం). గత ప్రసంగాలలో కూడా తౌహీద్ స్థాపన కోసం ఆయన ఎంత అంకితభావంతో కృషి చేశారో తెలియజేసే అనేక సంఘటనలను నేను ప్రస్తావించాను.

ఈ యుగంలో కూడా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ చేసిన వాగ్దానానికి అనుగుణంగా, దైవ ఏకత్వాన్ని పునఃస్థాపించడానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి నిజమైన మరియు పరమ శిష్యుడిని ఆయన నియమించాడు. ఈ యుగంలో ఖాదియాన్‌కు చెందిన హజ్రత్ మిర్జా గులామ్ అహ్మద్ (అలైహిస్సలాం) హజ్రత్ మసీహ్ మౌవూద్ వ మహ్దియే మౌవూద్ గారు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బోధనలు మరియు సున్నత్‌కు జీవమూర్తిగా నిలిచారు. తన గురువుపట్ల సంపూర్ణ విధేయతతో, ఆయన హృదయం దైవ ఏకత్వాన్ని ప్రపంచమంతటా వ్యాప్తి చేయాలనే గాఢమైన, హృదయపూర్వకమైన ఆకాంక్షతో నిండి ఉండేది.

దీనికి అనుగుణంగా, ఆయన రచనలలోను, ఆచరణాత్మక జీవితములోను దీనికి సంబంధించిన అనేక ఉదాహరణలను మనము గమనిస్తాము. వాటిలో కొన్ని ఇక్కడ సమర్పిస్తున్నాను.

హుజూర్ (అలైహిస్సలాం) ఇలా పేర్కొన్నారు: “అల్లాహ్ పరమోన్నతుడు మాతో అత్యంత అద్భుతమైన రీతిలో వ్యవహరించాడు. నాకు ఈ దివ్యవాణి ప్రసాదించబడింది: **అన్‌త మిన్ని బి మన్‌జిలతి తౌహీదీ వ తఫ్రీదీ** అనే విన్యూతనమైన దైవవాణి అవతరించినది. అనగా ‘నీవు నా దృష్టిలో నా ఏకత్వము (తౌహీద్) మరియు అద్వితీయత వంటివాడవు.”ఈ ప్రకటన అత్యంత విశిష్టమైనది. ఇలాంటి పదాలను నేను ఇంతకు ముందు ఏ దివ్య ప్రకటనలోనూ చూడలేదు. దీని అర్థం, నాకు తోచిన మేరకు, ఏమనగా, దైవ ఏకత్వం తీవ్రంగా అవమానింపబడి, అత్యంత నిర్లక్ష్యానికి గురైన కాలంలో నియమించబడిన వ్యక్తి, ఒక విధంగా, తౌహీద్‌కు సజీవ ప్రతిరూపంగా మారుతాడు.” (మల్ఫూజాత్, సంపుటి 5, పుట 1, ప్రచురణ 2022)

హుజూర్ (అ) ఒక సభలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. జమాఅత్‌కు చెందిన ఒక పత్రిక దీనిని ఈ విధంగా ఉటంకించింది. మరో జమాఅత్ పత్రిక అల్-బదర్ దీనిని మరింత వివరంగా ఇలా నమోదు చేసింది:

“ఇలాంటి దైవ నియమిత వ్యక్తికి దైవ ఏకత్వాన్ని స్థాపించాలనే తపన అంత తీవ్రంగా ప్రసాదించబడుతుంది కాబట్టి, అతడు తన వ్యక్తిగత లక్ష్యాలు, ఆశయాలన్నింటినీ పక్కనపెట్టి పూర్తిగా తౌహీద్ స్థాపనకే అంకితమైపోతాడు. నిజానికి, అతడే తౌహీద్‌కు సజీవ స్వరూపంగా మారిపోతాడు. అతని లేవడంలో, కూర్చోవడంలో, కదలికలో, నిశ్చలతలో, అతని ప్రతి మాటలోను, ప్రతి కార్యంలోను దైవ ఏకత్వ జ్వాల నిరంతరం ప్రజ్వలిస్తూ ఉంటుంది.”

(అల్-బదర్ సంపుటి 2, సంచిక 12, 10 ఏప్రిల్ 1903, పుట 91)

మరల ఇలా తెలిపారు:“ప్రతి వ్యక్తి తనకో లక్ష్యం, తనకో ఆశయాన్ని నిర్ణయించు కుంటాడు. అయితే అల్లాహ్ ప్రేమలో లీనమైన వ్యక్తి యొక్క ఏకైక లక్ష్యం దైవ ఏకత్వాన్ని స్థాపించడమే. అతడు తన సహజ కోరికలకన్నా, వ్యక్తిగత అవసరాలకన్నా కూడా తౌహీద్‌కు ప్రాధాన్యత ఇస్తాడు. తన అవసరాలన్నింటినీ దాని తరువాత స్థానంలో ఉంచుతాడు. ప్రతి మనిషికి తన లక్ష్యమే ఒక విగ్రహంలా మారుతుంది. దానిని సాధించేందుకు అతడు కృషి చేస్తాడు. అయితే దానిని అతడు సాధిస్తాడా, లేక అంతకు ముందే మరణిస్తాడా అనేది అల్లాహ్ చేతిలోనే ఉంటుంది.” ప్రజలు తమ లక్ష్యాలను సాధించాలనే బలమైన కోరికను కలిగి ఉంటారు. అది వ్యాపారానికి సంబంధించినదైనా, లేక మరే ఇతర ప్రాపంచిక విషయానికైనా సంబంధించినదైనా, వారు ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరచుకుంటారు. అనంతరం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దానిని సాధించే అవకాశాన్ని కల్పిస్తాడు, లేదా దానిని చేరుకునేలోపే వారి జీవితం ముగుస్తుంది. “సంపద, గౌరవం, కుటుంబం లేదా ఇతర అవసరాలను పొందాలనే తపనలో వారు ఎంతగానో ఆందోళన చెందుతారు. కొన్నిసార్లు కొందరు తమ లక్ష్యాలను సాధించాలనే వ్యామోహంలో అంతగా చిక్కుకుపోతారు కాబట్టి ఆత్మహత్యకూ పాల్పడతారు. కానీ దేవునిచే నియమించబడిన వ్యక్తి ఈ తపన, ఉత్సాహమంతటినీ దైవ ఏకత్వాన్ని స్థాపించడానికే మళ్లిస్తాడు. తన వ్యక్తిగత కోరికల స్థానంలో తౌహీద్ స్థాపన కోసమే అతడు తీవ్రంగా ఆరాటపడతాడు.

మరల ఇలా తెలిపారు: “అటువంటి సమయాలలోనే అల్లాహ్ నుండి ఈ దివ్యవాక్యం అవతరిస్తుందని నేను భావిస్తున్నాను: అన్‌త మిన్ని బి మన్‌జిలతి తౌహీదీ వ తఫ్రీదీ అనగా ‘ నీవు నా దృష్టిలో నా ఏకత్వము మరియు అద్వితీయత వంటివాడవు.’ ఎందుకంటే దైవ ఏకత్వం అల్లాహ్‌కు అత్యంత ప్రియమైనది. నిజానికి, ఈ దైవ ఏకత్వాన్ని స్థాపించడానికే అల్లాహ్ కొన్నిసార్లు మహమ్మారులను పంపాడు; కొన్నిసార్లు కరువులను కలిగించాడు; మరికొన్నిసార్లు వేలాది మంది బహుదైవారాధకులను తన ప్రియ ప్రవక్తల చేత నాశనం చేయించాడు. మక్కా మరియు మదీనాలో జరిగిన సంఘటనలన్నీ కూడా ఈ ఒకే కారణం వల్లే సంక్లిష్టమయ్యాయి. అలాగే మూసా (అలైహిస్సలాం) యొక్క ప్రవక్తత్వ లక్ష్యమూ దైవ ఏకత్వాన్ని స్థాపించడమే.”

(మల్ఫూజాత్, సంపుటి 5, పుటలు 1-2, ప్రచురణ 2022)

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం షిర్క్ మరియు దాని సూక్ష్మ రూపాలను మరింత వివరంగా వివరిస్తూ ఇలా పేర్కొన్నారు: “మనిషి షిర్క్ (అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం) నుండి కూడా పూర్తిగా దూరంగా ఉండాలి. సూర్యుడిని, చంద్రుడిని, నక్షత్రాలను, గాలిని, అగ్నిని, నీటిని లేదా మరేదైనా వస్తువును ఆరాధించ కూడదు. అలాగే భౌతిక సాధనాలపై అవే దేవుని భాగస్వాములన్నట్లుగా విశ్వాసం ఉంచ కూడదు. తన స్వంత శక్తి, సామర్థ్యాలపై ఆధార పడకూడదు; ఎందుకంటే అది కూడా ఒక విధమైన షిర్క్‌నే. మనిషి తన వంతు ప్రయత్నమంతా చేసిన తరువాత కూడా, దానిని గొప్పదిగా భావించకుండా, తన జ్ఞానం గానీ, తన కృషి గానీ గురించి గర్వించ కూడదు. తాను అజ్ఞానివని, అర్హతలేని వాడినని భావిస్తూ, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ గడప వద్ద వినయంతో సాష్టాంగపడుతూ, ప్రార్థనల ద్వారా ఆయన అనుగ్రహాన్ని కోరాలి. (అంటే, అన్ని ప్రయత్నాలు చేసిన తరువాత కూడా, అన్నీ అల్లాహ్ కృప ద్వారానే సఫలమవుతాయని గ్రహిస్తూ ఆయన ముందు తలవంచాలి.) జ్ఞానం కోసం మనిషి ఒక గురువుపై ఆధారపడతాడు; అయినప్పటికీ అతని జ్ఞానం పరిమితమే. కానీ అల్లాహ్ జ్ఞానం ఎవరి మీదా ఆధారపడదు. ఆయనకు గురువు అవసరం లేదు. ఆయన జ్ఞానం అనంతమైనది. మనిషి వినికిడి గాలిపై ఆధారపడుతుంది మరియు అది పరిమితమైనది. కానీ అల్లాహ్ వినికిడి స్వతంత్రమైనది, అపరిమితమైనది. మనిషి చూడటానికి సూర్యకాంతి లేదా ఇతర వెలుగులపై ఆధారపడతాడు. అతని దృష్టి కూడా పరిమితమే. కానీ అల్లాహ్ తన స్వంత నూర్ (వెలుగు) ద్వారా చూస్తాడు. ఆయన దృష్టి సమస్తాన్ని ఆవరించి ఉంటుంది. సృష్టించడానికి మనిషికి పదార్థం అవసరం, సమయం అవసరం.

అతని సృష్టి శక్తి కూడా పరిమితమైనది. కానీ అల్లాహ్ సృష్టి శక్తి పదార్థంపైన గానీ, కాలంపైన గానీ ఆధారపడదు. అది ఏ విధంగానూ పరిమితమైనది కాదు. ఎందుకంటే ఆయన అన్ని గుణాలు ఆయన స్వరూపంలాగానే అద్వితీయమైనవి. వాటిలో ఒక్క గుణంలోనైనా లోపం ఉంటే, ఆయన గుణాలన్నీ లోపభూయిష్టమైనవిగా పరిగణించ బడతాయి. కాబట్టి, ఆయన స్వరూపంలోనూ, ఆయన గుణాలలోనూ సమానుడు లేడని విశ్వసించినప్పుడే ఆయన ఏకత్వం (తౌహీద్) సంపూర్ణంగా స్థాపించబడుతుంది."

(లెక్చర్ లాహోర్, రూహానీ ఖజాయిన్ సంపుటి 20, పేజి 154--155)

ఇదే పవిత్ర ఖుర్ఆన్ బోధించిన అల్లాహ్ ఏకత్వం (తౌహీద్). ఇదే విశ్వాసానికి పునాది. ఈ కాలంలో వివిధ ప్రభావాల కారణంగా చిన్నపిల్లల మనస్సుల్లో కూడా ఇలాంటి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వారు ఇలా వ్రాస్తుంటారు: "అల్లాహ్‌ను ఎవరు సృష్టించారు?", "అల్లాహ్ ఎక్కడి నుండి వచ్చారు?" బహుశా పెద్దవారు ఇలాంటి సందేహాలను వారి మనస్సుల్లో కలిగిస్తారేమో, లేదా ఈ ప్రశ్నలు వారి ఆలోచనల్లోనే పుడుతాయేమో. కానీ అల్లాహ్ యొక్క గుణాలు అలాంటివి కావు. ఆయన ఎప్పటినుంచో ఉన్నవాడు; ఎప్పటికీ ఉంటాడు. ఆయనకు ఆది లేదు, అంతం లేదు. అందువల్ల, సమస్త సృష్టిని సృష్టించినవాడు ఆయనే; ఆయనను ఎవరూ సృష్టించలేదు. స్వయంగా ఉనికిలో ఉండి, మరెవరిచేత సృష్టింపబడని పరమసత్తా అనే భావన ఎవరికి వచ్చినా, అది ఒక్క సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కే వర్తిస్తుంది.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మరల ఇలా తెలిపారు:

"గుర్తుంచుకోండి! అల్లాహ్ మన నుండి అంగీకరింపజేయాలనుకునే నిజమైన తౌహీద్, మరియు నిజమైన మోక్షం ఆధారపడిన తౌహీద్ ఏమిటంటే, అల్లాహ్‌కు ఎలాంటి భాగస్వామి లేడని విశ్వసించడం. అది విగ్రహమై ఉండొచ్చు, మనిషై ఉండొచ్చు, సూర్యుడై ఉండొచ్చు, చంద్రుడై ఉండొచ్చు, మన స్వంత అహంకారమై ఉండొచ్చు, మన యుక్తులై ఉండొచ్చు, ఏదీ ఆయనకు సమానం కాదు. సమస్త శక్తికి, జీవనాధారానికి, గౌరవానికీ, అవమానానికీ, సహాయానికీ, రక్షణకీ మూలం ఒక్క అల్లాహ్ మాత్రమే అని నమ్మాలి. మన ప్రేమ, ఆరాధన, ప్రార్థన, ఆశ, భయం అన్నీ ఆయనకే అంకితం కావాలి. కాబట్టి, తౌహీద్ సంపూర్ణంగా ఉండాలంటే ఈ మూడు అంశాలు తప్పనిసరిగా ఉండాలి: (1) అల్లాహ్ స్వరూపంలో తౌహీద్: ఆయన తప్ప మిగతా సమస్తం నశించిపోయేదని, మరణించేదని, స్వతంత్ర ప్రాముఖ్యత లేనిదని భావించడం. (అంటే ఆయన తప్ప మిగతా ప్రతిదీ పరిపూర్ణత లేనిదే.) అన్నింటిని హాలికతుజ్జాత్ వ బాతిలతుల్ హఖీఖతు అని భావించాలి. వస్తువులన్నియు నామరూపాలు లేకుండ పోయేవి. అసత్యమైనవి. వాటిలో ఎలాంటి పరిపూర్ణత లేదు. (2) అల్లాహ్ గుణాలలో తౌహీద్: పోషకత్వం (రుబూబియ్యత్) మరియు దైవత్వం (ఉలూహియ్యత్) అనే గుణాలు సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కే చెందుతాయని విశ్వసించడం. సృష్టికి పోషణ, లాభం కలిగిస్తున్నట్లు కనిపించే ఇతర సాధనాలన్నీ ఆయన దైవిక ప్రణాళికలో భాగమే. (అమెరికా కాదు, ఇజ్రాయెల్ కాదు, ప్రపంచంలోని మరే శక్తి కాదు, అసలు శక్తి ఒక్క అల్లాహ్‌దే. ముస్లింలు ఈ సత్యాన్ని గుర్తిస్తే, వారు తప్పకుండా విజయాన్ని సాధిస్తారు.)

(3) ప్రేమ, చిత్తశుద్ధి మరియు భక్తిలో తౌహీద్: ప్రేమలోనూ, భక్తిలోనూ అల్లాహ్‌కు ఎవరినీ భాగస్వామిగా చేయకుండా, తనను పూర్తిగా ఆయనకే అంకితం చేసుకోవడం."

**(సిరాజొద్దీన్ ఈసాయికే చార్ సవాలోంకే జవాబ్, రూహానీ ఖజాయిన్ సంపుటి 12, పేజి 349-350)**

అంటే, ఒక మనిషి సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ని ప్రేమించవలసిన విధంగా మరెవరినీ ప్రేమించకూడదు. ప్రేమలో, భక్తిలో, విశ్వాసంలో అల్లాహ్‌కే అత్యున్నత స్థానం ఇవ్వాలి.

మరల హుజూర్ (అ) ఇలా తెలిపారు: "ఈ యుగంలో, భూమి అవినీతితో నిండిపోయిందని, అనేక మంది షిర్క్ (దేవునికి భాగస్వాములను కల్పించడం) మార్గాన్ని అనుసరిస్తున్నారని, అలాగే మరియమ్మ కుమారుడైన ఒక వినయశీల మానవుడిని దేవుడిగా భావించే నాలుగు వందల మిలియన్లకు పైగా ప్రజలు ప్రపంచంలో ఉన్నారని (ఆ సమయంలో క్రైస్తవుల సంఖ్య నాలుగు వందల మిలియన్లు) అల్లాహ్ చూశాడు. దీనితో పాటు మద్యపానం, అనైతికత, ప్రాపంచికాసక్తి మరియు నిర్లక్ష్య జీవనశైలి తీవ్రస్థాయికి చేరుకున్నాయి. అప్పుడు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఈ దురాచారాలను సంస్కరించుటకు నన్ను ఈ కార్యానికి నియమించాడు. అందువల్ల, ఇప్పటివరకు నా చేతుల ద్వారా దాదాపు ఒక లక్ష మంది తమ దుష్కార్యాలు, తప్పుడు విశ్వాసాలు మరియు చెడు ప్రవర్తనల నుండి పశ్చాత్తాపపడ్డారు. (ఇది ఆయన ఈ ప్రకటన చేసిన సమయానికి సంబంధించినది. ఇప్పుడు అల్లాహ్ కృపతో లక్షలాది మంది ఆయన జమాత్‌లో చేరారు.) ఆయన సూచనలను కూడా ప్రస్తావిస్తూ, 'ఇప్పటికే 150 కంటే ఎక్కువ సూచనలు ప్రత్యక్షమయ్యాయి. వీటికి ఈ దేశంలోని లక్షలాది మంది సాక్షులు' అని అన్నారు. "నన్ను పంపిన ఉద్దేశ్యం ఏమిటంటే, భూమిపై మళ్లీ దైవ ఏకత్వాన్ని (తౌహీద్‌ను) స్థాపించడం; మానవారాధన మరియు విగ్రహారాధన నుండి ప్రజలను విముక్తి చేసి, వారిని భాగస్వాములు లేని ఏకైక దేవుని వైపు మళ్లించడం. అలాగే వారి దృష్టిని అంతరంగ పవిత్రత మరియు నీతిమంతమైన జీవితంపై కేంద్రీకరించడం."

"అందువల్ల, ప్రజలలో ఒక ఉద్యమం ప్రారంభమైనట్లు నేను గమనిస్తున్నాను. వేలాది మంది నా చేతుల ద్వారా నిరంతరం పశ్చాత్తాపపడుతున్నారు. ఇప్పుడు ఆకాశం నుండి ఒక ఆధ్యాత్మిక గాలి వీస్తోంది. దాని ప్రభావంతో ప్రజలు సహజంగానే దేవుని ఏకత్వం వైపు ఆకర్షితులవుతున్నారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇప్పుడు ప్రపంచం నుండి మానవారాధనను నిర్మూలించాలని సంకల్పించినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ దైవిక లక్ష్యాన్ని నెరవేర్చుటకు వందలాది మార్గాలు సిద్ధం చేయబడ్డాయి."

(మక్తూబాత్-ఏ-అహ్మద్, సంపుటి 1, పుటలు 256--257)

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అదే సాధనాలను మనకూ ప్రసాదించాడు. వాటి ద్వారా మనమూ ఈ సందేశాన్ని ప్రచారం చేస్తున్నాము. కాబట్టి, దేవుని ఏకత్వాన్ని ప్రచారం చేయడానికి కృషి చేయడం ప్రతి అహ్మదీ యొక్క విధి.

హుజూర్ (అ) మరల ఇలా తెలిపారు: "విగ్రహారాధన అంటే ఏమిటి? ప్రజలు ఏ కారణంగా విగ్రహారాధకులవుతారు? అనే ప్రశ్నకు స్పష్టమైన వివరణ అవసరం."

"ఆరాధన అనేది మనిషి విశ్వాసాల ఫలితం. సత్యవంతుల విశ్వాసం ఏమిటంటే: దేవుడు ఒక్కడే. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క గుణాలు ఆదికాలం నుంచే ఉన్నాయి; శాశ్వతంగా అలాగే ఉంటాయి. అంటే, ఆయన గుణాలలో ఎలాంటి మార్పు గానీ, పరివర్తన గానీ సంభవించదు. అవి ఆది అంతాలు లేనివి. నిజమైన మరియు యథార్థమైన దేవుడు శాశ్వతుడు. ఆయనకు ఆది లేదు. ఆయన పుట్టుక ద్వారా ఉనికిలోకి వచ్చిన సృష్టి కాదు. (ముందు చెప్పినట్లుగా, కొందరి ప్రశ్నలకు ఇక్కడ కూడా సమాధానం లభిస్తోంది.) నిజమైన దేవుడు నిత్యుడు, శాశ్వతుడు. ఆయన జన్మించలేదు. ఎవరిచేత సృష్టింపబడలేదు. అటువంటి లక్షణాలకు ఆయన అత్యంత ఉన్నతుడు. అలాంటి లక్షణాల కంటే తక్కువ లక్షణాలను కల్గిన వారిని అంగీకరించినచో మన హృదయాలకు అసహ్యాన్ని కలిగిస్తుంది. ఆయన గుణాలు మన హృదయాలే సాక్ష్యమిచ్చే గుణాలు; వాటితో మన హృదయాలు సహజంగానే పరిచయం కలిగి ఉంటాయి. ఆయన ఆదికాలం నుంచే ఒక్కడే. ఆయన ఏకత్వాన్ని తిరస్కరించే హృదయం ఎక్కడ ఉంది? ఆయన ఎప్పటినుంచో ఒక్కడే. అయితే ఆయన ముగ్గురని (త్రిత్వాన్ని) నిజంగా అంగీకరించగల హృదయం ఎక్కడ ఉంది?"

(మక్తూబాత్-ఏ-అహ్మద్, సంపుటి 5, పుటలు 489--490)

ఇది, సహజంగానే, క్రైస్తవ మతంలోని త్రిత్వ సిద్ధాంతాన్ని సూచిస్తుంది. అంటే ముగ్గురు దేవుళ్లు ఉన్నారనే బోధన. అయితే, ఆరోగ్యకరమైన మరియు ఉన్నతమైన స్వభావం కలిగిన ఏ వ్యక్తీ అలాంటి సిద్ధాంతాన్ని నిజంగా అంగీకరించలేదు.

హుజూర్ మరల ఇలా తెలిపారు: "త్రిత్వ సిద్ధాంతంలో ఏర్పడిన భ్రష్టత్వాలను సరిదిద్దడానికి నన్ను పంపించారు. (అంటే, క్రైస్తవ మతంలో ఏర్పడిన వక్రీకరణలను సరిచేయడానికి.) ప్రపంచంలో నలభై కోట్లకు పైగా ప్రజలు ఈసా (అలైహిస్సలాం)ను దేవుడిగా భావిస్తున్నారనే హృదయవిదారక దృశ్యం నా హృదయాన్ని ఎంతగానో కలచివేసింది. నా జీవితమంతటిలో దీనికంటే గొప్ప దుఃఖాన్ని నేను ఊహించలేను. నిజంగా, కేవలం దుఃఖం వల్లనే మరణించడం సాధ్యమైతే, ఈ ఒక్క దుఃఖమే నన్ను నాశనం చేసేది. ఎందుకంటే, ఈ ప్రజలు భాగస్వాములు లేని ఏకైక దేవుణ్ణి విడిచిపెట్టి ఒక వినయశీల మానవుణ్ణి ఎందుకు ఆరాధిస్తున్నారు? అలాగే, నిజమైన మార్గదర్శకత్వం మరియు సరైన మార్గంతో ప్రపంచానికి వచ్చిన ఆ ప్రవక్తను (అంటే దైవ ప్రవక్త ముహమ్మద్(స) ను) ఎందుకు విశ్వసించడం లేదు?. ప్రతి క్షణం ఈ దుఃఖపు దెబ్బల వల్ల నేను మరణిస్తానేమోనని నేను భయపడుతూనే ఉండేవాడిని."

మరల ఇలా తెలిపారు:

"పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా చెప్పినప్పుడు ఆయన నిజమే పలికాడు: ఒక నిస్సహాయ మానవుణ్ణి దేవుడిగా మార్చిన ఈ అపవాదు కారణంగా ఆకాశాలు కూడా పగిలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. నా హృదయ వేదన ఎంత తీవ్రమైందంటే, ఇతరులు స్వర్గాన్ని కోరుకుంటే, నా జీవితకాలంలోనే మానవజాతి ఈ షిర్క్ (అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం) నుండి విముక్తి పొందడాన్ని చూడడం, అలాగే అల్లాహ్ మహిమ ప్రత్యక్షమవడాన్ని దర్శించడమే నా స్వర్గం. "నా ఆత్మ ఎల్లప్పుడూ ఇలా ప్రార్థిస్తుంది: 'ఓ అల్లాహ్! నేను నీ నుండి వచ్చినవాడినైతే, నీ అనుగ్రహ ఛాయ నాపై ఉంటే, మరి ఆ రోజును నాకు చూపించు. యేసు (అలైహిస్సలాం)పై మోపబడిన ఈ తప్పుడు ఆరోపణ తొలగిపోవాలి. అంటే, ఆయన నవూజు బిల్లాహ్ తనను

**నూరుల్ ఇస్లాం శాఖ:**

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**
**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**
**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలవు).**

దేవుడిగా ప్రకటించు కున్నాడనే ఈ అపవాదు పూర్తిగా నివృత్తి కావాలి.' "చాలా కాలంగా నా ఐదు వేళల నమాజులన్నింటిలో నేను ఇదే ప్రార్థిస్తున్నాను. అల్లాహ్ ఈ ప్రజలకు సత్యాన్ని గ్రహించే దృష్టిని ప్రసాదించుగాకా! వారు ఆయన ఏకత్వాన్ని విశ్వసించుగాకా!, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను గుర్తించుగాకా!, అలాగే త్రిత్వ సిద్ధాంతంపై తమ విశ్వాసం గురించి పశ్చాత్తాపపడుగాకా!"
(మజ్మూఆ-ఎ-ఇష్తిహారాత్, సంపుటి 2, పుటలు 547--548, ప్రచురణ 2018)

ఆచరణలో చూస్తే, క్రైస్తవ మత ప్రభావం క్రమంగా తగ్గుతోంది. త్రిత్వ సిద్ధాంతం కూడా చాలా మందికి ఇప్పుడు పుస్తకాలలో మాత్రమే ఉండే ఒక సిద్ధాంతంగా మిగిలిపోయింది. ముఖ్యంగా యూరప్‌లో దానిని నిజంగా ఆచరించే వారు చాలా తక్కువ. ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాలలో ఇప్పటికీ చాలామంది దానిని అనుసరిస్తున్నారు. అయితే త్రిత్వ సిద్ధాంతాన్ని విడిచిపెడుతున్న వారందరూ ఒకే దేవుడైన అల్లాహ్‌పై విశ్వాసం వైపు మళ్లుతున్నారని చెప్పలేం. అందువల్ల, తౌహీద్ (అల్లాహ్ ఏకత్వం) భావనను స్థాపించేందుకు మనం సాధ్యమైనంత వరకు శక్తివంచన లేకుండా ఈ సందేశాన్ని ప్రచారం చేయాలి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) రాక యొక్క ఉద్దేశ్యాన్ని నెరవేర్చడంలో సహకరించే భాగ్యాన్ని ప్రసాదించుగాకా!. అలాగే దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రకటించిన నిజమైన తౌహీద్ సిద్ధాంతాన్ని మనం స్వయంగా ఆచరించడమే కాకా, ప్రపంచమంతటా వ్యాప్తి చేయగల శక్తిని కూడా ప్రసాదించుగాకా!. మానవజాతి విముక్తికి ఇదే ఏకైక మార్గం. దీనికి ప్రత్యామ్నాయం మరొకటి లేదు. అల్లాహ్ మనందరికీ దీనిని చేయగల సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా!.

నమాజ్ అనంతరం నేను రెండు పరోక్ష జనాజా నమాజులను చదివించుతాను. మొదటిది గౌరవనీయులైన ఖ్వాజా జఫర్ అహ్మద్ సాహిబ్ గారి జనాజా. ఆయన గతంలో సియాల్కోట్ జిల్లా అమీర్‌గా సేవలందించారు. ఇటీవలి సంవత్సరాలలో అమెరికాలో నివసిస్తూ ఉండేవారు. ఇటీవల 91 సంవత్సరాల వయస్సులో ఆయన మరణించారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. మృతుడు ఒక మూసీ. ఆయన కుమార్తె హఫ్సా హయ్ ఇలా పేర్కొన్నారు: చిన్నప్పటి నుంచే తమ తండ్రి అత్యంత నిజాయితీతో, వినయంతో, సంపూర్ణ అంకితభావంతో జమాఅత్ సేవలో తన జీవితాన్ని అంకితం చేయడాన్ని తాము చూశాము. ఖిలాఫత్ పట్ల ఆయనకు ఉన్న గాఢమైన అనుబంధం ఆయన వ్యక్తిత్వంలోని ముఖ్యమైన లక్షణం. అదే ఆయన పిల్లలలో, కుటుంబ సభ్యులలో ఖిలాఫత్ పట్ల ప్రేమ, విధేయతలను పెంపొందించడంలో ప్రధాన పాత్ర పోషించింది. ఇది నిజమే. ఆయన అత్యంత విశ్వాసపాత్రుడు, నిష్కపటుడు, జమాఅత్ వ్యవస్థ పట్ల సంపూర్ణ అంకితభావం కలిగిన వ్యక్తి. తన యవ్వనం నుండి జీవితాంతం వరకు జమాఅత్ సేవ చేసే అనేక అవకాశాలు ఆయనకు లభించాయి. జిల్లా స్థాయిలో ఖుద్దామ్-ఉల్-అహ్మదియ్యా ఖాయిద్‌గా, ముకామీ ఖాయిద్‌గా, ముకామీ అమీర్‌గా, అలాగే జిల్లా అమీర్‌గా ఆయన సేవలందించారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి అతిథులకు సేవ చేయడం ఆయనకు ఎంతో ఇష్టమైన పని. కేంద్రీయ ప్రతినిధి బృందాలు వచ్చినప్పుడల్లా, వారిని తన ఇంట్లో ఆతిథ్యం ఇచ్చి, మనస్ఫూర్తిగా సేవ చేసేవారు. ఎంతో ఆనందంగా అతిథి సత్కారం చేసేవారు. ఆ సేవలో నిమగ్నమైనప్పుడు ఆయన ముఖంలో ప్రత్యేకమైన సంతృప్తి కనిపించేది. ఏ పదవీధారుడి గురించి ఆయన ఎప్పుడూ అనుచితంగా మాట్లాడలేదు. అలాంటి విమర్శలను వినడానికీ ఆయన సిద్ధంగా ఉండేవారు కాదు. తన సమక్షంలో అనవసరమైన విమర్శలను అస్సలు అనుమతించేవారు కాదు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌పై ఆయనకు సంపూర్ణ విశ్వాసం ఉండేది. జమాఅత్ సేవలో గానీ, వ్యక్తిగత జీవితంలో గానీ ఏదైనా కష్టసమయం వచ్చినప్పుడు, ఆయన పూర్తిగా ప్రార్థన వైపు మళ్లి, అల్లాహ్‌పైనే ఆధారపడేవారు. ఆయన కుమార్తె చెబుతున్నదేమిటంటే, అనేక సందర్భాలలో అల్లాహ్ ఆయనకు అపారమైన సహాయాన్ని అందించి, ఆయన ప్రార్థనలను స్వీకరించినట్లు తాము ప్రత్యక్షంగా చూశామని చెప్పారు. అలాగే, దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లిని ఆయన ఎంతో ప్రేమతో సేవించారు. అనేక సంవత్సరాల పాటు అపారమైన సహనం, ప్రేమతో ఆమెను సంరక్షించారు.

ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, మనుమలు, మనుమరాళ్లు, మునిమనుమలు, మునిమనుమరాళ్లు ఉన్నారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆయనకు తన మన్ననలను మరియు అపారమైన కరుణను ప్రసాదించుగాకా!.

పరిపాలనా పరంగా జిల్లా అమీర్‌గా ఆయనకు ప్రతి జమాత్ గురించి, చిన్న చిన్న గ్రామాలలోని స్థానిక జమాత్‌ల గురించి కూడా పూర్తి అవగాహన ఉండేది. జిల్లాలోని అన్ని మార్గాలు, పరిస్థితులపై ఆయనకు లోతైన పరిజ్ఞానం ఉండేది. ఆయన నగరంలోనే ఉండిపోయే అమీర్ కాదు. జిల్లా అంతటా నిరంతరం పర్యటించేవారు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు, సియాల్కోట్ నుండి జల్సా సలానాకు హాజరయ్యే వారి కోసం ప్రత్యేక రైళ్లు నడిపిన సందర్భాల్లో, వాటి నిర్వహణను అత్యంత క్రమశిక్షణతో, సమర్థవంతంగా నిర్వహించేవారు. ఆయన ప్రేమపూర్వక స్వభావం కలిగినవారు, నిష్కపటత, విశ్వాసం నిండిన వ్యక్తి, అలాగే అత్యంత వినయశీలి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆయనను మన్నించి తన కరుణను ప్రసాదించుగాకా!.

రెండవ ప్రస్తావన బుర్కినా ఫాసోకు చెందిన స్థానిక అహ్మదీ అయిన గౌరవనీయులైన ఓయుద్రాగో హలిదూ సాహిబ్ గారిది. ఆయన సైన్యంలో ఉద్యోగం చేసేవారు. ఇటీవల ఆయనను ఉవాహిగూయా ప్రాంతంలోని ఒక గ్రామానికి బదిలీ చేశారు. ఆ ప్రాంతంలో ఉగ్రవాదుల కారణంగా తీవ్ర అశాంతి నెలకొంది. మార్చి 3వ తేదీన విధి నిర్వహణలో ఉండగా జరిగిన ఉగ్రవాద దాడిలో ఆయన అమరులు అయ్యారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. ఆయన వయస్సు 40 సంవత్సరాలు. ఆయన నిష్కపటమైన ఖాదిమ్. 2007లో అహ్మదియ్యత్‌ను స్వీకరించారు. ఆయన, ఆయన భార్య మాత్రమే తమ తమ కుటుంబాలలో అహ్మదీలు. వారి కుటుంబాలలో మరెవరూ అహ్మదియ్యత్‌ను స్వీకరించలేదు.

ప్రాంతీయ మిషనరీ సాదాత్ సాహిబ్ తెలిపిన వివరాల ప్రకారం, మృతుడు జమాత్‌కు అత్యంత చురుకైన సభ్యుడు. జమాత్ పట్ల, ఖిలాఫత్ పట్ల ఆయనకు ఎంతో గాఢమైన అనుబంధం ఉండేది. ఆయన ధర్మనిష్ఠుడు, అంకితభావం కలిగిన, నిజాయితీ గల అహ్మదీ యువకుడు. ఆయన మజ్లిస్ ఖుద్దామ్-ఉల్-అహ్మదియ్యా యొక్క ఖాయిద్‌గా కూడా సేవలందించారు. చందాను క్రమం తప్పకుండా చెల్లించేవారు. జమాత్ కార్యక్రమాలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొనేవారు. సైన్యంలో ఉద్యోగం చేస్తున్నప్పటికీ, ప్రతి సంవత్సరం బుర్కినా ఫాసోలో జరిగే జల్సా సలానాకు తప్పకుండా హాజరయ్యేవారు. మిషనరీలు, ముబల్లిఘ్‌లను ఎంతో గౌరవించేవారు మరియు వారికి సహాయం చేసేవారు.
2008లో నేను ఘానాను సందర్శించినప్పుడు, అయితే నేను 2005లోనే బుర్కినా ఫాసోను సందర్శించాను. బుర్కినా ఫాసో నుండి ఖుద్దామ్ బృందం సైకిళ్లపై ప్రయాణించి ఘానాకు వచ్చింది. వారు వెయ్యి కిలోమీటర్లకు పైగా దూరాన్ని ప్రయాణించారు. వారు ఉపయోగించిన సైకిళ్లు మన దగ్గర ఉండే మంచి సైకిళ్లు కావు; పాడైపోయిన సైకిళ్లతో, అధ్వాన్నమైన రహదారులపై ప్రయాణించి కూడా వెయ్యి కిలోమీటర్లకు పైగా దూరాన్ని అధిగమించారు. వారు ఘానాకు చేరుకుని నన్ను కలిశారు. ఆయన కూడా జల్సాలకు సైకిల్‌పై ప్రయాణించే వారు.

స్థానిక మిషనరీ సింపోరే అబ్దుల్ రెహ్మాన్ సాహిబ్ ఇలా తెలిపారు. ఆయన జమాత్ సేవకు పూర్తిగా అంకితభావంతో ఉండేవారు. ఏ పని అప్పగించినా వెంటనే సిద్ధంగా ఉండేవారు. పిలిచిన వెంటనే స్పందించేవారు. జల్సా సలానా మరియు ఇతర సంస్థాగత సమావేశాలలో ఎంతో బాధ్యతాయుతంగా సేవలందించారు. ఆయన అంకిత భావాన్ని చూసి ప్రజలు ఆయనను "చిన్న ముబల్లిఘ్" అని పిలిచేవారు. ఎందుకంటే కొంతమంది నియమిత ముబల్లిఘ్‌లు కూడా ఆయన చూపినంత సేవాభావాన్ని ప్రదర్శించలేక పోయారు.

సైన్యంలో ఉద్యోగం రాకముందు ఆయన తాను పేదవాడినని, జమాత్ అభివృద్ధికి ఎలా తోడ్పడగలనని ఎంతో ఆందోళన చెందేవారు. ఉద్యోగం వచ్చిన తరువాత చందాను క్రమం తప్పకుండా చెల్లించడం ప్రారంభించారు. జమాత్‌తో ఆయనకు ఎంతో గాఢమైన అనుబంధం ఉండేది. ఎక్కడికి బదిలీ అయినా, ముందుగా అక్కడి జమాత్ కేంద్రం లేదా మస్జిద్ ఎక్కడుందో తెలుసుకుని, ప్రతి శుక్రవారం నమాజుకు క్రమం తప్పకుండా హాజరయ్యేవారు.

ఆయనకు తల్లి, భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అల్లాహ్ సర్వశక్తిమంతుడు ఆయనను మన్నించి తన అపారమైన కరుణను ప్రసాదించుగాకా!.

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దువా ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)


Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

# జుమా ప్రసంగము

హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక సందర్భంలో ఇలా చెప్పేవారు: ఒక వ్యక్తి కుమారుడు మరణించాడు. అతని స్నేహితుడు అతనిని ఓదార్చడానికి వెళ్లాడు. అప్పుడు ఆ వ్యక్తి బిగ్గరగా విలపిస్తూ, 'దేవుడు నాపట్ల అన్యాయం చేశాడు' అని అన్నాడు. అంటే, దేవుడు తనకు చెందాల్సిన ఏదో హక్కును తన నుండి తీసుకున్నాడని అతడు భావించాడు."

---

ఈ దైవప్రేమ యొక్క తీవ్రమైన తాపం కారణంగానే, అల్లాహ్ యొక్క మహిమకూ ఏకత్వానికీ విరుద్ధమైన సిద్ధాంతాలను బోధించే లేదా ఆయనకు ఏ విధమైన అవమానాన్ని ఆపాదించే ఏ మతాన్నీ నేను అంగీకరించలేక పోయాను. అందుకే క్రైస్తవ మతాన్ని నేను సమర్థించలేదు. ఎందుకంటే దాని ప్రతి అడుగులోనూ గౌరవమూ మహిమల యజమానుడైన అల్లాహ్‌కు అవమానం ఉంది. తనను తాను కూడా రక్షించుకోలేని ఒక వినయశీలుడైన మనిషిని దేవుడిగా ప్రకటించి, అతనినే ఆకాశాలకూ భూమికీ సృష్టికర్తగా భావించింది."

---

ప్రపంచ పరిస్థితి, ముఖ్యంగా ముస్లిం ప్రపంచ పరిస్థితి గురించి ప్రతి ఒక్కరికీ తెలుసు. ప్రస్తుతం ప్రార్థనల అవసరం చాలా ఎక్కువగా ఉంది.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హ్రజత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 10 ఏప్రిల్ 2026 ( 10 షహాదత్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

اَشْهَدُ اَنْ لَّا اِلٰهَ اِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَاَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

اَمَّا بَعْدُ فَاَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ -

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ ۙ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

నేను ఇప్పుడు హ్రజత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) తన గురువైన హ్రజత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అడుగుజాడల్లో నడుచుకుంటూ తౌహీద్ (అల్లాహ్ యొక్క ఏకత్వం) స్థాపన కోసం చేసిన కృషిలోని కొన్ని సంఘటనలను, ఆయన ఆచరణాత్మక ఆదర్శాలను, తన అనుచరులకు చేసిన ఉపదేశాలను మరియు వారి నైతిక శిక్షణ కోసం ఆయన అనుసరించిన విధానాన్ని ప్రస్తావిస్తున్నాను.

హ్రజత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రదియల్లాహు అన్హు) ఇలా పేర్కొన్నారు: "హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక సందర్భంలో ఇలా చెప్పేవారు: ఒక వ్యక్తి కుమారుడు మరణించాడు. అతని స్నేహితుడు అతనిని ఓదార్చడానికి వెళ్లాడు. అప్పుడు ఆ వ్యక్తి బిగ్గరగా విలపిస్తూ, 'దేవుడు నాపట్ల అన్యాయం చేశాడు' అని అన్నాడు. అంటే, దేవుడు తనకు చెందాల్సిన ఏదో హక్కును తన నుండి తీసుకున్నాడని అతడు భావించాడు." హ్రజత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రదియల్లాహు అన్హు) హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వివరించిన ఈ సంఘటనను కొనసాగిస్తూ ఇలా చెప్పారు: "ఒక మనిషికి అల్లాహ్‌పై అసలు ఏ హక్కు ఉందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. నాకు ఎప్పుడూ ఆశ్చర్యంగా అనిపించేది ఏమిటంటే, తమ నమాజ్‌లు, ఉపవాసాలు, జకాత్, హజ్జ్, నీతి, పవిత్రతల గురించి గర్వపడే వారు కష్టాలు వచ్చినప్పుడు 'అల్లాహ్ మాపట్ల అన్యాయం చేశాడు' అని అంటారు. కానీ భారతదేశానికి చెందిన ఒక మద్యపానానికి బానిసైన కవి ఉండేవాడు. అతనికి మతం గురించి ఏమీ తెలియదు. అయినప్పటికీ, ఒకసారి అతనికి స్పష్టమైన చైతన్యం కలిగిన సమయంలో, మద్యం సేవించే వాడైనప్పటికీ, అల్లాహ్ తఆలా అతని హృదయంలో ఒక దైవిక ప్రేరణను ప్రసాదించాడు. అప్పుడు అతను ఇలా అన్నాడు:

**జాన్ దీ దీ హుయి ఉసీకీ థీ - హక్‌తో యేహైకే హఖ్ అదా నా హువా**

అనగా'మనకు జీవితం ప్రసాదించిన వానికి మన జీవితాలను అర్పించాము; అయినప్పటికీ, నిజం ఏమిటంటే, ఆయనకు మనపై ఉన్న హక్కును మనం పూర్తిగా నెరవేర్చలేకపోయాము."

(దునియామే తరక్కీ కర్నేకి గుర్, అన్వారుల్ ఉలూమ్ సంపుటి 12, పేజి 311-312)

కాబట్టి, మనకు లభించిన ప్రతి అనుగ్రహం, మన సంతానం సహా, అన్నీ కేవలం అల్లాహ్ కృప వల్లనే లభించాయని ప్రతి వ్యక్తి ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. అందువల్ల మనం ఎల్లప్పుడూ ఆయనకు పూర్తిగా విధేయులుగా ఉండాలి. మన ప్రతి మాటలో, ప్రతి కార్యంలో ఆయన ఏకత్వాన్ని ప్రతిఫలింపజేయాలి. అంతే కాకుండా, షిర్క్ (అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం) అనే భావనకు సంబంధించిన అతి స్వల్పమైన ఆనవాళ్లు కూడా మనలో చోటు చేసుకోనీయకూడదు.

అల్లాహ్ పై మనకు ఎలాంటి హక్కు ఉందని ఎప్పుడూ భావించకూడదు. కొంతమేర ఆరాధన చేసినంత మాత్రాన ఆయనకు మన బాధ్యతను పూర్తిగా నెరవేర్చినట్టు కాదు. వాస్తవానికి, ఆరాధన మన సొంత ప్రయోజనం కోసమే.

అందుకే ఆ కవి చెప్పినట్లుగా, అల్లాహ్ మనకు జీవితం ఇచ్చాడు, మనలను సృష్టించాడు, ఈ లోకంలోకి తీసుకువచ్చాడు. అయినప్పటికీ, ఆయనకు కృతజ్ఞత తెలియ జేయడానికి ఆయనకు మనపై ఉన్న హక్కును పూర్తిగా నెరవేర్చే శక్తి మనకు లేదు. హ్రజత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రదియల్లాహు అన్హు), హ్రజత్ మసీహ్ మౌవూదں (అలైహిస్సలాం) తన స్వంత కుమారుడు మరణించినప్పుడు చూపిన ప్రతిస్పందన గురించి కూడా ఒక సంఘటనను వివరిస్తూ ఇలా చెప్పారు:

'హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ముబారక్ అహ్మద్‌ను ఎంతో ప్రేమించే వారు. అతడు అనారోగ్యానికి గురైనప్పుడు ఎంతో శ్రద్ధగా చూసుకున్నారు. అందువల్ల హ్రజత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ రదియల్లాహు అన్హు కూడా, ముబారక్ అహ్మద్ మరణిస్తే హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తీవ్రంగా దుఃఖిస్తారేమోనని ఆందోళన చెందారు. చివరి క్షణాల్లో, హ్రజత్ మౌల్వీ సాహిబ్ అతని నాడిని పరీక్షిస్తున్నప్పుడు, హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను కస్తూరి తీసుకు రమ్మని కోరారు. ఆ బాలుడి నాడి క్రమంగా మందగిస్తున్న సమయంలో, అతని మరణం హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంకు ఎంతటి దుఃఖాన్ని కలిగిస్తుందో అన్న ఆలోచన హ్రజత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ రదియల్లాహు అన్హును అంతగా కలచివేసింది కాబట్టి, వారు నేలపై కుప్పకూలిపోయారు. అయితే, ముబారక్ అహ్మద్ మరణించిన విషయం తెలిసిన వెంటనే, హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అత్యంత సహనంతో తన మిత్రులకు ఉత్తరాలు రాయడం ప్రారంభించారు. వాటిలో ముబారక్ అహ్మద్ మరణించిన విషయాన్ని తెలియజేస్తూ, దీనివల్ల వారు అధికంగా విచారించవద్దని, ఇది అల్లాహ్ చిత్తమని, అందువల్ల సహనంతో ఉండాలని సూచించారు. అనంతరం హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బయటకు వచ్చి, చిరునవ్వుతో ఒక ప్రసంగం చేశారు. ముబారక్ అహ్మద్ గురించి అల్లాహ్ ప్రసాదించిన దైవవాణి నెరవేరిందని చెప్పారు. ఈ సందర్భంగా హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం రాసిన ఒక పద్యపు పంక్తి కూడా ఉంది:

బులానే వాలాహై సబ్‌సే ప్యారా
ఉసీపే అయే దిల్ తూ జాన్ ఫిదా కర్.
పిలిచువాడే అత్యంత ప్రియమైనవాడు;
ఓ నా హృదయమా! ఆయన కొరకు నిన్ను నీవు అర్పించుకో.'
(నిజాత్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 7,పేజి 65-66)

అదేవిధంగా, హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జీవితాన్ని వివరిస్తూ హ్రజత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రదియల్లాహు అన్హు) ఒక సందర్భంలో ఇలా పేర్కొన్నారు: " హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక విషయాన్ని ఎన్నోసార్లు చెప్పడం నేను విన్నాను. పదవి నుంచి తొలగించబడిన టర్కీ సుల్తాన్ అబ్దుల్ హమీద్ ఖాన్ గురించి ప్రస్తావిస్తూ, 'సుల్తాన్ అబ్దుల్ హమీద్ ఖాన్‌లో నాకు ఎంతో నచ్చిన ఒక గుణం ఉంది' అని చెప్పేవారు. (అతని అనేక చర్యలు తప్పుగా ఉన్నప్పటికీ, ఒక విషయంను మాత్రం వారు (అ) ఎంతో మెచ్చుకునేవారు. అది ఏమిటి?) గ్రీస్‌తో యుద్ధం చేయాలనే ప్రశ్న వచ్చినప్పుడు, మంత్రులు అనేక కారణాలు చూపారు. వాస్తవానికి, సుల్తాన్ అబ్దుల్ హమీద్ యుద్ధం జరగాలని కోరుకున్నాడు. కానీ మంత్రులు యుద్ధాన్ని కోరుకోలేదు. అందుకే వారు ఎన్నో సాకులు చెప్పారు. చివరకు, యుద్ధానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని చెప్పినా, ఒక ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావిస్తూ, 'ఆ అంశానికి సంబంధించిన ఏర్పాట్లు ఇంకా పూర్తి కాలేదు' అని చెప్పారు. అంటే, మిగతా అన్నీ సిద్ధంగా ఉన్నప్పటికీ, ఒక చిన్న లోపం కారణంగా యుద్ధం చేయడం చాలా కష్టమని వారు వాదించారు." ఉదాహరణకు, వారు ఇలా చెప్పి ఉండవచ్చని మీరు అనుకోవచ్చు (బహుశా వారు నిజంగానే అదే చెప్పి ఉండవచ్చు): యూరప్‌లోని అన్ని శక్తివంతమైన దేశాలు గ్రీస్‌కు మద్దతుగా ఏకమయ్యాయి, వాటిని ఎదుర్కొనే సాధనాలు తమ వద్ద లేవని. ఈ సందర్భంలో హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తరచుగా చెప్పేవారు: మంత్రులు తమ సలహాలు ఇచ్చి, ఎదురయ్యే కష్టాలను వివరించి, "అమూల్యమైన ఏర్పాట్లు ఇంకా చేయబడలేదు" అని చెప్పినప్పుడు, సుల్తాన్ అబ్దుల్ హమీద్ ఇలా సమాధాన

మిచ్చేవారు: "దేవుని కోసం కూడా కొంత పనిని విడిచిపెట్టాలి." "సుల్తాన్ అబ్దుల్ హమీద్ చెప్పిన ఈ మాట హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంకు ఎంతో ప్రీతికరంగా ఉండేది. వారు (అ) తరచుగా ఈ వాక్యాన్ని ప్రస్తావిస్తూ, 'ఈ మాట నాకు ఎంతో ఇష్టం. ఎందుకంటే అది ఆయన తన సంపూర్ణ విశ్వాసాన్ని దేవునిపై ఉంచాడని తెలియజేస్తుంది' అని చెప్పేవారు."

(తఫ్సీర్-ఎ-కబీర్, భాగం 9, పుటలు 163--164)

దేవుని ఏకత్వం పట్ల హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంకు కలిగిన గౌరవాన్ని తెలియజేసే ఒక సంఘటనను హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి.) ఇలా వర్ణించారు: "కపూర్తలాకు చెందిన మున్షీ జఫర్ అహ్మద్ నాకు ఇలా వ్రాశారు:

" హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంకు తల తిరిగే వ్యాధి (వెర్టిగో) ఉండేది. ఆ వ్యాధికి ప్రత్యేక నైపుణ్యం కలిగిన ఒక వైద్యుడు ఉన్నాడని తెలిసింది. అందువల్ల అతనిని పిలిపించారు. దూర ప్రాంతం నుంచి రావలసి ఉండడంతో ప్రయాణ ఖర్చు కూడా పంపించారు. ఆ వైద్యుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను పరీక్షించిన తరువాత, 'నేను మీకు రెండు రోజుల్లో పూర్తిగా ఉ పశమనం కలిగిస్తాను' అని చెప్పాడు. (అంటే ఇది పెద్ద సమస్య కాదని, రెండు రోజుల్లో నయం చేస్తానని అన్నాడు.) "ఇది విన్న వెంటనే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం లోపలికి వెళ్లి మౌల్వీ నూరోద్దీన్ సాహిబ్ (రజి.)కు ఒక చీటి రాశారు. అందులో ఇలా ఉంది: 'ఈ వ్యక్తి వద్ద నుంచి నేను ఎలాంటి చికిత్స చేయించాలని కోరుకోవడం లేదు. ఇతడు తనను దేవుడని భావిస్తున్నాడా? అతనికి ప్రయాణ ఖర్చుతో పాటు అదనంగా ఇరవై ఐదు రూపాయలు ఇచ్చి తిరిగి పంపించండి. అనంతరం హుజూర్ (అ) ఆదేశించిన విధంగానే ఆ వైద్యుడిని తిరిగి పంపించారు."

(సీరతుల్ మహ్దీ, భాగం 2, పుట 38, కథనం 1038)

అదేవిధంగా, ముఫ్తీ మహమ్మద్ సాదిక్ సాహిబ్ (రజి.) హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి జీవితాన్ని గురించి వ్రాస్తూ, హుజూర్ (అ) తరచూ ఇలా చెప్పేవారని పేర్కొన్నారు: "దేవుని మహిమ మరియు గౌరవం పట్ల ఉత్సాహం కలిగిన వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు. అలాంటి వారు అత్యంత సన్నని మార్గంలో నడుస్తారు; ఆ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవలేరు. దేవుని పట్ల ఉత్సాహం లేకుండా ఎవరూ నిజమైన ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందలేరు. "ఒక వ్యక్తి హృదయంలో సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల వ్యక్తిగతమైన ఉత్సాహం ఉండే వరకు, అలాగే అహంకారం మరియు లోక సంబంధమైన లాభనష్టాల ఆలోచనల నుండి విముక్తి పొందే వరకు, అతని ఆరాధన గానీ, దానం గానీ అంగీకరించబడదు. (ఇది అత్యంత ముఖ్యమైన విషయం. అహంకారం మరియు ప్రాపంచిక ప్రయోజనాల కలుషిత ప్రభావం నుండి విముక్తి పొందకపోతే, ఎలాంటి ఆరాధన లేదా దానం కూడా అంగీకరించబడదు.)

"దేవుని పట్ల ఉత్సాహం కలిగిన వ్యక్తి తనలాంటి ఇతరులకన్నా ఉన్నత స్థానాన్ని పొందుతాడు. అలాంటి వారిపై దేవుడు తన ఆశీర్వాదాలను కురిపిస్తాడు." (జిక్ర్-ఎ-హబీబ్, పుట 182)

అందువల్ల, దుఆలు అంగీకరించబడాలంటే దేవుని ఏకత్వంపై సంపూర్ణ విశ్వాసం మరియు నిజమైన విశ్వాసం కలిగి ఉండటం కూడా అత్యంత అవసరం. ముందుగా అల్లాహ్ ప్రేమను పొందేందుకు ప్రార్థించాలి. "మేము ఎంతో ప్రార్థించాము, నఫిల్ నమాజులు చేశాము, దానం కూడా ఇచ్చాము; అయినప్పటికీ మా ప్రార్థనలు అంగీకరించబడలేదు" అని చెప్పేవారు ఈ విషయంపై లోతుగా ఆలోచించాలి. ఎందుకంటే ఇదే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బోధించిన విధానం.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి.), హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జీవితాన్ని వివరిస్తూ ఒక సందర్భంలో ఇలా వ్రాశారు: "దేవుడు కూడా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంపై చూపిన ఈ ప్రేమను, తన అపార కరుణకు మరియు సాటిలేని కృతజ్ఞతాభావానికి తగిన విధంగా గౌరవించి, మహిమ పరిచాడు." ఈ విధంగా అల్లాహ్ హుజూర్ (అ)ను ఉద్దేశించి ఇలా అన్నాడు: అన్త మిన్ని బి మన్జిలతి తౌహీదీ వ తఫ్రీదీ – అన్త మిన్ని బి మన్జిలతి వలదీ – ఇన్ని మ అకా యా ఇబ్నే రసూలుల్లాహి. …. అనువాదం: "అంటే, ఈ యుగంలో నీవు నా ఏకత్వం (తౌహీద్) యొక్క పతాకాన్ని మోసేవాడివి, ప్రపంచంలో కనుమరుగైన తౌహీద్ అనే అమూల్య నిధిని తిరిగి స్థాపిస్తున్నావు. అందువల్ల, ఓ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క మసీహా! నీవు నాకు నా ఏకత్వం, నా అద్వితీయత ఎంత ప్రియమో అంతే ప్రియమైనవాడివి. కాని క్రైస్తవులు అసత్యంగా, కల్పితంగా తమ మసీహాను దేవుని నిజమైన కుమారుడిగా ప్రకటించినందున, నా గౌరవం దీనిని కోరింది. నేను నిన్ను కుమారునికి తగిన ప్రేమతో ప్రేమించాలి. అప్పుడు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క ఒక అనుచరుడు కూడా 'దేవుని కుమారులలో' ఒకరిగా పిలువబడే ఆధ్యాత్మిక స్థాయిని పొందగలడని ప్రపంచానికి స్పష్టమవుతుంది. అలాగే, నీవు నా ప్రియమైన, ఎన్నుకోబడిన ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మసేవలో రాత్రింబవళ్లు నిమగ్నమై, ఆయన ప్రేమలో పూర్తిగా లీనమై ఉన్నావు. అందువల్ల, నా ప్రియుని ఆధ్యాత్మిక కుమారునిగా నేను నీకు నా శాశ్వత ప్రేమ యొక్క గుర్తును, నా నిరంతర సాంగత్యం అనే వరాన్ని ప్రసాదిస్తున్నాను."

(సీరత్-ఎ-తయ్యిబా, పుటలు 13--14)

నేను ఇప్పుడే ప్రస్తావించిన ఈ దివ్యవాణి, హజ్రత్ మసీహ్ మౌవూద్ఎం అలైహిస్సలాం వారికి అవతరించిన ప్రకటనకు ఇదే అర్థం.

అదేవిధంగా, హుజూర్ (అ) జీవితచరిత్రను వివరిస్తూ హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రదియల్లాహు అన్హు) ఇలా వ్రాసారు:

"హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి ఆగమనంలోని ప్రధాన ఉద్దేశ్యాలలో ఒకటి ఇస్లాం సేవ చేయడం మరియు తౌహీద్ (అల్లాహ్ యొక్క ఏకత్వం)ను స్థాపించడం. ఈ యుగంలో తౌహీద్‌కు అత్యంత తీవ్రమైన వ్యతిరేకత క్రైస్తవ మతం నుంచే వచ్చింది. (ఆ సమయంలో ఉన్న ఈ వ్యతిరేకత, నేటికీ కొన్ని ప్రాంతాలలో కొనసాగుతోంది.) ఎందుకంటే, తౌహీద్ పేరుతోనే వారు అత్యంత ప్రమాదకరమైన షిర్క్ (అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం)ను బోధిస్తూ, నవూజు బిల్లాహ్! ఏసు ను దేవుని కుమారుడిగా ప్రకటించి, ఏకైక దేవునితో సమాన స్థానంలో కూర్చోబెట్టారు. ఈ కారణంగానే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం క్రైస్తవ మతాన్ని ఖండించడంలో అపారమైన ఉత్సాహాన్ని ప్రదర్శించారు. అంతేకాక, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి హదీసుల ప్రకారం కూడా మసీహ్ యొక్క ప్రధాన కర్తవ్యం 'శిలువను విరగగొట్టడం'గా పేర్కొనబడింది. అందువల్ల, ఈసా (అ) మరణం అనే అంశంపై హుజూర్ (అ) ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించారు. ఎందుకంటే, ఈ ఒక్క విషయం రుజువైతే, క్రైస్తవ మతం యొక్క పునాది స్వయంగా కూలిపోతుంది. మసీహ్ మరణించారని అంగీకరించిన వెంటనే, ఆయనకు ఆపాదించిన దైవత్వం నిలబడదు; త్రిత్వ సిద్ధాంతం కూడా నిలవదు; అలాగే ప్రాయశ్చిత్తం అనే సిద్ధాంతం కూడా తన బలహీన పునాదులపై నిలిచి ఉండలేదు. నిజానికి, మసీహ్ మరణించారని విశ్వసించడం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి సత్యతను నిరూపించడానికి కూడా తొలి మెట్టుగా ఉపయోగ పడుతుంది. అయితే, హుజూర్ (అ) ఈ విషయాన్ని అంతగా నొక్కి చెప్పడానికి అసలు కారణం ఆధునిక క్రైస్తవ మతాన్ని ఖండించడం. హుజూర్ (అ)తరచుగా ఇలా చెప్పేవారు:

" మీరు మసీహ్ ని మరణించనివ్వండి; ఎందుకంటే ఆయన మరణంలోనే ఇస్లాం జీవితం ఉంది." (మన ముస్లిం సహోదరులు ఈ విషయాన్ని అర్థం చేసుకొని, కనీసం క్రైస్తవ మతానికి వ్యతిరేకంగా అయినా మనతో కలిసి నిలబడితే ఎంత బాగుంటుంది! వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి ప్రకటనలను అంగీకరించినా, తిరస్కరించినా అది వేరే విషయం. కానీ కనీసం ఇక్కడైనా, ఇస్లాం యొక్క శ్రేష్ఠత స్పష్టమయ్యే ఈ అంశంలో మనతో ఏకీభవించాలి.

"ఆ కాలంలో క్రైస్తవ మతంలోని అసత్య సిద్ధాంతాలు మరియు అవి ప్రపంచవ్యాప్తంగా వ్యాపించిన తీరు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి హృదయాన్ని ఎంతగా కలచి వేసిందంటే, ఒక సందర్భంలో హుజూర్ (అ) తీవ్రమైన వేదనతో ఇలా అన్నారు:

'క్రైస్తవులకూ మాకూ మధ్య ఒక తుది తీర్పు వెలువడాలని నేను నిరంతరం ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను. మరణించిన ఒక వ్యక్తిని ఆరాధించే ఈ దురాచారాన్ని చూసి నా హృదయం రక్తం కారుతోంది. నా ఆత్మ తీవ్ర వేదనలో ఉంది. నిస్సహాయుడైన ఒక మనిషిని దేవునిగా చేయడం, ఒక మానవుణ్ణి సమస్త లోకాల ప్రభువుగా భావించడం కంటే హృదయానికి మరింత బాధ కలిగించే విషయం ఇంకేముంటుంది? నా ప్రభువా!, సర్వశక్తిమంతుడైన నా దేవుడూ చివరకు తౌహీద్ విజయం సాధిస్తుందని నాకు ధైర్యం చెప్పకపోయి ఉంటే, ఈ దుఃఖంలో నేను ఎప్పుడో నశించి ఉండేవాడిని.'"

(సీరత్-ఎ-తయ్యిబా, పుటలు 106--108)

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు:

"ఈ విషయాన్ని గూర్చి సర్వశక్తిమంతుడైన అల్లాహ్ బాగా తెలుసు. ప్రతి విషయానికీ ఆయనే ఉత్తమ సాక్షి. ఆయన మార్గంలో నాకు మొదటిగా ప్రసాదించబడిన వరం ఒక సన్మార్గాన్ననుసరించే హృదయం. అంటే, గౌరవమూ మహిమల యజమానుడైన అల్లాహ్ తప్ప మరేదానిపైనా నిజమైన అనుబంధం లేని హృదయం. "నేను యౌవనంలో ఉన్నాను. ఇప్పుడు వృద్ధుడనయ్యాను. అయితే నా జీవితంలో ఏ సమయంలోనూ గౌరవమూ మహిమల యజమానుడైన అల్లాహ్ తప్ప మరెవరిపైనా నాకు నిజమైన అనుబంధం కలగలేదు."…." ఈ దైవప్రేమ యొక్క తీవ్రమైన తాపం కారణంగానే, అల్లాహ్ యొక్క మహిమకూ ఏకత్వానికీ విరుద్ధమైన సిద్ధాంతాలను బోధించే లేదా ఆయనకు ఏ విధమైన అవమానాన్ని ఆపాదించే ఏ మతాన్నీ నేను అంగీకరించలేక పోయాను. అందుకే క్రైస్తవ మతాన్ని నేను సమర్థించలేదు. ఎందుకంటే దాని ప్రతి అడుగులోనూ గౌరవమూ మహిమల యజమానుడైన అల్లాహ్‌కు అవమానం ఉంది. తనను తాను కూడా రక్షించుకోలేని ఒక వినయశీలుడైన మనిషిని దేవుడిగా ప్రకటించి, అతనినే ఆకాశాలకూ భూమికీ సృష్టికర్తగా భావించింది."

(హఖీఖతుల్ వహి రూహాని ఖజాయిన్ సంపుటి 22 పుటలు 59-60)

హజ్రత్ ముఫ్తీ ఫజ్లుర్రహ్మాన్ సాహిబ్ ముహాజిర్ (రజియల్లాహు అన్హు)

ఇలా వివరిస్తున్నారు: "నాకు వరుసగా ఇద్దరు కుమార్తెలు జన్మించారు. అల్లాహ్ కృప వల్ల నేను ఈ సంఘటనను వ్రాసిన సమయానికి వారు ఇద్దరూ సజీవంగా ఉన్నారు. తరువాత ఒక కుమారుడు జన్మించాడు. అయితే అతనికి వినికిడి లేదు, మాట కూడా రాదు. ఆ మొదటి కుమారుడు సాధారణంగా ఎప్పుడూ అనారోగ్యంగానే ఉండేవాడు. తరువాత మరో కుమారుడు జన్మించాడు. అతడు తెలివైనవాడు, ఆరోగ్యవంతుడు. "అతని అలవాట్లు, రూపం ఎంతో ఆకర్షణీయంగా ఉండేవి. చిన్న వయస్సులోనే ఇంటి పనులన్నీ చేసేవాడు. చిన్న సూచనతోనే విషయాలను అర్థం చేసుకునేవాడు. అతడు అసాధారణమైన తెలివి తేటలు కలిగిన బాలుడు. ఈ కారణాల వల్ల అతనిపై నా ప్రేమ ఎంతో పెరిగింది. "మొదటి కుమారుడు నాలుగు సంవత్సరాల వయస్సులో మరణించాడు. రెండవ కుమారుడు నాలుగున్నర సంవత్సరాల వయస్సుకు చేరుకున్నప్పుడు అతనికి తీవ్రమైన జ్వరం వచ్చింది. ఎన్నో చికిత్సలు చేయించి నప్పటికీ ఎలాంటి మెరుగుదల కనిపించలేదు. పదిహేను రోజుల తర్వాత అతనికి 'సర్‌సామ్' అనే వ్యాధి వచ్చింది. (ఇది మెదడు పొరలు వాచిపోయే మెనింజైటిస్‌కు సమానమైన ఒక వ్యాధి.) అప్పుడు నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారికి దుఆ చేయమని ఒక లేఖ రాశాను. ఈ బాలుడు నాకు ఎంతో ప్రియమైనవాడని, అతడు బ్రతికేలా ప్రార్థించాలని వేడుకున్నాను. అందుకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సమాధానంగా ఇలా వ్రాశారు: 'ఇన్‌షా అల్లాహ్, నేను ప్రార్థిస్తాను. అయితే ఈ విషయంలో అల్లాహ్ యొక్క తుది నిర్ణయం అమలులో ఉంటే, దానిని ఎవరూ మార్చలేరు.' "ఆ లేఖ చదివిన వెంటనే ఆ బాలుడు బ్రతకడని నాకు నిశ్చయమైంది. నాల్గవ రోజున అతని పరిస్థితి అత్యంత విషమమైంది. అదే రోజున హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గుర్దాస్‌పూర్ కోర్టుకు వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. నేను ప్రతిసారీ హుజూర్ (అ)తో వెళ్లేవాడిని. అందుకే ఆ రోజు కూడా హుజూర్ (అ)తో వెళ్లడానికి హాజరయ్యాను."హుజూర్ (అ) ఇంటి నుండి బయటకు వచ్చి ముందుగా నన్ను చూసి, 'నీ కుమారుడి పరిస్థితి ఎలా ఉంది?' అని అడిగారు. నేను, 'హుజూర్! దయచేసి వచ్చి అతనిని చూడండి' అని వినతి చేశాను. నా ఇల్లు సమీపంలోనే ఉంది; బాలుడి పరిస్థితి చాలా విషమంగా ఉంది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇంటికి వచ్చి బాలుణ్ని చూసి, 'అతడు చాలా తీవ్రమైన అనారోగ్యంలో ఉన్నాడు. ఈ రోజు నువ్వు గుర్దాస్‌పూర్‌కు రావద్దు' అని చెప్పారు. అనంతరం హుజూర్ (అ) తన ప్రయాణాన్ని కొనసాగించారు. "మరుసటి రోజు సుమారు నాలుగు గంటల సమయంలో నా కుమారుడు మరణించాడు. ఆ తరువాతి రోజు ఉదయం పది గంటల సమయంలో హుజూర్ (అలైహిస్సలాం) గుర్దాస్‌పూర్ నుండి తిరిగి వచ్చారు. ఈ వార్త విని నేను హుజూర్ (అ)కు స్వాగతం పలకడానికి వెళ్లాను. నా చేతుల్లో ఆ బాలుడికంటే చిన్న వయస్సున్న నా కుమార్తె ఉంది. "నన్ను చూసి హుజూర్ (అ) ఇలా అన్నారు: 'నీ కుమారుడు మరణించినందుకు నాకు ఎంతో బాధగా ఉంది. అయితే అతనిపట్ల నీ ప్రేమ అల్లాహ్‌తో ఇతరులను భాగస్వాములుగా చేయడం (షిర్క్) అనే స్థాయికి చేరుకుందని నాకు అనిపించింది. అందువల్ల అతడు బ్రతికి ఉండడం సాధ్యం కాలేదు. అయినప్పటికీ నేను అతని కోసం ఎంతో ప్రార్థించాను. అల్లాహ్ నీకు అతని స్థానంలో మరొక కుమారుణ్ని ప్రసాదిస్తాడు. అతడు వినగలడు, మాట్లాడగలడు.' "తరువాత ఫజల్ కరీమ్ అనే కుమారుడు జన్మించాడు. ఆ తరువాత అబ్దుల్ హఫీజ్ జన్మించాడు. తరువాత వరుసగా ఇద్దరు గర్భస్రావాలు జరిగాయి; ఇద్దరూ మగ శిశువులే. ఆ తరువాత ముహమ్మద్ అబ్దుల్లా, అబ్దుల్ కరీమ్ జన్మించారు. వారిని అనుసరించి అహ్మద్ జన్మించాడు. అల్లాహ్ కృపవల్ల ఈ ఐదుగురు కుమారులు ఈ రోజు వరకు సజీవంగా ఉన్నారు." వారు దీర్ఘాయుష్షుతో జీవించారు. ఈ విధంగా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) తన సహచరులకు నిరంతరం అల్లాహ్ యొక్క ఏకత్వాన్ని బోధించేవారు. అదే సమయంలో వారిని ఓదార్చేందుకు ప్రార్థించేవారు. అల్లాహ్ హుజూర్ (అ) ప్రార్థనలను స్వీకరించి, ఆ వ్యక్తికి ఐదుగురు కుమారులను కూడా ప్రసాదించాడు.

**(ఖుద్రతుల్లాహ్ సన్నూరీ (రజియల్లాహు అన్హు), సీరత్-ఎ-అహ్మద్, పుటలు 168--170)**

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు:

"యూరప్‌లోనైనా, ఆసియాలోనైనా, ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తూ సద్గుణ స్వభావం కలిగిన వారందరినీ సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన ఏకత్వం (తౌహీద్) వైపు ఆకర్షించి, తన సేవకులందరినీ ఒకే విశ్వాసం క్రింద ఏకం చేయాలని కోరుతున్నాడు. ఇందుకోసమే నన్ను ఈ లోకానికి పంపించాడు. కాబట్టి మీరు కూడా ఇదే లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేయండి; అయితే దయతో, ఉన్నత నైతికతతో మరియు హృదయపూర్వక ప్రార్థనలతో."

(అల్ వసియ్యత్, రూహానీ ఖజాయిన్ సంపుటి 20, పేజి 306-307)

ఆ తరువాత హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు:

"సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ఏకత్వాన్ని ప్రపంచమంతటా స్థాపించడం మరియు దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి గౌరవాన్ని ప్రపంచ వ్యాప్తంగా స్థాపించడం. ఇదే నా సంపూర్ణ సంతృప్తి, ఇదే నా అవతరణ యొక్క నిజమైన ఉద్దేశ్యం."

(మల్ఫూజాత్ సంపుటి 3, పేజి 85, ప్రచురణ 2022)

హజ్రత్ పీర్ ఇఫ్తిఖార్ అహ్మద్ సాహిబ్ (రదియల్లాహు అన్హు), హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి జీవితాన్ని వివరిస్తూ ఇలా పేర్కొన్నారు:

"హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి సహాయకులలో ఒకరి పేరు 'పీరాన్ దిత్తా' (అంటే పీర్లచే ప్రసాదించబడినవాడు) అని ఉండేది. మేమంతా ఆయనను ఆ పేరుతోనే పిలిచేవాళ్లం. అయితే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మాత్రం ఆయనను 'పీరీ దిత్తా' అని పిలిచేవారు. అంటే, 'నా పీర్ అయిన అల్లాహ్ ప్రసాదించిన బహుమతి' అనే అర్థం.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారికి బోధించిన తౌహీద్ (దైవ ఏకత్వం) ఇదే. అల్లాహ్ తాలా ఇలా తెలిపాడు.

ఖుజిత్తౌహీద అత్తౌహీద యా అబ్నా అల్ ఫారసి! అనగా

'ఓ పారసీకుల సంతానమా! అల్లాహ్ యొక్క ఏకత్వాన్ని గట్టిగా పట్టుకోండి.'

(ఇఫ్తిఖారుల్ హఖ్ యా ఇనాఆమాతే ఖుదా వంది, పేజీ. 229)

కాబట్టి, ఈ దైవ ప్రత్యక్ష వాక్యాన్ని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి సంతానం, వారి ప్రతి అనుచరుడు మరియు బైఅత్ చేసిన ప్రతి వ్యక్తి ఎల్లప్పుడూ తమ దృష్టిలో ఉంచుకోవాలి. ఎందుకంటే వారి నిరంతర విజయం మరియు ఆధ్యాత్మిక పురోగతి దీనిపైనే ఆధారపడి ఉంది. హుజూర్ (అ) బైఅత్ చేసిన వారందరూ హుజూర్ (అ) "అబ్నా" (సంతానం)లో భాగమయ్యారు, అంటే వారి ఆధ్యాత్మిక వంశానికి చెందిన వారయ్యారు. వారు అల్లాహ్ యొక్క ఏకత్వాన్ని దృఢంగా పట్టుకుంటే, ధర్మంలోనూ, ప్రాపంచిక జీవితంలోనూ గౌరవాన్ని పొందుతారు. లేకపోతే రక్త సంబంధం వల్ల గానీ, కేవలం బైఅత్ చేసినంత మాత్రాన గానీ ఎలాంటి ప్రయోజనం కలగదు.

హాఫిజ్ ముహమ్మద్ ఇబ్రాహీమ్ సాహిబ్ (రదియల్లాహు అన్హు) ఇలా వివరిస్తున్నారు:

"నేను హకీమ్ అబ్దుల్ అజీజ్ సాహిబ్ మరియు హకీమ్ అతా ముహమ్మద్ సాహిబ్‌తో కలిసి మొదటిసారి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి పవిత్ర సన్నిధిలో హాజరైనప్పుడు, వారు గుర్దాస్‌పూర్‌లో నివసిస్తున్నారు. హుజూర్ (అ) గది నుండి బయటకు రాబోతుండగా మేము ముగ్గురం తలుపు దగ్గర నిలబడి ఉన్నాం. నేను మరియు హకీమ్ అబ్దుల్ అజీజ్ సాహిబ్ 'అస్సలాము అలైకుం' అని పలికి వారితో కరచాలనం చేశాము. కానీ అతా ముహమ్మద్ సాహిబ్ మాత్రం వారి పాదాలపై వంగిపోయారు. వెంటనే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆయనను చేతులతో పైకి లేపి, 'సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నన్ను ఈ యుగంలో ఇలాంటి షిర్క్ (దైవానికి భాగస్వాములను కల్పించే ఆచారాలను)ను నిర్మూలించడానికే పంపించాడు. పాదాలను ముద్దు పెట్టుకోవడం కూడా షిర్క్‌లో భాగమే' అని అన్నారు. అనంతరం హుజూర్ (అ) ఆయనతో కూడా కరచాలనం చేశారు."

(రివాయాతే అస్‌హాబే అహ్మద్ సంపుటి 2, పేజీ 172)

అదేవిధంగా, హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రదియల్లాహు అన్హు) ఇలా వివరిస్తున్నారు:

"పెషావర్‌కు చెందిన ఖాజీ ముహమ్మద్ యూసుఫ్ సాహిబ్ నాకు ఒక లేఖ ద్వారా ఇలా తెలియజేశారు: 'నేను మొదటిసారి ఖాదియాన్‌కు వెళ్లినప్పుడు, ఒక వ్యక్తి తన కుమారుడిని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారిని కలవడానికి తీసుకొచ్చాడు. ఆ బాలుడు కరచాలనం చేయడానికి ముందుకు వచ్చి, గౌరవ సూచకంగా వారి పాదాలను తాకడానికి ప్రయత్నించాడు. వెంటనే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తమ పవిత్ర చేతులతో అతనిని అడ్డుకున్నారు. హుజూర్ (అ) ముఖం ఎర్రబడింది. ఎంతో ఉద్వేగంతో వారు ఇలా అన్నారు:

"ప్రవక్తలు ఈ లోకానికి షిర్క్‌ను నిర్మూలించడానికి వస్తారు. నా బాధ్యత కూడా దానిని నిర్మూలించడమే గాని, దానిని స్థాపించడం కాదు."'

(సీరతుల్ మహ్దీ సంపుటి 1, కథనము 319, పేజీ 295)

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు:

"నా ఫోటోను ఎవరైనా తీయడం నాకు అత్యంత అభ్యంతరకరం."

ఫోటోగ్రాఫ్‌లకు సంబంధించిన విషయాన్ని కూడా ఇది స్పష్టం చేస్తుంది. చాలామంది తమ స్వంత ఫోటోలు, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి ఫోటోలు, అలాగే తమ బంధువులు, ప్రియమైన వారి ఫోటోలను తగని విధంగా ఉంచుకుంటున్నారు. అందుకే నేను ఈ విషయాన్ని ప్రస్తావిస్తున్నాను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు:

"నా ఫోటోను ఎవరైనా తీసి, విగ్రహారాధకులు విగ్రహాలను ఉంచుకున్నట్లుగా తమ వద్ద ఉంచుకోవడం గానీ, ప్రచురించడం గానీ నాకు అత్యంత అభ్యంతరకరం. ఇలాంటి పని ఎవరైనా చేయాలని నేను ఎప్పుడూ ఎలాంటి ఆదేశం ఇవ్వలేదు. విగ్రహారాధనను, చిత్రారాధనను నాకన్నా ఎక్కువగా వ్యతిరేకించే వ్యక్తి మరొకరు ఉండరు. కాని యూరప్ ప్రజలు ఎవరి పుస్తకాన్ని చదవాలనుకున్నా, ముందుగా ఆ రచయిత యొక్క చిత్రాన్ని చూడాలని కోరుకుంటారని నేను గమనించాను. ఎందుకంటే అక్కడ ముఖలక్షణ శాస్త్రం చాలా అభివృద్ధి చెందింది. వారు కేవలం చిత్రాన్ని చూసి ఆ వ్యక్తి సత్యవంతుడా? లేక అసత్యవాదా? అని చాలావరకు అంచనా వేయగలరని

నమ్ముతారు. వేలాది మైళ్ల దూరంలో ఉన్న వారు నా వద్దకు రాలేరు, నా ముఖాన్ని ప్రత్యక్షంగా చూడలేరు. అందువల్ల ఆ దేశంలోని వివేకవంతులు నా చిత్రాన్ని చూసి నా అంతర్గత స్థితిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. యూరప్, అమెరికా దేశాల నుండి చాలామంది నాకు లేఖలు రాశారు. వారు తమ లేఖల్లో, నా చిత్రాన్ని జాగ్రత్తగా పరిశీలించి, ముఖలక్షణ శాస్త్రం ఆధారంగా అది అసత్యవాది యొక్క చిత్రం కాదని ఒప్పుకోవలసి వచ్చిందని పేర్కొన్నారు. ఒక అమెరికన్ మహిళ నా చిత్రాన్ని చూసిన తరువాత (ఆమె ఈ విషయాన్ని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారికి లేఖలో రాసింది), 'ఇది యేసు, అంటే ఈసా (అలైహిస్సలాం) వారి చిత్రంలా ఉంది' అని చెప్పింది. ఈ కారణం వల్లనే, ఈ ఆచారం ప్రారంభ మైనప్పుడు నేను ఉద్దేశపూర్వకంగా మౌనం పాటించాను. (అందుకే హుజూర్ (అ) ఫోటోగ్రఫీని అనుమతించారు. కానీ దీని వల్ల విగ్రహారాధన వ్యాపిస్తే, అది పూర్తిగా నిషేధించబడుతుంది.)

మరల ఇలా తెలిపారు: ఇన్నమాఅల్ ఆమాలు బిన్నియాత్ అనగా "కార్యాలు వాటి ఉద్దేశాల ఆధారంగానే తీర్పు చేయబడతాయి." ''అలాగే, చిత్రాలను తీయడం పూర్తిగా నిషేధించ బడిందని నేను నమ్మను. (హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఫోటోలు తీయడం హరామ్ అని చెప్పడం లేదు.) పవిత్ర ఖుర్ఆన్ ప్రకారం, హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) కోసం జిన్నులలోని ఒక వర్గం చిత్రాలను తయారు చేసేది. ఇస్రాయేలీయుల వద్ద చాలా కాలం పాటు ప్రవక్తల చిత్రాలు ఉండేవి. అందులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి చిత్రం కూడా ఉండేది.అలాగే, జిబ్రాయీల్ (అలైహిస్సలాం) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారికి పట్టుచీరపై హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) వారి చిత్రాన్ని చూపించారు. అలాగే, నీటి అడుగున ఉండే కొన్ని రాళ్లపై జంతువుల చిత్రాలు సహజంగానే ముద్రించ బడతాయి. (పర్వత ప్రాంతాల్లో లేదా భూకంపాల కారణంగా భూమిలో పాతిపెట్టబడిన జంతువుల ఆకృతులు రాళ్లలో శిలాజాలుగా కనిపిస్తాయి.) అంతేగాకుండా, నేటి ఫోటోగ్రాఫ్‌లు తీసే పరికరం (కెమెరా) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలంలో లేదు. కొన్ని వ్యాధులను నిర్ధారించడానికి ఇది ఎంతో ఉపయోగకరమైన సాధనం. (ఇది కేవలం ఫోటోల విషయమే కాదు. చిత్రీకరణ ద్వారా వ్యాధులను గుర్తించవచ్చని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పేర్కొన్నారు. నేడు ఈ శాస్త్రం మరింత అభివృద్ధి చెందింది. ఆ కాలంలో హుజూర్ (అ) ప్రధానంగా ఎక్స్-రేను సూచించారు. మరల ఇలా తెలిపారు: " మరొక పరికరం కూడా కనిపెట్టబడింది. దాని ద్వారా మనిషి శరీరంలోని అన్ని ఎముకల చిత్రాలు (ఎక్స్-రే) తీసి, వాతవ్యాధి , గౌట్ వంటి వ్యాధులను గుర్తించడానికి, అలాగే వ్యాధి స్వరూపాన్ని నిర్ణయించడానికి ఉపయోగిస్తారు." నేడు మనకు స్కానింగ్, ఎంఆర్ఐ మరియు అనేక ఇతర సాంకేతిక పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తమ కాలంలో అందుబాటులో ఉన్న సాంకేతికతను ప్రస్తావించారు. చిత్రీకరణ సాంకేతికతను పూర్తిగా నిషేధించడం సరైంది కాదని, ఎందుకంటే అది ఎంతో ప్రయోజనకరమని హుజూర్ (అ) వివరించారు. దాని వినియోగం ధర్మబద్ధమైన ఉద్దేశంతో ఉండాలి. ఇన్నమాఅల్ ఆమాలు బిన్నియాత్ అనగా ఉద్దేశం పవిత్రంగా ఉంటే అది అనుమతించబడుతుంది. అయితే అది విగ్రహారాధనకు దారితీయకూడదు." మరల ఇలా తెలిపారు. " అదేవిధంగా, ఫోటోగ్రాఫ్‌ల ద్వారా అనేక శాస్త్రీయ ప్రయోజనాలు లభించాయి (సాధారణ ఫోటోల ద్వారా కూడా ప్రయోజనాలు కలిగాయి). కొంతమంది యూరోపియన్లు తమ పుస్తకాలలో తెలిసిన అన్ని జీవుల చిత్రాలను, అనేక రకాల కీటకాలు, వివిధ రకాల పక్షులు, జంతువులు మొదలైన వాటి చిత్రాలను, ప్రచురించారు. దీని ద్వారా జ్ఞానం విస్తరించింది." నేడు నేషనల్ జియోగ్రాఫిక్ వంటి అనేక ఛానెల్లు జంతువుల చిత్రాల ద్వారా వాటి గురించి విపులమైన సమాచారాన్ని అందిస్తున్నాయి." మరల ఇలా తెలిపారు: "జ్ఞానాన్ని సంపాదించమని ప్రోత్సహించే దేవుడు, క్లిష్టమైన వ్యాధులను గుర్తించడానికి సహాయపడే, వివేక వంతులకు సత్యమార్గాన్ని తెలుసుకోవడానికి తోడ్పడే ఒక సాధనాన్ని నిషేధిస్తాడని ఊహించగలమా? ఇవన్నీ ప్రజల్లో వ్యాపించిన అర్థరహితమైన భావనలు మాత్రమే." ఫోటో తీయడం వంటి ఇలాంటి విషయాలను అనుమతించరానివిగా లేదా చట్ట విరుద్ధ మైనవిగా పరిగణించడం తప్పు. మీ ఉద్దేశ్యం నిర్మలంగా ఉండాలి. " మరల ఇలా తెలిపారు: ""మన దేశంలోని మౌల్వీలు (మతపండితులు) తమ జేబుల్లో, ఇళ్లలో ఉన్న రాజు ముఖచిత్రం ముద్రించబడిన నాణేలు, రూపాయలు, రెండు అన్నాలు, నాలుగు అన్నాలు, ఎనిమిది అన్నాల నాణేలను ఎందుకు పారేయరు? (చిత్రాలను పూర్తిగా నిషేధించే వారైతే, రాజుల చిత్రాలు ముద్రించబడిన నాణేలు, నోట్లను ఎందుకు ఉపయోగిస్తున్నారు? వాటిని ఎందుకు జేబులో ఉంచుకుంటున్నారు?) ఆ నాణేలపై కూడా చిత్రాలే కదా ఉన్నాయి?. వారు ఆలోచించకుండా ఇలాంటి అసంగతమైన మాటలు మాట్లాడడం వల్ల ఇస్లాం ప్రత్యర్థులకు ఇస్లాంను ఎగతాళి చేసే అవకాశాన్ని ఇస్తున్నారు. ఇస్లాం నిషేధించినవి వ్యర్థమైన పనులు, విగ్రహారాధనకు దారితీసే చర్యలు మాత్రమే. కానీ మానవ జ్ఞానాన్ని పెంపొందించే, వ్యాధులను గుర్తించడంలో సహాయపడే, వివేకవంతులను సన్మార్గానికి దగ్గర చేసే కార్యాలను ఇస్లాం నిషేధించలేదు. అయితే, ఈ విషయాలన్నింటి మధ్య కూడా, అత్యవసరమైన అవసరం లేకుండా నా జమాఅత్‌కు చెందినవారు నా ఫోటోలను ముద్రించడం లేదా ప్రచురించడం తమ వృత్తిగా చేసుకోవడం నాకు అస్సలు ఇష్టం లేదు (ధార్మిక ప్రయోజనం కోసం, ఆదాయం సంపాదించడానికి కాకుండా చేస్తే అది వేరే విషయం). ఎందుకంటే ఇలాంటి ఆచారాలే క్రమంగా కొత్త సంప్రదాయాలుగా (బిద్అత్) మారి చివరికి విగ్రహారాధనకు దారి తీస్తాయి. అందువల్ల, నా జమాఅత్ సభ్యులు వీలైనంత వరకు ఇలాంటి పనులకు దూరంగా ఉండాలని నేను వారికి మళ్లీ హెచ్చరిస్తున్నాను.

కొంతమంది తమ కార్డుల వెనుక భాగంలో ఒక మూలలో నా చిత్రాన్ని ముద్రించినట్లు నేను చూశాను. నేను అలాంటి ప్రచురణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాను. నా జమాఅత్‌లో ఎవరూ అలాంటి పని చేయకూడదని నేను కోరుకుంటున్నాను. ఉపయోగ కరమైన, చట్టబద్ధమైన అవసరం కోసం ఒక పని చేయడం ఒక విషయం; కానీ హిందువుల మాదిరిగా తమ పెద్దల చిత్రాలను గోడలపై వేలాడదీయడం మరో విషయం. ఇలాంటి వ్యర్థమైన ఆచారాలు చివరికి విగ్రహారాధనకు, అలాగే హిందువులు, క్రైస్తవులలో ఏర్పడినట్లే తీవ్రమైన తప్పిదాలకు దారి తీస్తాయని ఎప్పటి నుంచో గమనించబడింది. నా ఈ హెచ్చరికలను గౌరవంగా స్వీకరించి, నిజంగా నా అనుచరుడిగా ఉండే ప్రతి వ్యక్తి ఇకపై ఇలాంటి పనులను మానేస్తాడని నేను ఆశిస్తున్నాను. లేకపోతే, అతడు నా ఆదేశాలకు విరుద్ధంగా ప్రవర్తించినవాడిగా, షరీఅత్‌లో అహంకారంతో జోక్యం చేసుకున్నవాడిగా పరిగణించబడతాడు."

(బరాహీన్-ఎ-అహ్మదియ్యా, భాగం 5, పుటలు 490-492)

అందువల్ల, మనం చిత్రాలను ప్రదర్శించే ఉద్దేశ్యం ఏమిటో చాలా జాగ్రత్తగా పరిశీలించాలి. అది ఎట్టి పరిస్థితుల్లోనూ షిర్క్ (అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం) వైపు దారి తీయకూడదు. చిత్రాలకు సెల్యూట్ చేయడం, వాటి ముందు నమస్కరించడం వంటి చర్యలన్నీ బహుదైవారాధన నుంచి వచ్చిన ఆచారాలే. హిందువులలో మరణించిన వారి చిత్రాలను ఉంచి వాటికి పూలమాలలు వేయడం ఒక సాధారణ ఆచారం. కొన్ని సందర్భాల్లో, మన సమాజంలో కూడా కుటుంబ సభ్యులు కలిసి ఫోటో దిగేటప్పుడు, మరణించిన పెద్దవారి పెద్ద ఫ్రేమ్ చేసిన చిత్రాన్ని తమతో పాటు ఉంచి, వారు కూడా ఆ ఫోటోలో ఉన్నట్లుగా చూపించడం ఆనవాయితీగా మారింది. హుజూర్ (అ) చెప్పినట్లుగా, ఇటువంటి ఆచారాలు షిర్క్‌కు దారితీసే కొత్త సంప్రదాయాలు (బిద్అత్) కాబట్టి వాటిని నివారించాలి. నాకు అందిన నివేదికల ప్రకారం, కొందరు వివాహ వేడుకల్లో కూడా ఇలాంటి చిత్రాలను ఉపయోగిస్తున్నారు.

మంచి ఉద్దేశ్యం కోసం లేదా జ్ఞాపకార్థంగా ఆల్బమ్‌లలో ఉంచేందుకు చిత్రాలు తీసుకోవడం అనుమతించబడుతుంది. కానీ వాటిని ఆరాధనకు సమానంగా గౌరవించడం, ఉదాహరణకు నిద్రలేచిన వెంటనే వాటికి నమస్కరించడం వంటి చర్యలు తప్పని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం స్పష్టం చేశారు.

హజ్రత్ సూఫీ గులాం ముహమ్మద్ సాహిబ్ (రజి) ఇలా వివరించారు:

"అమెరికా, ఇంగ్లాండ్‌లలోని కొందరు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఫోటోను చూడాలని కోరుకున్నారు. ఆ కారణంగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి ఒక ఫోటో తీయబడింది. అబ్దుల్ ముహ్యీ అనే ఒక అరబ్ ఉండేవాడు. అతడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఫోటోతో అనేక పోస్టుకార్డులను ముద్రించాడు. ఈ విషయం తెలిసిన వెంటనే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చాలా అసంతృప్తి వ్యక్తం చేసి, 'నేను నా ఫోటోను ఒక ధార్మిక అవసరం కోసం మాత్రమే తీయించుకున్నాను. నా ఫోటోను జీవనోపాధి సాధనంగా గానీ, షిర్క్‌కు దారి తీసే విధంగా గానీ ఉపయోగించడం నాకు ఆమోదయోగ్యం కాదు' అని అన్నారు. అనంతరం ఆ పోస్టుకార్డులన్నీ నాశనం చేయబడ్డాయి."

(రివాయత్ అసాబ్-ఎ-అహ్మద్, సంపుటి 3, పుట 408)

హజ్రత్ మౌలానా గులాం రసూల్ రాజేకీ సాహిబ్ (రజి) ఇలా వివరించారు:

"నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చేతిపై బైఅత్ చేసినప్పుడు, ఇంతకు ముందు నేను కొన్ని ఆధ్యాత్మిక సాధనలు చేసేవాడినని, అలాగే నా పూర్వ ఆధ్యాత్మిక గురువుల వద్ద శిష్యులు తమ గురువుల రూపాన్ని మనస్సులో ఊహిస్తూ ధ్యానం చేయాలని బోధించబడేదని నేను లేఖలో పేర్కొన్నాను. అప్పుడు నేను ఇలా ఆలోచించాను. చిన్న స్థాయి ఆధ్యాత్మిక నాయకుల అనుచరులు వారి రూపాన్ని ధ్యానిస్తే, నా స్వంత ఆధ్యాత్మిక గురువైన హజ్రత్ మసీహ్ మరియు మహ్దీ (అలైహిస్సలాం) యొక్క రూపాన్ని నేను ఎందుకు ధ్యానించకూడదు? (అంటే, వారి రూపాన్ని హృదయంలో నిలుపుకొని, ఆ ధ్యానం ద్వారా ఆధ్యాత్మిక ప్రయోజనాలను పొందాలని ఆయన భావించారు.) హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి రూపం ఇతర ఆధ్యాత్మిక గురువుల కంటే ఎంతో పవిత్రమైనది, ఉన్నతమైనది, ప్రభావవంతమైనది." మౌలానా గులాం రసూల్ రాజేకీ (ర.అ.) భావించినది ఏమిటంటే, తాను అనుసరిస్తున్నది నిజమైన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను. అయితే ఇతర ఆధ్యాత్మిక నాయకులు నిజంగా సత్యమార్గంలో ఉన్నారో లేదో కూడా తెలియదు. అయినప్పటికీ, వారి అనుచరులు తమ గురువులను మనస్సులో ధ్యానిస్తుంటే, తాను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి రూపాన్ని ఎల్లప్పుడూ తన హృదయంలో, మనస్సులో నిలుపుకోవడంలో తప్పేముందని

ప్రశ్నించారు. రాజేకీ సాహిబ్ (ర.అ.) ఇలా పేర్కొన్నారు: "నేను ఈ ఉత్తరాన్ని హజ్రత్ మిర్జా గులామ్ అహ్మద్ వారికి రాసినప్పుడు, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తరఫున హజ్రత్ మౌల్వీ అబ్దుల్ కరీమ్ సాహిబ్ వారి చేతిరాతలో నాకు ఒక ప్రత్యుత్తరం వచ్చింది. అందులో ఇలా వ్రాయబడింది: 'ఏ సృష్టించబడిన వస్తువు లేదా వ్యక్తి గురించిన ధ్యానం చివరికి షిర్క్ (దేవునికి భాగస్వాములను కల్పించడం) తప్ప మరేమీ కలిగించదు. (అటువంటి ధ్యానం ఫలితంగా షిర్క్ భావన పెరుగుతుంది.) సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నామమే ఆయనను స్మరించడానికి సరిపోతుంది. దురూద్ షరీఫ్ విషయానికి వస్తే, దైవ ప్రవక్త (స.అ.వ.) పఠించినదానినే చదవాలి.'

"ఈ ఉత్తరం అందుకున్న వెంటనే నేను ఆ ధ్యాన విధానాన్ని పూర్తిగా విడిచిపెట్టి, ఇంతకుముందు చేస్తున్న నా భక్తి సాధనలను వెంటనే నిలిపివేశాను."

(రివాయాత్ అషాబ్-ఎ-అహ్మద్, పుటలు 329--330)

హజ్రత్ మాస్టర్ సయ్యద్ నజీర్ అహ్మద్ సాహిబ్ (రజి) ఇలా వివరిస్తున్నారు:

"ఖాదియాన్‌కు వలస వచ్చిన దివంగత సయ్యద్ ఫజల్ షా సాహిబ్ ఒకసారి నాతో ఇలా అన్నారు: 'ఒక సందర్భంలో ఎవరో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారిని కిమ్యాగిరి గురించి అడిగారు. దానికి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా సమాధానమిచ్చారు: "కిమ్యాగిరిలు జీవనోపాధి కోసం ఆందోళనగా అటూ ఇటూ తిరుగుతుంటారు. అయితే జీవనోపాధిని పొందేందుకు అల్లాహ్ నిర్దేశించిన సరైన మార్గాలను వారు అనుసరించరు. వారు తవక్కుల్ (దేవునిపై సంపూర్ణ విశ్వాసం) అనే స్థాయికి దూరమై ఉంటారు. అందువల్ల సరైన, ధర్మబద్ధమైన మార్గాలను వదిలి తమకంటూ కొత్త మార్గాలను సృష్టించుకుంటారు. కానీ దేవుడు ఇలా ప్రకటిస్తున్నాడని వారు గ్రహించరు: ఫిస్సమాఇ రిజ్‌ఖుకుం వమా తుఅదూన్ (జారియాత్ :23) అనగా "మీ జీవనోపాధి ఆకాశంలోనే ఉంది; మీకు వాగ్దానం చేయబడినదీ అక్కడే ఉంది." "ఇలాంటి దురదృష్టవంతులను మేము అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించే వారిలో అత్యంత పెద్దవారిగా భావిస్తాము. తన పవిత్ర వాక్యంలో దేవుడు నిజమైన విశ్వాసికి ఒక నిజమైన 'కిమ్యాగిరి సూత్రం'ను ప్రసాదించాడు. ఆయన వాగ్దానం చేసినట్లుగా జీవనోపాధిని ఆకాశం నుండి అనుగ్రహిస్తాడు. అయితే అది ఆయనవైపు పూర్తిగా మొగ్గు చూపిన వారికి మాత్రమే లభిస్తుంది. మరల ఇలా అన్నారు: 'దేవుడు విశ్వాసికి ఒక అద్భుతమైన కిమ్యాగిరి సూత్రాన్ని బోధిస్తాడు. దానిని ఆచరించినవాడు నిజమైన కిమ్యాగిరి అవుతాడు. అప్పుడు దేవుడే అతని అన్ని అవసరాలను తీర్చుతాడు. అందుకే అల్లాహ్ ఇలా అంటున్నాడు: వమన్ యత్తఖిల్లాహ యజ్‌అల్లహు మఖ్‌రజన్ వ య్యర్‌జుఖ్‌హు మిన్ హైసూ లా యహతసిబు (త్తలాఖ్: 2-3) అనగా "ఎవడు అల్లాహ్‌కు భయభక్తులు కలిగి ఉంటాడో, అతనికి ఆయన ఒక మార్గాన్ని కల్పిస్తాడు; అతను ఊహించని చోటు నుండి అతనికి జీవనోపాధిని ప్రసాదిస్తాడు. ఒక నీతిమంతుడికి సమస్త లోకాల వరాలు ప్రసాదించబడినప్పుడు, అతను మరెవరి మీద ఆధారపడవలసిన అవసరం ఏముంటుంది? (ధర్మాన్ని అవలంబించిన వ్యక్తికి అల్లాహ్ ఊహించలేని మార్గాలను సృష్టించి, ఊహించని చోట్ల నుండి జీవనోపాధిని ప్రసాదిస్తాడు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) చెబుతున్నదేమిటంటే, ఒక వ్యక్తికి సమస్త ప్రపంచ సంపద లభించినప్పుడు, అతను ఇంకెవరి మీద ఆధారపడతాడు?) నేను చెబుతున్నాను. కిమ్యా గిరిలు కిమ్యా గిరిత్వంలో వృథా చేసే సమయాన్ని తమ సృష్టికర్త సేవలో వెచ్చిస్తే, వారు నీతిమార్గంలో స్థిరంగా నిలిచినట్లయితే తమ హృదయ పూర్వక కోరికలన్నింటినీ పొందగలరు."

(రివాయాత్ అషాబ్-ఎ-అహ్మద్, భాగం 3, పుట 179)

దైవ ఏకత్వం (తౌహీద్) గురించిన బోధన మరియు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి వ్యక్తిగత ఆదర్శం నిర్మల హృదయులపై ఎలా ప్రభావం చూపిందో వివరిస్తూ, హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి) ఒక సంఘటనను ఇలా పేర్కొన్నారు:

"కాశ్మీర్‌లోని బారాముల్లాకు చెందిన రేంజ్ ఆఫీసర్ మీర్ అబ్దుర్ రహ్మాన్ సాహిబ్ నాకు ఇలా వ్రాశారు: 'మొదట నా తండ్రి హనఫీ మతపద్ధతిని అనుసరించే వారు. తరువాత అహ్‌లే-హదీస్ సిద్ధాంతాన్ని స్వీకరించారు. ఆ కాలంలో ఆయన తరచూ తన మిత్రుడు, అస్నోర్‌కు చెందిన దివంగత మౌల్వీ ముహమ్మద్ హసన్ సాహిబ్‌తో ఇలా చెప్పేవారు: "మనము దృఢమైన ఏకదైవవాదులమని చెప్పుకుంటు న్నాము. కానీ ఒకరోజు మరొక సమాజం వచ్చి, మనల్ని కూడా బహుదైవా రాధకులమని (ముష్రికులమని) ప్రకటించే అవకాశం ఉంది." నా తండ్రిగారు ఇలా చెప్పేవారు: "అదే నిజంగా జరిగింది. ఎందుకంటే మేము యేసు (అలైహిస్సలాం) మృతులకు ప్రాణం పోశారని, పక్షులను సృష్టించారని నమ్మేవాళ్లం. కానీ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గారి ఈ క్రింది పద్యాలను విన్నప్పుడు నాకు నిజమైన అవగాహన కలిగింది:

'పక్షులన్నింటికీ నిజమైన దేవుడు ఒక్క ఆయనే.
ఈ సత్యాన్ని గ్రహించినందుకు అభినందనలు.
ఓ మతబోధకుడా! ఇదేనా దేవుని ఏకత్వం?
నిజం చెప్పు, నీవు ఏ దేవుణ్ణి అనుసరిస్తున్నావు?'

అప్పుడు నాకు అర్థమైనది. ఆ తర్వాత మీ ఇద్దరు అన్నదమ్ములను శ్రీనగర్‌లో మీ మేనమామ వద్ద ఉంచి, నేను కాలినడకన ఖాదియాన్‌కు బయలుదేరాను. అక్కడ నాకు బైఅత్ చేసే భాగ్యం లభించింది." ఈ సందేశం నాకు సరైన మార్గాన్ని చూపించింది.

(సీరతుల్-మహ్దీ, సంపుటి 2, పుటలు 160-161, కథనం 1229)

హజ్రత్ మౌలానా గులామ్ రసూల్ రాజేకీ సాహిబ్ (రజి.) ఇలా వివరిస్తున్నారు: "బహుశా అది 1901 సంవత్సరం. ఒక సందర్భంలో నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి పవిత్ర సమక్షంలో ఉన్నాను. ఆ సమయంలో హుజూర్ (అ) దేవుని ఏకత్వం (తౌహీద్) గురించి ఒక ప్రసంగం చేశారు. అందులో హుజూర్(అ) ఇలా చెప్పారు: 'కొంతమంది ఎవరి నుండి ఉపకారం పొందినప్పుడు, ముందుగా "అల్హమ్దులిల్లాహ్" అని చెప్పకుండా నేరుగా "జజాకల్లాహ్" అని అంటారు. అయితే లోతుగా ఆలోచిస్తే, ఈ విధమైన మాటల్లో కూడా సూక్ష్మంగా షిర్క్ (దేవునికి భాగస్వాములను కల్పించడం) యొక్క ఆనవాళ్లు కనిపిస్తాయి. ఎందుకంటే ఉపకారం చేసే వ్యక్తి కూడా, అతడు ఆ ఉపకారం చేయగలిగే సాధనాలన్నీ కూడా అల్లాహ్ సృష్టించినవే. కాబట్టి ఉపకారం పొందిన వ్యక్తి ముందుగా "అల్హమ్దులిల్లాహ్" అని అల్లాహ్‌ను స్తుతించి, ఆ తరువాత మాత్రమే ఆ వ్యక్తికి "జజాకల్లాహ్" అని చెప్పాలి. దేవుని నిజమైన జ్ఞానం ప్రకారం, అన్ని సాధనాలను సృష్టించిన సృష్టికర్తకే మొదట కృతజ్ఞతలు సమర్పించడం అత్యంత అవసరం.'

ఆ తరువాతనే ఆ వ్యక్తికి "జజాకల్లాహ్" అని చెప్పవచ్చు.

(హయాత్-ఎ-ఖుద్సీ, పుట 134)

హజ్రత్ భాయ్ అబ్దుర్ రహ్మాన్ సాహిబ్ ఖాదియానీ గారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి చివరి ప్రయాణమైన లాహోర్ ప్రయాణం గూర్చి ఒక వ్యాసాన్ని ఇలా వ్రాసారు: "ఉదయం వేళ, నిర్వాహకులు విందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ క్రమంలోనే గౌరవనీయులు మరియు ప్రముఖుల వాహనాలు చేరుకోసాగాయి. కాని హజ్రత్ సాహెబ్ గారి ఆరోగ్యం" హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అచట ప్రసంగించవలసి యుండెను. కాని హుజూర్ (అ) గారి ఆరోగ్యం " నీరసముగా, బలహీనముగా ఉన్నది. పరిస్థితి ఎంత తీవ్రము గా ఉన్నదనగా అలాంటి పరిస్థితిలో హుజూర్ (అ) ప్రసంగించలేరని భావించసాగారు. ఈ కారణం చేతనే హుజూర్(అ) హజ్రత్ మౌలానా మౌల్వీ నూరోద్దీన్ రజియల్లాహు తాలా అన్‌హు గారికి మీరే ఇక్కడికి వచ్చే ఆధ్యాత్మిక అథితులకు తగిన విందు ఏర్పాట్లు చేయండి అని ఆదేశించారు. మొత్తానికి హజ్రత్ మౌల్వీగారు ప్రసంగాన్ని ప్రారంభించారు. కాని కొంత సమయం తరువాతనే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం స్వయముగా ఆ సభలోకి విచ్చేసారు. హజ్రత్ మౌల్వీ సాహెబ్ గారు తమ ప్రసంగాన్ని నిలిపివేశారు. హుజూర్ (అ) నిలబడి ప్రసంగించడం ప్రారంభించారు. సుమారు 3 గంటల వరకు ఈ ప్రసంగం కొనసాగింది. అంతకు ముందు అనారోగ్యం కారణంగా రాలేని పరిస్థితి. కాని ఇప్పుడు మూడు గంటల పాటు ఎంతో విజ్ఞానంతో కూడిన, ఆధ్యాత్మిక ప్రసంగాన్ని ప్రసంగించారు. జమాఅత్ సభ్యులను ప్రక్కన పెడితే , ఇతరులు కూడ ఆశ్యర్యముతో ఆనందంతో ఊగిపోయారు. పూర్తి ఏకాగ్రతతో ఆలకించసాగారు. లీనమైపోయారు. అట్టి ఆధ్యాత్మిక భోజనం వారికి ఎంతటి రుచిని కల్పించిదనగా, వారి బాహ్య భోజనం కూడ అట్టి మాధుర్యాన్ని అందించలేదు. హుజూర్ (అ) ఎంత అనర్గళముగా ప్రసంగించారనగా, నోట్ చేసుకోవడం కూడ కష్టతరమైనది. ప్రసంగం ఎంతటి శక్తివంతముగా, ప్రభావంతముగా ఉన్నదనగా, సభికులలో ఎవరి శ్వాస తీసుకొను శబ్దం కూడ వినబడడం లేదు. హుజూర్ (అ) ఎంతో ఉత్సాహంతో ప్రసంగించడంతో పాటు స్వయముగా సభీకుల మధ్యకు కూడ వెళ్ళుతున్నారు. హుజూర్ (అ) బల్లాకు వెనకాల కాకుండా, హుజూర్(అ) వెనకాల బల్లా ఉండేటట్లుగా నిలబడినారు. అనగా హుజూర్ (అ) బల్లాకు వెనకాల నిలబడి ప్రసంగించకుండా, బల్లాకు ముందు భాగంలో నిలబడి ప్రసంగించసాగారు. ఆ ప్రసంగం సమయంలో ఉత్సాహంతో ఒకటి రెండు అడుగులు ముందుకు కూడ వేశారు. హుజూర్ (అ) గారి ఈ ప్రసంగం డాక్టర్ సయ్యద్ ముహమ్మద్ హుస్సేన్




**వర్తమాన ఖలీఫా వాఖ్యములు**

**"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. "**

**(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)**

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*

షా గారి ఇంటి ప్రాంగణంలో హుజూర్ (అ) గారి మరణానికి 10 రోజుల ముందు ప్రసంగించబడింది. దీనికి సంపూర్ణ నిదర్శనం, పరిపూర్ణ ప్రచారం అని నామకరణం చేయడమైనది. ఆంగ్లేయ మేధావులతో అంతకు ముందే ఖ్వాజా కమాలొద్దీన్ గారి ఇంటి పై అంతస్థులో సంభాషణ పరంపర కొనసాగింది. అనగా అది చాలా గొప్ప ప్రచార కార్యక్రమం. ఆ ప్రసంగమే కాకుండా హుజూర్ (అ) మరికొన్ని చిన్న పెద్ద ప్రసంగాలు చేశారు.

మరల ఇలా వ్రాసారు: ఆ మధ్య కాలంలోనే " కొంత మంది హైందవ మహిళలు శాంతి సందేశపు రచన మధ్యలో హుజూర్ (అ)ను కలవడానికి ఒక బృందంగా వచ్చారు. ఆ సమయంలో హుజూర్ (అ) డాక్టర్ సయ్యద్ ముహమ్మద్ హుస్సేన్ షా గారి ఇంట్లో బస చేశారు. హుజూర్ (అ) చాలా బిజీగా ఉన్నారు. వారిని త్వరగా పంపించాలిని భావించారు. కాని వారు అభ్యర్ధించారు. ఏదేని ఉపదేశం చేయాలని వేడుకున్నారు. హుజూర్ (అ) చాలా బిజీగా ఉన్నప్పటికి వారి అభ్యర్ధనను స్వీకరించి ఉపదేశించుటకు అంగీకరించారు. హుజూర్ (అ) వారికి దైవ ఏకత్వం (తౌహీద్) గురించి ఉపదేశించారు, విగ్రహారాధనను నిషేధించారు, అలాగే ప్రార్థన ద్వారా అల్లాహ్ వైపు తిరగాలని ప్రోత్సహించారు.

ఈ సంఘటన వారి జీవితంలోని చివరి ఒకటి లేదా రెండు రోజులలో జరిగింది. వాస్తవానికి, ఆ మహిళలు మరికొంతసేపు అక్కడే ఉండి, హుజూర్ (అ) పవిత్రమైన ఉపదేశాలను ఇంకా ఎక్కువగా వినాలని కోరుకున్నారు. అయితే, హుజూర్ (అ)కు ఉన్న అత్యంత బిజీ కార్యక్రమాల కారణంగా వారికి ఇష్టం లేకపోయినా అక్కడి నుండి వెళ్లవలసి వచ్చింది. "అదేవిధంగా, హుజూర్ (అ) చివరి ప్రసంగాలలో ఇది ఒకటి, అందులోని కొన్ని ప్రభావవంతమైన వాక్యాల కారణంగా విశేషంగా ప్రసిద్ధి చెందింది. అందులో ఆయన ఇలా ప్రకటించారు:

'ఇస్లాం కోసం ఈసా (యేసు) మరణించనివ్వండి; ఎందుకంటే ఇందులోనే ఇస్లాంకు జీవం ఉంది. అలాగే, మోషేకు సంబంధించిన ఈసా స్థానంలో ముహమ్మదీయ మెస్సీయ రావాలి; ఎందుకంటే ఇస్లాం యొక్క మహిమ అందులోనే ఉంది.'

(సీరత్–ఉల్–మహ్దీ, అనుబంధం, భాగం 2, పుటలు 391--394)

దైవ ఏకత్వాన్ని స్థాపించాలనే ఎంతటి ప్రగాఢమైన తపన వారిలో ఉందో ఇది తెలియజేస్తుంది. అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ, అనేక బాధ్యతలతో నిమగ్నమై ఉన్నప్పటికీ, ఇస్లాం సందేశాన్ని మరియు దైవ ఏకత్వ బోధనను ప్రజలకు చేరవేయాల్సిన సందర్భంలో హుజూర్ (అ) తన వ్యక్తిగత ఆరోగ్యం గురించి ఏమాత్రం ఆలోచించలేదు.

కాబట్టి, ఈరోజు ముహమ్మదీయ మసీహ్ సేవకులుగా మన బాధ్యత ఏమిటంటే, దైవ ఏకత్వ సందేశాన్ని ప్రపంచమంతటా వ్యాప్తి చేయడం మాత్రమే కాకుండా, దానిని మన స్వంత జీవితాల్లో సజీవంగా ఆచరించవలెను. అల్లాహ్ తఆలా ఈ బాధ్యతను నెరవేర్చే సామర్థ్యాన్ని మనందరికీ ప్రసాదించుగాకా!

ప్రపంచ పరిస్థితి, ముఖ్యంగా ముస్లిం ప్రపంచ పరిస్థితి గురించి ప్రతి ఒక్కరికీ తెలుసు. ప్రస్తుతం ప్రార్థనల అవసరం చాలా ఎక్కువగా ఉంది.

కాల్పుల విరమణ (సీజ్‌ఫైర్) ప్రకటించబడినప్పటికీ, అది ఎక్కువకాలం కొనసాగుతుందని కనిపించడం లేదు. వాస్తవానికి, అందులో ఇప్పటికే విభేదాల సంకేతాలు కనిపించడం ప్రారంభమయ్యాయి. ఇజ్రాయెల్ ప్రభుత్వం ఏదో ఒక విధంగా లెబనాన్‌పై దాడి చేసి, ఇరానీయులను ప్రతిస్పందించేలా ప్రేరేపించాలని ప్రయత్నిస్తోంది.

ఇప్పుడు కొందరు యూరోపియన్ నాయకులు కూడా ఈ చర్యను ఖండించారు. కనీసం కొందరైనా తమ స్వరాన్ని వినిపించి, కొంత నైతికతను ప్రదర్శించారు. అయితే, అది బహుశా అంతటితోనే పరిమితమై పోతుంది. వారి నైతికత అంతవరకే. అంతకంటే ఎక్కువ చేయాలనే సంకల్పం వారికి లేదు; దానికి కావలసిన ధైర్యం లేదా శక్తి కూడా వారికి లేదు.

ఏది ఏమైనప్పటికీ, మనం ప్రార్థనలు కొనసాగించాలి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ముస్లిం ప్రపంచంపై తన కరుణను కురిపించుగాకా!.

**ఉపశాఖల వార్షిక సమావేశాలు ఖాదియాన్**

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారు మజ్లిస్ అన్సారుల్లాహ్, ఖుద్దాముల్ అహ్మదియ్య, అత్ఫాలుల్ అహ్మదియ్యకు చెందిన వార్షిక సమావేశాలు ఖాదియాన్ కొరకు 23, 24, 25 అక్టోబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. కావున నేటి నుండే ఈ పవిత్ర సమావేశాలలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సమావేశాలతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక సమావేశాలు అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

**(2వ పేజీ తరువాత )**

"ఓ అల్లాహ్ ప్రవక్తా! నేను మీపై తరచుగా దరూద్ పంపుతుంటాను. నా దుఆలలో ఎంత భాగాన్ని మీపై దరూద్ పంపడానికి కేటాయించాలి?" ప్రవక్త (స) ఇలా అన్నారు: "నీకు ఎంత ఇష్టమైతే అంత." నేను అడిగాను: "నాలుగో వంతు?" ప్రవక్త (స) ఇలా అన్నారు: "నీకు ఎంత ఇష్టమైతే అంత. అయితే దానికంటే ఎక్కువ పఠిస్తే అది నీకు మరింత మేలు." నేను అడిగాను: "సగం?" ప్రవక్త (స) ఇలా అన్నారు: "నీకు ఎంత ఇష్టమైతే అంత. అయితే దానికంటే ఎక్కువ పఠిస్తే అది నీకు మరింత మేలు." నేను అడిగాను: "మూడింట రెండు వంతులు?" ప్రవక్త (స) ఇలా అన్నారు: "నీకు ఎంత ఇష్టమైతే అంత. అయితే దానికంటే ఎక్కువ పఠిస్తే అది నీకు మరింత మేలు." అప్పుడు నేను అన్నాను: "ఇకపై నా దుఆ మొత్తం మీపై దరూద్ పంపడానికే అంకితం చేస్తాను." ప్రవక్త (స) ఇలా అన్నారు: "అలా చేస్తే నీ ఇహలోక, పరలోక అవసరాలన్నీ నెరవేరుతాయి మరియు నీ పాపాలు క్షమించబడతాయి." (జామిఅ తిర్మిజి, కితాబ్ సిఫతుల్ ఖియామహ్, ప్రవక్త(స) పై దరూద్ పంపుట యొక్క మహిమపై హదీస్)

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పై దరూద్ పంపడం యొక్క మహిమను వివరిస్తూ, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా పేర్కొన్నారు: "ఒక సందర్భంలో నేను దరూద్ షరీఫ్‌ను, అంటే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పై దరూద్ పంపడాన్ని చాలా కాలం పాటు అత్యంత ఏకాగ్రతతో పారాయణం చేయడంలో పూర్తిగా నిమగ్నుడనయ్యాను. ఎందుకంటే, సర్వోన్నతుడైన అల్లాహ్‌ను చేరుకునే మార్గాలు అత్యంత సూక్ష్మమైనవని, అవి మహోన్నత ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి మధ్యవర్తిత్వం ద్వారానే లభిస్తాయని నాకు దృఢమైన విశ్వాసం ఉండేది. అల్లాహ్ కూడా ఇలా సెలవిచ్చాడు:

**వబ్‌తఘూ ఇలైహి వసీలత (మాయిదా: 36)**

అనగా "ఆయనను చేరడానికి సాధనాన్ని అన్వేషించండి." కొంతకాలం తరువాత, ఒక దైవిక దర్శన స్థితిలో నేను ఇద్దరు నీటి మోసేవారిని (మష్కీలు) చూశాను. వారిలో ఒకరు ఇంటి లోపలి మార్గం ద్వారా, మరొకరు బయటి మార్గం ద్వారా నా ఇంటిలో ప్రవేశించారు. వారి భుజాలపై కాంతితో నిండిన నీటి తోలు సంచులు (మష్కులు) ఉన్నాయి. వారు ఇలా అన్నారు: "ఇది నీవు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పై దరూద్ పంపినందుకు లభించిన ఫలితం."

(హఖీఖతుల్ వహీ, రూహానీ ఖజాయిన్, సంపుటి 22, పుట 131, ఫుట్‌నోట్)

దరూద్ షరీఫ్ యొక్క మహిమ మరియు ప్రాముఖ్యత గురించి పవిత్ర ఖుర్ఆన్, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి హదీసులు, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) మరియు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజియల్లాహు అన్హు) వారి బోధనల వెలుగులో నేను అనేక సందర్భాలలో నా జుమా ప్రసంగాలలో మరియు ఇతర ఉపన్యాసాలలో ఈ విషయాన్ని విపులంగా వివరించాను. ఆ ప్రసంగాలను మీరు అల్ ఫజల్ పత్రికలో చదవవచ్చు. అలాగే జమాఅత్ అధికారిక వెబ్‌సైట్ **అల్‌ఇస్లాం.ఆర్గ్** లో వాటిని వినవచ్చు.

(అల్ ఫజల్ ఇంటర్నేషనల్, 7 ఫిబ్రవరి 2026 సంచిక ఆధారంగా.)

**ప్రపంచ అహ్మదీయ్యా జమాఅత్ సభ్యులకు ఒక ముఖ్య ప్రకటన:**

మన ప్రియతమ ఖలీఫా, అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి శుభప్రదమైన సూచన మేరకు తమను తాము ఆధ్యాత్మికపరమైన పటిష్టమైన కోటలో చేర్చుకొనుటకు ఈ రోజు మీరు ఈ క్రింది దుఆలను పఠించారా?.

(1) سُبْحَانَ اللهِ وَبِحَمْدِهٖ سُبْحَانَ اللهِ الْعَظِيْمِ اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّاٰلِ مُحَمَّدٍ

సుబ్‌హానల్లాహి వబిహమ్‌దిహీ సుబ్‌హానల్లాహిల్ అజీమ్ అల్లాహుమ్మ సల్లెఅలా ముహమ్మదిన్ వ్వ అలే ముహమ్మద్. (200 సార్లు పఠించవలెను)

(2) اَسْتَغْفِرُ اللهَ رَبِّيْ مِنْ كُلِّ ذَنْبٍ وَّاَتُوْبُ اِلَيْهِ

అస్తగ్‌ఫిరుల్లాహ రబ్బీ మిన్‌కుల్లి జన్‌బిన్ వ్వఅతూబు ఇలైహి.

**100 సార్లు పఠించవలెను.**

(3) رَبِّ كُلُّ شَيْءٍ خَادِمُكَ رَبِّ فَاحْفَظْنِيْ وَانْصُرْنِيْ وَارْحَمْنِيْ

రబ్బికుల్లి షైయిన్ ఖాదిముక రబ్బి ఫాహ్‌ఫజ్‌నీ వన్‌సుర్‌నీ వర్‌హమ్‌నీ.

**100 సార్లు పఠించవలెను.**

(25 సం॥ పైబడిన వారు పైన పేర్కొనబడినట్లుగా పఠించవలెను. 15 నుండి 25 సం॥ల వారు 100సార్లు, 15సం॥ల కంటే తక్కువ వయస్సు గలవారు 33 సార్లు, చిన్న పిల్లల తరుపున వారి తల్లిదండ్రులు 3నుండి 4 సార్లు పఠిస్తూ, పిల్లలతో కూడ పఠింపజేయవలెను.)

## సీరత్ ఖాతమున్నబియ్యాన్ (సల్లల్లాహు అలైహి వసల్లం):-

سیرت خاتم النبیین صلی اللہ علیہ وآلہ وسلم

**రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).**

**(గత సంచిక తరువాత)**

అప్పుడు ప్రవక్త (స) జరిగిన సంగతంతా వివరిస్తూ "వారు నా ఛాతి లోపల ఏదో ఒక వస్తువును వెతికారు. దానిని తీసి బయటకు విసిరివేశారు." అని చెప్పారు. ఆ తరువాత హలీమా, హారిస్ ఇద్దరూ ప్రవక్త (స) గారిని తమ గుడారానికి తీసుకెళ్లారు. హారిస్ హలీమాతో, "ఈ బాలుడికి ఏదో జరిగిందేమోనని నాకు భయంగా ఉంది. కాబట్టి వెంటనే ఇతన్ని అతని తల్లి వద్దకు తీసుకెళ్లి అప్పగించడం మంచిది." అని అన్నాడు. దాంతో హలీమా ప్రవక్త (స) గారిని మక్కాకు తీసుకువచ్చి ఆమినా సంరక్షణలో అప్పగించింది. ఇంత త్వరగా ఎందుకు తీసుకొచ్చావని ఆమినా అడిగింది. మొదట హలీమా కొంత సంకోచించింది. కానీ ఆమినా పదేపదే అడగడంతో జరిగిన సంఘటన అంతా వివరించింది. అంతేకాక, ఈ బాలుడు ఏదైనా జిన్ను లేదా ఇతర అతీంద్రియ శక్తి ప్రభావానికి గురై ఉండవచ్చనే తన భయాన్ని వ్యక్తం చేసింది. అప్పుడు ఆమినా ఇలా చెప్పింది: "అలా జరగడం అసంభవం. నా కుమారుడు గొప్ప మహిమకు నియమించబడ్డవాడు. నేను నా కుమారుడిని గర్భంలో ఉన్నప్పుడు, నా లోపలి నుండి ఒక ప్రకాశవంతమైన కాంతి వెలువడి, సుదూర ప్రాంతాల వరకు వ్యాపించినట్లు నేను చూశాను."

ఈ సంఘటనకు సహీహ్ ముస్లింలోని ఒక హదీస్ కూడా సాధారణంగా మద్దతు నిస్తుంది. అందులో అనస్ ఇబ్న్ మాలిక్ (రజియల్లాహు అన్హు) ఇలా వివరిస్తున్నారు: ఒక సందర్భంలో, అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కొంతమంది పిల్లలతో కలిసి ఆడుకుంటుండగా, జిబ్రాయిల్ (అలైహిస్సలాం) వారి వద్దకు వచ్చి, వారిని నేలపై పడుకోబెట్టి, వారి ఛాతీని తెరిచి, వారి హృదయాన్ని బయటకు తీశారు. ఆ తరువాత దానిలోనుండి ఒక వస్తువును తీసి బయటకు విసిరివేస్తూ, "ఇది మానవ బలహీనతలకు సంబంధించిన మలినత్వం; ఇప్పుడు ఇది నీ నుండి తొలగించబడింది" అని అన్నారు. అనంతరం జిబ్రాయిల్ (అలైహిస్సలాం) ప్రవక్త (స)హృదయాన్ని స్వచ్ఛమైన నీటితో కడిగి, తిరిగి వారి ఛాతీలో ఉంచి, ఛాతీని మళ్లీ మూసివేశారు.

పిల్లలు జిబ్రాయిల్ (అలైహిస్సలాం) ప్రవక్త (స)ను నేలపై పడవేసి, వారి ఛాతీని తెరవడం చూసి భయపడి, పరుగెత్తుకుంటూ ప్రవక్త (స)కు పాలిచ్చిన తల్లి (పెంపుడు తల్లి) వద్దకు వెళ్లి, "ముహమ్మద్(స)ను ఎవరో చంపేశారు!" అని చెప్పారు. వారు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు తిరిగి చేరుకునే సమయానికి, దూత అదృశ్యమైపోయాడు; ప్రవక్త (స)మాత్రం భయంతో నిలబడి ఉన్నారు.

సహీహ్ ముస్లిం ఇచ్చిన ధృవీకరణ అనంతరం, ఇబ్న్ హిషామ్ తెలిపిన ఈ వృత్తాంతానికి అంతటి బలం లభిస్తుంది కాబట్టి, బలమైన ఆధారం లేకుండా దానిని బలహీనమైనదిగా కొట్టి వేయలేము. అయితే, ఈ సంఘటన ఒక ఆధ్యాత్మిక దర్శనం (కష్ఫ్) అని స్పష్టంగా తెలుస్తుంది. నిజానికి, ఛాతీ తెరవబడినట్లు ఎటువంటి బాహ్యా గుర్తులు కనిపించకపోవడం అంటే, వారి పెంపుడు తల్లి లేదా ఇతరులు అలాంటి శారీరక ఆనవాళ్లను గమనించకపోవడం కూడా ఇది ఒక ఆధ్యాత్మిక దర్శనమేనని సూచిస్తుంది. అంతేకాక, ఈ దర్శనం ప్రభావం అక్కడున్న ఇతర పిల్లల వరకు కూడా విస్తరించింది. ఈ దర్శనంలోనే స్పష్టంగా పేర్కొన్నట్లుగా, దాని అర్థం ఏమిటంటే, దైవదూత ఆధ్యాత్మిక దర్శన స్థితిలో ప్రత్యక్ష రూపంలో ప్రత్యక్షమై, ప్రవక్త (స)ఛాతీని తెరిచి, మానవ బలహీనతలకు సంబంధించిన ప్రతి మలినత్వాన్ని వారిలో నుండి తొలగించాడనే విషయం.

విశ్వసనీయమైన హదీస్‌లు కూడా మిరాజ్ (ఆకాశారోహణం) జరిగిన రాత్రి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో ఇలాంటి ఛాతీ తెరవబడిన సంఘటన మరొకసారి జరిగినట్లు నిర్ధారిస్తున్నాయి. ఆ సమయంలో దేవదూతలు ప్రవక్త (స) హృదయాన్ని తీసి, జమ్‌జమ్ పవిత్ర జలంతో కడిగి, తిరిగి దాని స్థానంలో ఉంచారు.

ఇక్కడ మరో విషయం ప్రస్తావించదగినది. సర్ విలియమ్ ముయిర్ ఈ సంఘటనను ప్రస్తావిస్తూ, అవమానకరమైన రీతిలో నవూజ్ బిల్లాహ్! (అల్లాహ్ కాపాడుగాకా!) ఇది ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు వచ్చిన ఒక మూర్ఛ దాడి మాత్రమేనని వ్యాఖ్యానించాడు. ఎవరి మాటలను మనం అడ్డుకోలేము; కానీ ఈ అభ్యంతరాన్ని వ్యక్తం చేయడంలో ముయిర్ అత్యంత పక్షపాత ధోరణిని ప్రదర్శించాడనేది స్పష్టంగా తెలుస్తుంది.

మొదటిగా, మూర్ఛ వ్యాధితో బాధపడే వ్యక్తికి మెదడు బలహీనంగా ఉంటుందని అందరికీ తెలిసిందే. అయితే, సర్ విలియమ్ ముయిర్ స్వయంగా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అత్యుత్తమ శారీరక సామర్థ్యాలను కలిగి ఉన్నారని అంగీకరిస్తాడు. అంతేకాక, ఈ అభ్యంతరానికి ఆధారంగా చూపబడుతున్న హదీసే ఆ అభ్యంతరాన్ని ఖండిస్తుంది. ఆ నివేదికల ప్రకారం, ప్రవక్త (స) పాలసోదరుడు కూడా ఈ దర్శనాన్ని చూశాడు. అతను పరుగెత్తి తన తల్లిదండ్రులకు, "తెల్లని వస్త్రాలు ధరించిన ఇద్దరు వ్యక్తులు నా ఖురైషీ సోదరుణ్ణి నేలపై పడవేసి, ఆయన ఛాతీని తెరిస్తున్నారు" అని చెప్పాడు.

మూర్ఛ దాడి జరిగిన సందర్భంలో, చుట్టుపక్కల ఉన్నవారు కూడా ఇలాంటి దృశ్యాన్ని చూశామని సాక్ష్యమిచ్చిన ఉదాహరణ ఎప్పుడైనా ఉందా? మూర్ఛ వచ్చిన వ్యక్తి తన భావనలో ఎవరో తనను పట్టుకుని నేలపై పడవేశారని అనుకోవచ్చు. కానీ అతన్ని చూస్తున్న ఇతరులు కూడా అదే దర్శనాన్ని చూశారని చెప్పడం అనేది అత్యంత పక్షపాత భావన కలిగిన వ్యక్తి తప్ప మరెవ్వరూ చేయలేని వాదన.

ఏదేమైనా, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) నాలుగు సంవత్సరాల వయస్సుకు చేరుకున్నప్పుడు, హలీమా వారిని తిరిగి తీసుకువచ్చి వారి తల్లి సంరక్షణకు అప్పగించింది. ఈ నాలుగు సంవత్సరాల పాటు ఆమె చేసిన సేవ సాధారణమైనది కాదు. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తనకు చేసిన అతి చిన్న ఉపకారాన్నైనా ఎప్పుడూ మరచిపోలేదు. అందువల్ల, హలీమా చేసిన ఈ సేవను వారు జీవితాంతం గుర్తుంచుకుని, ఆమె పట్ల ఎల్లప్పుడూ అత్యున్నత గౌరవం, ప్రేమ మరియు ఔదార్యంతో ప్రవర్తించారు.

ఒకసారి దేశంలో తీవ్రమైన కరువు సంభవించినప్పుడు హలీమా మక్కాకు వచ్చింది. అప్పుడు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆమెకు నలభై గొర్రెలను మరియు ఒక ఒంటెను బహుమతిగా ఇచ్చారు. తరువాత, వారి ప్రవక్తత్వ కాలంలో ఆమె మరోసారి ప్రవక్త (స)ను చూడడానికి వచ్చింది. ఆమెను చూడగానే ప్రవక్త (స) వెంటనే లేచి నిలబడి, "అమ్మా! అమ్మా!" అని ఆప్యాయంగా పలికారు. అనంతరం తన పై వస్త్రాన్ని తీసి, ఆమె కూర్చోవడానికి నేలపై పరిచారు.

ఇంకా, హునైన్ యుద్ధం అనంతరం హవాజిన్ తెగకు చెందిన వేలాది మంది బందీలను ప్రవక్త (స) సమక్షానికి తీసుకువచ్చినప్పుడు, తన పాల బంధుత్వాన్ని గౌరవిస్తూ వారందరినీ విముక్తి చేశారు. వారి విడుదలకు ప్రతిఫలంగా ఒక్క పైసా కూడా తీసుకోలేదు. అలాగే, ఆ బందీలలో ఉన్న తన పాలసోదరి షైమాకు ఉదారంగా బహుమతులు ఇచ్చి, గౌరవంగా తిరిగి పంపించారు.

హలీమా మరియు ఆమె భర్త హారిస్ ఇస్లాంను స్వీకరించారా? అనే విషయంలో పండితుల మధ్య కొంత భిన్నాభిప్రాయం ఉంది. అయితే, బలమైన అభిప్రాయం ప్రకారం వారిద్దరూ ఇస్లాంను స్వీకరించి, ముస్లింలుగానే మరణించారు. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క పాలసోదరుడు అబ్దుల్లాహ్ మరియు పాలసోదరి షైమా కూడా ఇస్లాం విశ్వాసంలోనే మరణించారు.

**(తదుపరి సంచికలో చదవగలరు)**

**అహ్‌దీస్ బోధనలు**

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు:
**"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."**
(కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671)

**దుఆ ఆశించువారు:** ***Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

**అహ్‌దీస్ బోధనలు**

**"ఒక మునల్మానుడి విశిష్ట లక్షణవేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.**
(మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్)

**దుఆ ఆశించువారు:** ***Muhammad Vazeer Ahmad sb***

**సీరతుల్ మహ్దీ (అలైహిస్సలాతు వస్సలాం):-** سیرت المہدی علیہ السلام

**రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).**

అపార దయామయుడు పరమకారుణ్య మూర్తి అల్లాహ్ పేరుతో:

11) హజ్రత్ వాలిదా సాహిబా (గౌరవనీయ తల్లి) నాకు ఇలా వివరించారు: హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) మంగళవారాన్ని శుభప్రదమైన రోజుగా పరిగణించేవారు కాదు. అలాగే, హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజి ఇలా చెప్పారు. ముబారక్ బేగం (మా సోదరి) జన్మించబోతున్నప్పుడు అది మంగళవారం కావడంతో, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆమెను మంగళవారంతో సంబంధం కలిగిన కష్టకర ప్రభావాల నుండి అల్లాహ్ రక్షించాలని ప్రత్యేకంగా ప్రార్థించారు. నేను (ఈ వినయపూర్వక కథనకర్త) వినయంతో తెల్పునదేమనగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) శుక్రవారం కవల పిల్లలలో ఒకరిగా జన్మించారు. అయితే, వారు (అ) మంగళవారం పరమపదించారు. అలాగే, రోజుల లెక్కింపు ఈ లోకంలోని మనుషుల దృష్టికే సంబంధించినదని కూడా గ్రహించాలి. నిజానికి, ప్రపంచానికి వారు (అ) మరణించిన రోజు గొప్ప విపత్తు, తీవ్ర విషాదం సంభవించిన రోజుగా నిలిచింది.

(ఈ కథనం వల్ల మంగళవారం అశుభమైన లేదా అపశకునమైన రోజు అని అర్థం చేసుకోకూడదు. రెండవ భాగంలోని 311, 322, మరియు 360వ కథనాలలో మరియు ఇప్పటికే వివరించినట్లుగా, దీని భావం ఏమిటంటే, కొన్ని ఆకాశ సంబంధిత (ఖగోళ) ప్రభావాల అంతర్లీన వ్యవస్థ ప్రకారం మంగళవారానికి కఠినత మరియు కష్టాలకు సంబంధించిన ఒక ప్రత్యేక స్వభావం ఉందని మాత్రమే. దీనికి అనుగుణంగా, ఒక హదీస్‌లో కూడా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా పేర్కొన్నారు: "మంగళవారం అల్లాహ్ రాతి పర్వతాలను మరియు హానికరమైన వస్తువులను సృష్టించిన రోజు." దీనికి సంబంధించి తఫ్సీర్ ఇబ్నే కసీర్ లో "ఖలకల్ అర్ద ఫీ యౌమైన్" ("ఆయన భూమిని రెండు రోజుల్లో సృష్టించాడు") అనే సూక్తి వ్యాఖ్యానాన్ని చూడవచ్చును.)

12) హజ్రత్ వాలిదా సాహిబా నాకు ఇలా వివరించారు: హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) తమ చివరి అనారోగ్య సమయంలో తీవ్రమైన అస్వస్థతకు గురై, వారి పరిస్థితి అత్యంత విషమంగా మారినప్పుడు, నేను ఎంతో ఆందోళన చెంది ఇలా అన్నాను: "ఓ అల్లాహ్! ఇప్పుడు ఏమి జరగబోతోంది?" అందుకు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా సమాధానం ఇచ్చారు: "నేను ఎప్పటినుంచో చెప్పుకుంటూ వచ్చిన విషయం ఇదే."

ఈ భవదీయుడు సంక్షిప్తంగా తెల్పు విషయమేమనగా, 1908 మే 25, సోమవారం సాయంత్రం వరకు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు. ఇషా నమాజు అనంతరం నేను బయట నుంచి ఇంటికి తిరిగి వచ్చినప్పుడు, వారు వాలిదా సాహిబాతో కలిసి మంచంపై కూర్చొని భోజనం చేస్తుండడం చూశాను. అనంతరం నేను నా మంచంపైకి వెళ్లి నిద్రపోయాను. రాత్రి చివరి సమయంలో, తెల్లవారుజామునకు సమీపంలో, ఇంట్లో ప్రజలు సంచరిస్తూ మాట్లాడుతున్న శబ్దాలకు నేను మేల్కొన్నాను లేదా బహుశా ఆ శబ్దాల వల్లనే మేల్కొన్నానేమో. అప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) తీవ్రమైన విరేచనాలతో అత్యంత విషమ స్థితిలో ఉన్నారని చూశాను. వైద్యులు మరియు ఇతరులు వారికి చికిత్స అందించడంలో నిమగ్నమై ఉన్నారు. వారిని ఆ స్థితిలో చూసిన తొలి క్షణమే నా హృదయం కలవరపడింది. ఎందుకంటే ఇంతకు ముందు నేను వారిని అలాంటి పరిస్థితిలో ఎప్పుడూ చూడలేదు. వెంటనే నా మనసులో, "ఇదే వారి చివరి అనారోగ్యం" అనే భావన కలిగింది. అప్పటికే వారు అత్యంత బలహీనంగా మారిపోయారు. కొద్దిసేపటి తర్వాత వైద్యుడు వారి నాడిని పరీక్షించాడు; కానీ నాడి కనిపించలేదు. అక్కడున్న వారందరూ వారు పరమపదించారని భావించారు. ఆ క్షణంలో అక్కడున్న వారందరిపై ఒక గంభీరమైన నిశ్శబ్దం అలుముకుంది. అయితే కొద్దిసేపటి తర్వాత నాడి మళ్లీ కొట్టుకోవడం ప్రారంభించింది. అయినప్పటికీ వారి పరిస్థితి అత్యంత విషమంగానే కొనసాగింది.

ఉదయం కావడంతో, వారి మంచాన్ని ప్రాంగణం నుంచి ఇంట్లోని ఒక గదిలోకి మార్చారు. వెలుతురు బాగా వచ్చిన తర్వాత, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా అడిగారు: "నమాజు సమయం అయిందా?" అందుకు ఖాదియాన్‌కు చెందిన షైఖ్ అబ్దుర్ రహ్మాన్ సాహిబ్ ఇలా సమాధానమిచ్చినట్లు అనిపిస్తోంది: "అవును, హుజూర్." అప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తమ చేతులను పరుపుపై ఉంచి తయ్యమ్ముమ్ చేసి, మంచంపైనే పడుకుని నమాజు ప్రారంభించారు. అయితే నమాజు మధ్యలోనే వారికి మూర్ఛ వచ్చినందున దానిని పూర్తి చేయలేక పోయారు. కొంతసేపటి తర్వాత వారు మళ్లీ, ఫజర్ నమాజు సమయం అయ్యిందా అని అడిగారు. సమయం అయ్యిందని చెప్పగా, మళ్లీ నమాజు చేయాలనే సంకల్పం చేశారు. అయితే ఆ నమాజును పూర్తిచేశారో లేదో నాకు గుర్తులేదు. ఆ సమయంలో వారు తీవ్రమైన వేదన, అసహనం అనుభవిస్తున్నారు.

ఉదయం సుమారు ఎనిమిది లేదా ఎనిమిదిన్నర గంటల సమయంలో వైద్యుడు ఇలా అడిగాడు: "హుజూర్‌కు ఏ ప్రత్యేకమైన అసౌకర్యం కలుగుతోందా?" కానీ వారు మాటలతో సమాధానం చెప్పలేకపోయారు. అందువల్ల కాగితం, కలం, సిరా తీసుకువచ్చారు. వారు తమ ఎడమ చేతిని ఆధారంగా చేసుకుని కొద్దిగా లేచి ఏదో రాయడానికి ప్రయత్నించారు. ఎంతో కష్టపడి కొన్ని మాటలు మాత్రమే రాయగలిగారు. ఆ తర్వాత తీవ్ర బలహీనత కారణంగా కలం కాగితంపై జారిపోయింది. వెంటనే వారు తిరిగి మంచంపై పడుకున్నారు. వారు రాసిన ఈ చివరి లిఖిత సందేశంలో, నాలుకకు సంబంధించిన ఏదో సమస్యను ప్రస్తావించినట్లు అనిపించింది. అయితే దానిలో కొంత భాగం స్పష్టంగా చదవలేక పోయారు. ఆ చీటీని వాలిదా సాహిబాకు ఇచ్చారు.

ఉదయం తొమ్మిది గంటల తర్వాత వారి పరిస్థితి మరింత విషమించింది. కొద్దిసేపటికే మరణానికి ముందు కనిపించే చివరి శ్వాసల స్థితి ప్రారంభమైంది. ఆ శ్వాసలో ఎటువంటి ప్రత్యేక శబ్దం లేకపోయినా, వారి శ్వాస చాలా పొడవుగా, భారంగా, కష్టంగా సాగుతోంది. ఆ సమయంలో నేను వారి తలవద్ద నిలబడి ఉన్నాను. ఇది గమనించి, పక్కగదిలో ఉన్న వాలిదా సాహిబాకు సమాచారం అందించాను. ఆమె ఇంట్లోని మరికొంత మంది మహిళలతో కలిసి వచ్చి, వారి మంచం పక్కనే నేలపై కూర్చున్నారు. ఆ సమయంలో లాహోర్‌కు చెందిన డాక్టర్ ముహమ్మద్ హుసైన్ షా వారి ఛాతీ సమీపంలో ఒక ఇంజెక్షన్ ఇచ్చారు. ఆ ప్రదేశం కొద్దిగా వాచింది. కానీ ఎలాంటి మెరుగుదల కనిపించలేదు. పైగా, ఆ స్థితిలో వారికి ఇంత బాధ కలిగించే చికిత్స చేయకూడదని కొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ చివరి శ్వాసల స్థితి కొంతసేపు కొనసాగింది. ప్రతి క్షణం గడిచేకొద్దీ వారి శ్వాసల మధ్య వ్యవధి మరింత పెరుగుతూ వచ్చింది. చివరకు వారు ఒక చివరి దీర్ఘ శ్వాస తీసుకుని, తమ పవిత్ర ఆత్మను అత్యున్నత సహచరుని (అల్లాహ్) సన్నిధికి సమర్పించారు.

ఓ అల్లాహ్! హుజూర్ పై, హుజూర్ నాయకులైన హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)పై నీ అపారమైన దయాశాంతులను కురిపించుము. వారికి సమృద్ధిగా శాంతిని ప్రసాదించుము.

నేను తరువాత ఈ సంఘటన ధృవీకరణ కోసం వాలిదా సాహిబాకు మళ్లీ వివరించి, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) మరణం గురించి ప్రస్తావించగా, వారు ఇలా తెలిపారు: " వారు (అ) భోజనం చేస్తుండగానే మొదటిసారి విరేచనాలు ప్రారంభ మయ్యాయి. ఆ తరువాత కొంతసేపు మేము వారి (అ) పాదాలను ఒత్తుతూనే ఉన్నాము. వారు (అ) సౌకర్యంగా పడుకొని నిద్రపోయారు. నేనూ నిద్రపోయాను. కొంతసేపటి తరువాత వారికి మళ్లీ విసర్జన చేయాల్సిన అవసరం కలిగింది. బహుశా ఒకటి లేదా రెండు సార్లు వారు స్వయంగా మరుగుదొడ్డికి వెళ్లారు. ఆ తరువాత వారు (అ) చాలా బలహీనమైనందున, తమ చేతితోనే నన్ను మేల్కొలిపారు. నేను లేచి చూసేసరికి వారు చాలా బలహీనపడిపోయి ఉండడంతో, నా మంచంపై పడుకున్నారు. నేను హుజూర్ (అ) పక్కనే కూర్చొని వారి పాదాలను ఒత్తుతున్నాను. కొంతసేపటి తరువాత హుజూర్ (అ) ఇలా అన్నారు: 'ఇప్పుడు నువ్వు వెళ్లి నిద్రపో.' అందుకు నేను ఇలా అన్నాను: 'లేదు, నేను మీ పాదాలను ఒత్తుతూనే ఉంటాను.' అంతలో హుజూర్ (అ) మళ్లీ తీవ్రమైన విరేచనాలు వచ్చాయి. అయితే అప్పటికి హుజూర్ (అ) మరుగుదొడ్డికి వెళ్లేంత శక్తి కూడా లేకపోయింది. అందువల్ల నేను మంచం పక్కనే ఏర్పాట్లు చేశాను. హుజూర్ (అ) అక్కడే విసర్జన చేశారు. తరువాత మళ్లీ పడుకున్నారు. నేను హుజూర్ (అ) పాదాలను ఒత్తుతూనే ఉన్నాను. అయితే అప్పటికి హుజూర్ (అ) బలహీనత చాలా తీవ్రంగా మారింది. కొద్దిసేపటికి మళ్లీ విరేచనాలు వచ్చాయి. వాటితో పాటు వాంతులు కూడా అయ్యాయి. వాంతులు పూర్తయిన తరువాత హుజూర్ (అ) మళ్లీ పడుకోవడానికి ప్రయత్నించగా, అంతగా బలహీనపడిపోయి ఉండటంతో వెనక్కి పడిపోయి, మంచం చెక్క చట్రానికి హుజూర్ (అ) తల బలంగా తగిలింది. దాంతో హుజూర్ (అ) పరిస్థితి మరింత విషమించింది. ఆ సమయంలో నేను భయపడి ఇలా అన్నాను: 'ఓ అల్లాహ్! ఇప్పుడు ఏమి జరగబోతోంది?' అందుకు హుజూర్ (అ) ఇలా సమాధానమిచ్చారు: 'నేను ఇంతకాలం చెప్పుకొచ్చింది ఇదే.' నేను వాలిదా సాహిబాను అడిగాను: 'హుజూర్ (అ) ఉద్దేశం మీకు అర్థమైందా?' ఆమె ఇలా జవాబిచ్చారు: 'అవును.' వారు ఇంకా ఇలా వివరించారు: హుజూర్ (అ) పరిస్థితి మరింత దిగజారి, బలహీనత చాలా ఎక్కువైనప్పుడు నేను ఇలా అడిగాను: 'మౌల్వీ సాహిబ్ (హజ్రత్ మౌల్వీ నూరుద్దీన్ సాహిబ్) గారిని పిలవాలా?' హుజూర్ (అ) ఇలా అన్నారు: 'పిలవండి.' అలాగే హుజూర్ (అ) ఇలా కూడా అన్నారు: 'మహ్మూద్‌ను నిద్రలేపండి.' తరువాత నేను ఇలా అడిగాను: 'ముహమ్మద్ అలీ ఖాన్ నవాబ్ సాహిబ్ గారిని కూడా పిలవాలా?' అందుకు వాలిదా సాహిబా " ఆ ప్రశ్నకు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఏమైనా సమాధానం ఇచ్చారో లేదో, ఇచ్చి ఉంటే ఏమని చెప్పారో తనకు గుర్తులేదని." చెప్పారు.

ఈ భవదీయుడు తెల్పునదేమనగా, హదీస్‌లలో పేర్కొనబడిన ప్రకారం, తమ చివరి అనారోగ్య సమయంలో దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు కూడ తీవ్రమైన శారీరక బాధ, అసహనం, ఆందోళన మరియు వేదనను అనుభవించారు. మరియు అదేవిధంగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తమ చివరి క్షణాల్లో సుమారు అలాంటి పరిస్థితిని అనుభవించినట్లు మేము ప్రత్యక్షంగా గమనించాము.

**(తదుపరి సంచికలో చదవగలరు)**

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail:
teluguweeklybadar@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక

Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA

POSTAL REG NO GDP-38/2026-2028. Vol. 11. Thursday, 09-16 JUL 2026, Issue No : 28-29

ACT.MANAGER
ATHAR AHMAD SHAMIM
Mobile. : +91 98156 39670
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

## సయ్యదినా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి ఆస్ట్రేలియా పర్యటన 2013.

### అహ్మదీయ ముస్లిం జమాఅత్ ఆస్ట్రేలియా జాతీయ ఆమిలా (కార్యవర్గం)తో హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ (అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ వారి సమావేశం:-

తదుపరి కార్యక్రమం ప్రకారం, అహ్మదీయ ముస్లిం జమాఅత్ ఆస్ట్రేలియా జాతీయఆమిలా సభ్యులతో హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ వారి సమావేశం ప్రారంభ మైంది. ప్రారంభంలో హుజూర్ అందరితో కలిసి దుఆ చేయించారు.

ఆ తరువాత హుజూర్ జనరల్ సెక్రటరీని స్థానిక జమాఅత్‌ల సంఖ్య ఎంత ఉందని, అలాగే వాటి నుండి నివేదికలు క్రమం తప్పకుండా అందుతున్నాయా అని ప్రశ్నించారు. అందుకు జనరల్ సెక్రటరీ, మొత్తం పది జమాఅత్‌లు ఉన్నాయని, వాటన్నింటి నుండి ప్రతి నెలా నివేదికలు అందుతున్నాయని తెలిపారు.

తరువాత హుజూర్ సెక్రటరీ మాల్(ఆర్థిక కార్యదర్శి)తో కలిసి జమాఅత్ వార్షిక బడ్జెట్, చందా చెల్లిస్తున్న సభ్యుల సంఖ్య, ఆదాయం పొందుతున్న సభ్యుల సంఖ్య, అలాగే వారి ఆర్థిక విరాళాల స్థాయిని వివరంగా సమీక్షించారు. అనంతరం హుజూర్ ఇలా వ్యాఖ్యానించారు:

"ప్రమాణం చాలా మంచిగా ఉంది. సెక్రటరీ మాల్ ఎంతో శ్రద్ధగా పనిచేశారు."

సెక్రటరీ మాల్ నివేదిస్తూ, మొత్తం 1,249 మంది ఆదాయం పొందుతున్న సభ్యులు ఉన్నారని తెలిపారు. వారిలో: 941 మంది నిర్ధేశిత ప్రకారం చందా చెల్లిస్తున్నారు. 308 మంది నిర్ధేశిత ప్రకారం చందా చెల్లించడం లేదు. నిర్ధేశిత ప్రకారం చందా చెల్లిస్తున్న 941 మందిలో 874 మంది వసియ్యత్ చేశారని తెలిపారు.

ఆ తరువాత హుజూర్ వసియ్యత్ సెక్రటరీని మహిళా మూసీల సంఖ్య గురించి అడిగారు. ఆయన సమాధానంగా, మొత్తం 874 మంది మూసీలలో 327 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. వీరిలో కొందరు ఉద్యోగాలు లేదా ఆదాయం కలిగి ఉండి తమ ఆదాయానికి అనుగుణంగా చందా చెల్లిస్తున్నారు. మిగిలిన ఆదాయం లేని మహిళలు సంవత్సరానికి 180 ఆస్ట్రేలియన్ డాలర్లు, అంటే నెలకు 15 డాలర్లు చందా చెల్లిస్తున్నారు అని తెలిపారు.

దీనిపై హుజూర్ ఇలా అన్నారు: "ఆదాయం పొందుతున్న సభ్యులలో కనీసం యాభై శాతం మంది మూసీలు ఉండాలి. ప్రస్తుతం ఉన్న మొత్తం మూసీలలోఎక్కువ సంఖ్య ఆదాయం లేని వారిదే. కాబట్టి ఈ కోణంలో సమీక్షించి యాభై శాతం లక్ష్యాన్ని సాధించండి. ప్రస్తుతం కూడా మీరు మరో 150 మందికి పైగా ఆదాయం పొందుతున్న సభ్యులను వసియ్యత్‌లో చేర్చగలరు. దానికి తగిన అవకాశం ఉంది."

హుజూర్ మరల ఇలా సూచించారు: "మూసీల నుండి కేవలం ధనం సేకరించడమే లక్ష్యం కాదు. వారి నైతిక, ఆధ్యాత్మిక శిక్షణ కూడా సమానంగా జరగాలి. చందా అనేది పన్ను కాదు. మూసీలు ధర్మనిష్ఠ, భక్తి మరియు దైవభీతికి చెందిన అత్యున్నత ప్రమాణాలను పాటించాలి. ఈ అంశంపై మరింత శ్రద్ధ చూపాలి. వారు చేసే ఆర్థిక త్యాగం కేవలం అల్లాహ్ ప్రసన్నతను పొందడానికై ఉండాలి."

తర్బియత్ (నైతిక శిక్షణ) జాతీయ కార్యదర్శిని ఉద్దేశించి హుజూర్ ఇలా ఆదేశించారు: "నమాజ్ విషయంలో తగిన శ్రద్ధ కనిపించడం లేదు. కేంద్రాలు మరియు మస్జిద్‌లలో కూడా నమాజ్ హాజరు తక్కువగా ఉంది. మీ వద్ద సుమారు ఐదు వందల మంది పురుషమూసీలు ఉన్నారు. వారిలో 27 మంది జాతీయ ఆమిలా సభ్యులు. అదనంగా అన్సార్ మరియు ఖుద్దామ్ ఆమిలాల సభ్యులు కూడా ఉన్నారు. ఈ బాధ్యతగల అధికారులు క్రమం తప్పకుండా మస్జిద్‌లకు వస్తే నమాజ్ హాజరు సహజంగానే పెరుగుతుంది. ప్రతి జమాఅత్‌కు తన స్వంత ఆమిలా ఉంది. అలాగే ప్రతి ఖుద్దామ్ మరియు అన్సార్ మజ్లిస్‌కు కూడా కార్యవర్గ సభ్యులు ఉన్నారు. వీరందరూ తమ తమ కేంద్రాల్లో క్రమం తప్పకుండా నమాజ్‌కు హాజరవుతే హాజరు గణనీయంగా పెరుగుతుంది. కాబట్టి ముందుగా పదవిదారులు స్వయంగా ఆదర్శంగా నిలవాలి. వారు క్రమం తప్పకుండా నమాజ్‌కు రావడం ప్రారంభిస్తే ఇతరులు కూడా వారిని అనుసరిస్తారు. కావున స్వయముగా మీరు కూడ సామూహిక నమాజ్‌లలో మీ హాజరు శాతంను పెంచండి."

హుజూర్ ఇంకా ఇలా సూచించారు: "మొదట పదవి దారులందరు నమాజ్ పట్ల మరింత శ్రద్ధ చూపేలా ప్రోత్సహించండి. ఆ తరువాత ప్రతి రోజు పవిత్ర ఖుర్ఆన్ పారాయణం చేయడానికి వారిని ప్రోత్సహించండి. అలాగే ఎంటిఏ ద్వారా ప్రసారమయ్యే జుమా ప్రసంగాలను క్రమం తప్పకుండా వినే అలవాటు చేసుకోండి. తర్బియత్ సెక్రటరీ వద్ద ఖుత్బాలు ఎందరు క్రమంగా వింటున్నారు కు సంబంధించిన వివరాలు ఉండాలి."

హుజూర్ మరల ఇలా అన్నారు: " జుమా ప్రసంగాలలో తర్బియత్‌కు సంబంధించిన అనేక ముఖ్యమైన అంశాలు ఉంటాయి. చురుకుగా, సక్రమంగా పనిచేసే జమాఅత్‌లు ఆ ముఖ్యాంశాలను సంకలనం చేసి తమ స్థానిక జమాఅత్ లన్నింటికీ పంపిస్తాయి. మీరు కూడా ఇక్కడ అదే విధానాన్ని అనుసరించాలి."

కుటుంబ వ్యవహారాల గురించి మాట్లాడుతూ హుజూర్ ఇలా అన్నారు:

"ఆస్ట్రేలియాలో నేటి కాలంలోకుటుంబ సంబంధాలు దెబ్బతినడం ప్రారంభమైంది. కొన్ని సందర్భాల్లో కుమారులను ఇంటి నుండి పంపివేస్తున్నారు; మరికొన్ని సందర్భాల్లో కుమార్తెలను ఇంటి నుండి పంపిస్తున్నారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి ఇస్లాహీ కమిటీ (సయోధ్య కమిటీ) ఏర్పాటు చేయబడింది. అది తన పాత్రను చురుకుగా నిర్వహించాలి. భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తిన వెంటనే ప్రారంభ దశలోనే ఇద్దరికీ సలహా ఇచ్చి సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించాలి. సమస్య తీవ్రమయ్యే వరకు వేచి ఉండకూడదు. తక్షణమే చర్యలు తీసుకోవాలి. ఒకసారి విషయం చివరి దశకు చేరితే అది ఖజా (జమాఅత్ న్యాయ వ్యవస్థ) పరిధిలోకి వెళుతుంది. ఆ తర్వాత అది ఇస్లాహీ కమిటీ చేతుల్లో ఉండదు. ఉదాహరణకు భార్య ఖులా కోసం దరఖాస్తు చేస్తే, అప్పటికే ఇస్లాహీ కమిటీ పని ముగిసినట్టే. ఆ తర్వాత విషయం ఖజా పరిధిలోకి వెళుతుంది. అందువల్ల ఇస్లాహీ కమిటీ ప్రారంభ దశలోనే సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలి."

చివరగా హుజూర్ ఇలా అన్నారు: "ఇస్లాహీ కమిటీ ప్రతి నెల సమావేశం నిర్వహించాలి. ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయో సమీక్షిస్తూ, వాటిపై సమయానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో నిర్ణయించాలి. మీరు మీ బాధ్యతలను నిర్వర్తించడంలో చురుకుగా ఉండాలి."

హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ ఇలా అన్నారు: తర్బియత్ (నైతిక మరియు ఆధ్యాత్మిక శిక్షణ) కార్యక్రమాలు పరస్పర సంభాషణాత్మకంగా (ఇంటరాక్టివ్‌గా) ఉండాలి. తర్బియత్ విషయంపై యువకులతో ప్రశ్నోత్తర కార్యక్రమాలను నిర్వహించాలి. యువకులు ఏ ప్రశ్న అడిగినా దానికి సమాధానం ఇవ్వాలి. ప్రశ్న ఎటువంటిదైనా, వారికి సంతృప్తి కలిగేలా, వారి సందేహం నివృత్తి అయ్యేలా సమాధానం చెప్పాలి. ఇటువంటి కార్యక్రమాలను ఇజ్తిమా (సమావేశం) సందర్భంగా నిర్వహించవచ్చు. యునైటెడ్ కింగ్‌డమ్‌లో జరిగిన ఒక ఇజ్తిమాలో కూడా ఇలాంటి కార్యక్రమం నిర్వహించారు. అక్కడ జామియా అహ్మదీయా విద్యార్థులు యువకులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. వారు తమకు అర్థమయ్యే భాషలో సరైన సమాధానాలు పొందినప్పుడు విషయాన్ని బాగా అర్థం చేసుకోగల్గుతారు. అలాంటి ఒక సమావేశంలో జమాఅత్ యొక్క చందా (ఆర్థిక విరాళాల) వ్యవస్థ గురించి, ఆ నిధులు ఎక్కడ ఖర్చు చేయబడతాయి, ఎలా వినియోగించబడతాయి, వాటి ద్వారా ఎలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించబడతాయి,అని వివరించారు. ఆ వివరణ విన్న తరువాత ఒక యువకుడు ఇంటికి వెళ్లి తన చందా తీసుకొచ్చి, "ఇప్పుడు నాకు జమాఅత్ ఆర్థిక వ్యవస్థ అర్థమైంది" అని చెప్పాడు.

(తదుపరి సంచికలో)

### 131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్ కొరకు 25, 26,27 డిశంబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ పవిత్ర సభలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సభతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక మహాసభ అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

(నజారత్ ఇస్లాహొ విర్షాద్ దక్షిణ భారత దేశపు ఖాదియాన్)

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz